అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 27-06-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించండి



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలి..
వెంటనే పనులను ప్రారంభించండి : కేంద్రమంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
వివరాలు 13లో.

సంపుటి : 10 సంచిక : 178 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను అభినందిస్తున్న ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ఇది ట్రైలరే..
ముందున్నది ముసళ్ల పండగ !

మోడీ ప్రభుత్వానికి ప్రతిపక్షం వార్నింగ్

ఓటమి తప్పదని తెలిసీ స్పీకర్ పదవికి పోటీ

ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లిందని సందేశం

18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా మరోసారి ఎన్నిక య్యారు. ఈ నేపథ్యంలో ఓటమి తప్పదని తెలిసి కూడా స్పీకర్ పదవికి పోటీ పెట్టి ప్రతిపక్షాలు ఏం సాధించాయన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్ష కూటమి తరఫున స్పీకర్ పదవికి పోటీ చేసిన కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కె.సురేష్ ఓడిపోయారు. మూజువాణీ ఓటుతో ఓం బిర్లా ఎన్నికయ్యారని ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ఓటింగ్‌కు పట్టుబట్టలేదు. సభలో తగిన సంఖ్యాబలం లేకపోవడంతో ఇండియా కూటమి ఓడిపోయినప్పటికీ...2014-24 కాలం మాదిరిగా 2024-29 ఉండబోదన్న సంకేతాన్ని పంపడంలో విజయం సాధించింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదని, ప్రతి దశలోనూ ప్రతిపక్షాల నుంచి రాజ్యాంగ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న అభిప్రాయాన్ని కలిగించగలిగింది. స్పీకర్ ఎన్నికలో పరాజయం తప్పదని తెలిసి కూడా పోటీ చేసిన ఇండియా బ్లాక్ ఏం సాధించిందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా దళితుల సంక్షేమ ఎజెండా తెరపైకి వచ్చింది. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు పూర్తి స్థాయిలో ఉపయోగించు కున్నాయి. స్పీకర్ ఎన్నిక సమయంలోనూ కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లోని ఇతర భాగస్వామ్య పక్షాలు తాము దళితుల బాగోగులకే కట్టుబడి ఉన్నామన్న సంకేతాన్ని పంపాయి. దళితుడైన సీనియర్ ఎంపీ కొడికున్నిల్ సురేష్‌ను స్పీకర్ పదవికి నిలబెట్టాయి. ఆయన ఎస్సీ కులానికి చెందిన 'చెరమార్' తెగకు చెందిన వారు. వాస్తవానికి సురేష్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. దళిత అభ్యర్థిని ప్రొటెం స్పీకర్ కానీయకుండా ఎన్డీఏ అడ్డుకుందన్న సందేశాన్ని ఇండియా బ్లాక్ జనంలోకి పంపింది.

స్పీకర్ ఎన్నిక విషయంలో ఇండియా బ్లాక్ ప్రజలకు మరో సందేశాన్ని కూడా పంపేందుకు ప్రయత్నించింది. అది రాజ్యాంగ సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన సందేశం. అధికార పక్షానికి చెందిన వారిని స్పీకర్‌గా, ప్రతిపక్ష సభ్యుడిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే అందుకు అంగీకరించేందుకు అధికారపక్షం సంసిద్ధత చూపలేదు. అందుకే స్పీకర్ పదవికి పోటీ పడటం ద్వారా సభా సాంప్రదాయాలను ఉల్లంఘిస్తున్న అధికార పక్ష తీరును ఎండగట్టింది. ప్రభుత్వ తీరును ప్రజల ముందుంచింది. అదే సమయంలో ఏకపక్ష నిర్ణయాలు ఇకపై సాగబోవని ప్రభుత్వానికి సవాలు విసిరింది.

ఇక రాజీ అనే మాటే లేదు

2019లో ప్రభుత్వం ఎవరినీ ఉప సభాపతిగా నియమించలేదు. ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు ఇప్పుడూ సిద్ధపడడం లేదు. దీనిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సంవత్సరాల తరబడి కొనసాగుతున్న సంప్రదాయాలను పాలక పక్షం ఉల్లంఘిస్తోందని ప్రజలకు గుర్తు చేస్తున్నాయి. రాజ్యాంగ విలువలను కాపాడేందుకే స్పీకర్ పదవికి పోటీ చేశామని చెబుతున్నాయి. గెలుస్తానా ఓడతానా అనేది తనకు తెలియదని, అయినా పోటీ చేస్తున్నానని సురేష్ మంగళవారం నాడే చెప్పారు. 'ఏకాభిప్రాయం గురించి ప్రధాని మాట్లాడుతుంటారు. కానీ మమ్మల్ని స్పీకర్ పదవికి పోటీ చేసేలా చేశారు. సంప్రదాయాలను తుంగలో తొక్కారు. 17వ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకుండా చేశారు. ఇప్పుడేమో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా స్పీకర్ పదవికి పోటీ అనివార్యం చేశారు' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ట్వీట్ చేశారు. ఏదేమైనా ప్రతిపక్ష కూటమి తన వైఖరికి సంబంధించి ప్రస్తుతానికి ట్రైలర్ మాత్రమే చూపించింది. అధికార పక్షంతో ఏ విషయంలోనూ రాజీ పడబోనని స్పష్టం చేసింది.

రాహుల్ నాయకత్వ సామర్థ్యం

స్పీకర్ ఎన్నిక విషయంలో రాహుల్ గాంధీ తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకు న్నారు. స్పీకర్ ఎన్నికపై ఆయన ...13లో

"లోక్‌సభలో విపక్షాల గొంతుకను అణచివేయకుండా వ్యవహరించాలి. సభలో ప్రతి ఒక్క సభ్యుడిని, పార్టీని గౌరవిస్తూ ఎవరి పట్లా వివక్ష చూపకుండా ఉంటారని మేం విశ్వసిస్తున్నాం. స్పీకర్‌గా

మా గొంతుకను అణచివేయొద్దు



మీకున్న అనుభవంతో సభను సజావుగా నడిపిస్తారనే నమ్మకం మాకు ఉంది. ఏ ప్రజా ప్రతినిధి గొంతు నొక్కకుండా నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ బహిష్కరణల పర్వం పునరావతం కానీయరాదని ఆశిస్తున్నాం. విపక్షంతో పాటు పాలక పక్షాన్నీ మీ నియంత్రణలో ఉంచాలి. అధికార పక్షంతో పాటు విపక్షాన్నీ మీరు సమదష్టితో చూస్తూ సమాన అవకాశాలు ఇవ్వాలి"

- ఎస్పీ చీఫ్, ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్‌యాదవ్

"ప్రజల గొంతుకను వినిపించేందుకు అనుమతించాలి. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు చొరవ చూపాలి. గతంతో పోలిస్తే ప్రస్తుత సభలో

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



విపక్షం జన గళాన్ని మరింత బలంగా వినిపిస్తుంది. సభా నిర్వహణలో పూర్తిగా సహకరిస్తాం. విపక్షం మాట్లాడేందుకు అనుమతించడంతో పాటు భారత ప్రజల పక్షాన తమ ప్రాతినిధ్యాన్ని అనుమతిస్తారనే విశ్వాసం మాకుంది."

-విపక్షనేత రాహుల్ గాంధీ



లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా
వరుసగా రెండోసారి

మూజువాణి ఓటుతో తీర్మానం ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా రెండో సారి ఎన్నికయ్యారు. బుధవారం లోక్‌సభలో జరిగిన స్పీకర్ ఎన్నిక మూజువాణి ఓటుతో ముగిసింది. తొలుత సభను ప్రారంభించిన ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన టీఎంసీ ఎంపీ అధికారి దీపక్ చేత ప్రమాణ స్వీకారం ...3లో

స్పీకర్ నోట ఎమర్జెన్సీ
భగ్గుమన్న ప్రతిపక్షాలు 3లో..

ఢిల్లీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
పంచాయితీ
బుజ్జగిస్తున్న హైకమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జగిత్యాలలో కాంగ్రెస్‌లో రగిలిన చిచ్చు కాస్త ఇపుడు టెన్‌జన్‌పథ్‌కు చేరింది. తనకు చెప్పకుండా జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకున్నారనే ఆవేదనతో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి... బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యే అడ్లూరి ...13లో

'మా ఉద్యోగాలు.. మాకు ఇప్పించండి'



6లో..

డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

మోకాళ్లపై కూర్చుని గురుకుల ఉపాధ్యాయుల నిరసన

సీఎం రేవంత్‌రెడ్డి నివాసం, గాంధీభవన్ వద్ద ఆందోళన

పెద్దమ్మ గుడి వద్ద భిక్షాటన

నీట్ స్కామ్‌పై మోడీ మౌనమేలా!
ఎన్టీఏను రద్దు చేయకపోవడం దుర్మార్గం

కేంద్రం స్పందించకపోతే దశలవారీగా పోరాటాలు : రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు

అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు



మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా పరీక్షతో పాటు ఎన్‌టీఏను రద్దు చేయకుండా ప్రధాని మోడీ మౌనంగా ఉండటం దుర్మార్గమని రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ విమర్శించింది. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధవారం నిరసనలు తెలిపారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీల ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ...13లో

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ
ఆరు డిమాండ్లను నెరవేర్చిన సర్కారు

రెండు డిమాండ్లపై సానుకూలత..

పరిష్కరించే దిశగా చర్యలు

ఉస్మానియా, గాంధీ హాస్టళ్లకు నిధులు మంజూరు

కాకతీయ మెడికల్ కాలేజీ రోడ్లకు ఫండ్ విడుదల



మీడియాతో మాట్లాడుతున్న వైద్యఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. జూడాల నాయకులతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ శాఖ ఉన్నతాధికారులు జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి సమక్షంలో సమ్మె విరమిస్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీహర్ష తదితరులు ప్రకటించారు. తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గ్రీన్ ఛానల్ ద్వారా ఉపకార వేతనాలు చెల్లించేందుకు ముందుగానే ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని తెలిపారు. త్వరలో సూపర్ ...13లో

అన్నదాత గోస..
రుణమాఫీ కటాఫ్ తేదీలపై రైతుల ఆందోళన



2018 డిసెంబర్ 12 - 2023 డిసెంబర్ 9 కటాఫ్‌తో అనర్హులుగా లక్షల మంది

నిర్ణీత తేదీకి ముందు రుణం తీసుకున్న వారి పరిస్థితి అయోమయం

కేసీఆర్ హయాంలో కొద్దిమందికే రుణమాఫీ.. అది కూడా విడతల వారీ మాఫీ

కొందరికి రెండు విడతల మాఫీనే అమలు.. వడ్డీలు పెరగటంతో వర్తించని పథకం

నాడు రూ.60వేలు లోన్ తీసుకుంటే నేడు వడ్డీతో కలిపి రూ.2లక్షల సమీపానికి..

కటాఫ్ ప్రారంభ తేదీని మార్చాలని డిమాండ్

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు పంట రుణాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు మాఫీ చేసేందుకు నిర్ణయించడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. అయితే మార్గదర్శకాలు ఎలా ఉంటాయనే దానిపై కొంత ఆందోళన నెలకొంది. ముఖ్యంగా కటాఫ్ తేదీల నిర్ధారణతో లక్షలాది మంది రైతులు ఈ పథకానికి అనర్హులయ్యే ప్రమాదం ఉంది. విధివిధానాలు ఖరారు చేసి జీవో విడుదల చేసే సమయంలోనైనా కటాఫ్ తేదీల విషయంలో మార్పులు చేర్పులు చేయాలని రైతులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.లక్షలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని నాటి కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక రుణమాఫీ పథకం ఆచరణలో రకరకాల కొర్రీలు పెట్టింది. ఏకకాలంలో కాకుండా విడతల వారీ అమలుతో అర్హతున్నా చాలా మంది రైతులు అనర్హులయ్యారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. నాడు కేసీఆర్ సర్కారు ఏ కటాఫ్ తేదీ (2018 డిసెంబర్ 11)తో ముగించిందో ఆ మరుసటి రోజు (2018 డిసెంబర్ 12) నుంచి రూ.2లక్షల పంట రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. 2018 డిసెంబర్ 12 నుంచి సోనియాగాంధీ జన్మదినోత్సవమైన 2023 డిసెంబర్ 9వ తేదీని కటాఫ్‌గా ప్రకటించింది. ముగింపు తేదీ విషయంలో రైతులకు ఎలాంటి అభ్యంతరం లేకపోయినా కటాఫ్ డేట్స్ ప్రారంభ తేదీ (2018 డిసెంబర్ 12)లో మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసీఆర్ అలా.. రేవంత్ ఇలా..

2018 పంట రుణమాఫీని నాటి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్ల తర్వాత జీవో ఆర్‌టీ నం.148 డేట్ 17.03.2020 ద్వారా అమల్లోకి తెచ్చింది. ఈ జీవో ప్రకారం పంట రుణమాఫీ పథకం-2018 అమలు కోసం మార్గదర్శకాలు విడుదల చేసింది. 'లెండింగ్ ఇనిస్టిట్యూషన్స్' అని పిలువబడే తెలంగాణ రాష్ట్రంలో రైతులకు పంపిణీ చేయబడిన బంగారంపై స్వల్పకాలిక ఉత్పత్తి రుణాలు, పంట రుణాలను ఈ పథకం కవర్ చేస్తుంది అని పేర్కొంది. ఎన్నికల సమయంలో రూ.లక్ష లోపు రైతులందరి పంట రుణాలని హామీ ఇచ్చినా.. ఆచరణలో కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకుంది. ఫ్యామిలీ అనే పదంతో సగం మందికి పైగా రైతులు అనర్హులయ్యారు. ఏప్రిల్ ...6లో

నాడు 67వేలు తీసుకుంటే..
నేడు రూ.2లక్షల వరకు..

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లికి చెందిన మోరా కోటిరెడ్డి అనే రైతు 2015లో ఖమ్మంలోని కెనరా బ్యాంకులో రూ.67వేల పంట రుణం తీసుకున్నారు. 2020లో కేసీఆర్ స్కీం అమలు చేసే నాటికి అసలు, వడ్డీ ...6లో

ఆస్ట్రేలియాకు అసాంజే
సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత స్వదేశానికి



కాన్‌బెర్రా : అమెరికా కీలక రహస్యాన్ని బహిర్గతం చేసి.. సంచలనం సృష్టించిన వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే తన తప్పును అంగీకరించాక.. తన సొంత దేశం ఆస్ట్రేలియాకు వెళ్లారు. అమెరికాలోని మరియానా దీవుల రాజధాని సైపాన్ నుంచి ఆరు గంటలపాటు ప్రయాణం చేసి ఆస్ట్రేలియా రాజధాని కాన్ బెర్రా చేరుకున్నారు. యూఎస్ జస్టిస్ ...13లో

ఫామ్‌హౌస్‌లో
గులాబీ బాస్ బిజీ బిజీ
కేసీఆర్‌తో మరో ఆరుగురు ఎమ్మెల్యేల భేటీ


తొలి రోజు గైర్హాజరైన ఐదుగురిలో నలుగురు హాజరు

రాజకీయ పరిస్థితులు, పార్టీ ఉనికిపై చర్చ

విద్యా సంస్థల్ని కాపాడుకునే ఎత్తుగడలో మల్లారెడ్డి

నియోజకవర్గ అభివృద్ధి దిశగా సుధీర్‌రెడ్డి అడుగులు

సీక్రెట్ అంటూ దాటవేసిన మేడ్చల్ ఎమ్మెల్యే



కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా సాగుతున్న వరుస భేటీల్లో పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ ఏం దిశా నిర్దేశం చేస్తున్నారనేది ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో పార్టీ వీడుతున్న ఎమ్మెల్యేలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్ ఉనికి, ఉలికిపాటుకు గురవుతున్న పార్టీ కేడర్ వంటి అంశాలపై చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. వరుసగా వేర్వేరుగా సాగుతున్న భేటీలు ఏ మేరకు ఫలితాలిస్తాయన్న దానిపై ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. పార్టీ ఉనికి గురించి కేసీఆర్ చెబుతున్న భవిష్యవాణీ, ఇస్తున్న భరోసా ఎంత మంది ఎమ్మెల్యేల చెవికెక్కుతుందో..? ఎంత మంది ఎమ్మెల్యేలు పెడ చెవిన పెడతారో..? కాలమే నిర్ణయించనుంది. మంగళవారం జరిపిన భేటీకి గైర్హాజరైన ఐదుగురు ...13లో

అరుంధతీ రాయ్‌పై ఉపా కేసు ఎత్తేయాలి

- మతోన్మాదాన్ని ప్రశ్నించినందునే కక్ష.. : ప్రొఫెసర్ హరగోపాల్
- 'అరుంధతీ రాయ్‌పై ఉపా కేసు-వాస్తవాలు' అంశంపై ఓయూలో సదస్సు

నవతెలంగాణ-ఓయూ

రచయిత్రి అరుంధతీ రాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై ఢిల్లీ పోలీసులు మోపిన ఊపా కేసును ఎత్తేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. పోలీసులు మోపిన ఊపా కేసుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికే సక్సేనా అనుమతి మంజూరు చేయడాన్ని ఖండిస్తూ.. ఓయూ విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో 'అరుంధతీ రాయ్‌పై ఉపా కేసు-వాస్తవాలు'

అనే అంశంపై బుధవారం హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యార్థి నాయకుడు, రీసర్చ్ స్కాలర్ నెల్లి సత్య అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగించారు. పెరిగిపోతున్న మతోన్మాదాన్ని తన రచనల ద్వారా అరుంధతీ రాయ్ దేశంలో తీవ్రంగా విమర్శించారని తెలిపారు. ఈ క్రమంలోనే 2010 అక్టోబర్ 21న ఢిల్లీలో



జరిగిన "ఆజాది ది ఓన్లీ వే" అనే సదస్సులో జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి ఉన్న స్వయం ప్రతిపత్తి, అక్కడి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై ఆమె చర్చించిన కారణంగా రూట్స్ ఇన్ కాశ్మీర్ సంస్థ సభ్యుడు సుశీల్ పండిట్ ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు ఆమెపై, ఆ సదస్సులో పాల్గొన్న ఇతరులపై ఉపా కేసు పెట్టారని తెలిపారు. 14 సంవత్సరాల తర్వాత ఇప్పుడు దాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు అనుమతి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బీజేపీ నియంతృత్వ పోకడలకు సాధారణ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ బుద్ధి మారలేదన్నారు. తక్షణమే అరుంధతీ రాయ్‌తోపాటు ఇతరులపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్, విద్యార్థి నాయకుడు రీసర్చ్ స్కాలర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అనేక ప్రజా ఉద్యమాలు, సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉంటూ బాసటగా నిలిచిన వారిపైనా ఉపా కేసులు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసి భావ ప్రకటనా స్వేచ్ఛను హరించాయని విమర్శించారు. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్నందునే అరుంధతీ రాయ్‌పై కేంద్రం కక్షగట్టి ఉపా కేసు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ ప్రొ.డాక్టర్ వంశీధర్, విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పెంచాల సతీష్, వలిగొండ నరసింహ, తాళ్ల అజయ్, రవి నాయక్, సుమంత్, శ్రీనివాస్, అజయ్, భగత్, పవన్, అశ్విన్, రమేష్, కోటి, రుక్మత్ పాషా, వికాస్ పాల్గొన్నారు.

నీటి పొదుపుతో ఎక్కువ సాగు చేయాలి

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నీటిని పొదుపు చేయడం ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి సూచించారు. హైదరాబాద్ హిమయత్‌సాగర్‌లోని నీరు, భూ యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ నరేందర్, ఇతర అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని నీటి పొదుపుగా వాడుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ సంస్థకు ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా, గత పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు నయా పైసా ఇవ్వక పోవడంతో పరిశోధనలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రిటైర్డ్ అధికారులు బొమ్మిరెడ్డి కృపాకర్‌రెడ్డి, డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఉజ్బెకిస్థాన్ రాయబారి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉజ్బెకిస్థాన్ రాయబారి సర్దోర్ రుస్తాంబేవ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా సీఎస్‌ను కలిసారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర విషయాలను సీఎస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ సెకండ్ ఇన్నింగ్స్ !

రాజకీయ జీవితంలో తొలిసారి ప్రతిపక్ష నేతగా ఎంపిక

- రాజ్యాంగ పదవుల భర్తీలో కీలక పాత్ర
- ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష... వ్యాఖ్యలు... విమర్శలు
- పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి ఆయనే అధిపతి
- క్యాబినెట్ మంత్రి హోదాతో పెరిగిన బాధ్యతలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాజకీయ జీవితంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించారు. బుధవారం ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను సంప్రదాయం ప్రకారం సభాపతి స్థానం వరకూ తీసుకుని వెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఎన్నికైన రాహుల్‌కు క్యాబినెట్ మంత్రి హోదా లభిస్తుంది. ప్రొటోకాల్ జాబితాలో కూడా ఆయన స్థానం పెరుగుతుంది. భవిష్యత్తులో ప్రతిపక్ష కూటమి తరపున ఆయనే సహజంగా ప్రధాని పదవికి పోటీ పడతారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన పదవిని స్వీకరించడం ఇదే మొదటిసారి.

కేరళలోని వయనాడ్, యూపీలోని రాయబరేలీ నుండి ఎన్నికైన రాహుల్ తర్జనభర్జనల అనంతరం వయనాడ్‌ను వదులుకున్న విషయం తెలిసిందే. రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేస్తారు. రాహుల్ 2004లో తొలిసారి యూపీలోని అమేథీ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత అమేథీ నుంచే ఆయన మూడు సార్లు దిగువసభకు ప్రాతినిధ్యం వహించారు. 2019లో మాత్రం వయనాడ్ నుండి ఎన్నికయ్యారు.

లభించే సౌకర్యాలివే..

ప్రతిపక్ష నేత రాహుల్‌కు క్యాబినెట్ మంత్రి హోదా లభిస్తుంది. ప్రభుత్వం ఆయనకు బంగ్లా సమకూరుస్తుంది. సచివాలయంలో కార్యాలయం ఉంటుంది. గరిష్ట స్థాయిలో భద్రత కల్పిస్తారు. విమానం, రైలులో ఉచితంగా ప్రయాణించవచ్చు. నెలకు జీతం, ఇతర అలవెన్సులు కలిపి రూ.3.30 లక్షలు లభిస్తాయి. హాస్పిటాలిటీ అలవెన్సు కూడా ఇస్తారు. ప్రతి సంవత్సరం దేశంలో ఎక్కడికైనా 48 ప్రయాణాలకు అలవెన్సు లభిస్తుంది. ఇక టెలిఫోన్, కార్యదర్శి, వైద్య సౌకర్యం సరేసరి.

గాంధీ కుటుంబంలో మూడో వ్యక్తి

గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తి లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించడం ఇది మూడోసారి. గతంలో సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ ఈ బాధ్యతను నిర్వర్తించారు. సోనియా 1999 అక్టోబర్ 13 నుంచి 2004 ఫిబ్రవరి 6వ తేదీ వరకూ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అంతకుముందు రాజీవ్ 1989 డిసెంబర్ 18 నుండి 1990 డిసెంబర్ 24 వరకూ ఈ పదవిలో కొనసాగారు. 2014, 2019లో ప్రతిపక్ష హోదా కోరేందుకు అవసరమైన సంఖ్యాబలం కాంగ్రెస్‌కు లభించలేదు. 2019లో 52 స్థానాలు మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్, ఇప్పుడు దానికి దాదాపు రెట్టింపు సంఖ్యలో 99 సీట్లు సాధించింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం 44 స్థానాలు మాత్రమే వచ్చాయి. ఈ రెండు సందర్భాల్లోనూ బీజేపీ తర్వాత సభలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందలేకపోయింది. నిబంధనల ప్రకారం దిగువసభలోని మొత్తం స్థానాల్లో కనీసం 10 శాతం సీట్లను గెలుచుకోలేకపోతే ప్రతిపక్ష నేత పదవిని కోరే హక్కు లభించదు.

ప్రతిపక్ష నేత నిర్వహించే పాత్ర ఏమిటి?

లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలుగా వ్యవహరించే వారికి 1977లో చట్టబద్ధమైన గుర్తింపు లభించింది. రాజ్యాంగ పదవులకు నియామకాలు జరిపేటప్పుడు ఆ ప్రక్రియలో ప్రతిపక్ష నేత భాగస్వామి అవుతాడు. ఇప్పుడు రాహుల్ ప్రతిపక్ష నేత అయినందున లోక్‌పాల్, సీబీఐ డైరెక్టర్, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధిపతి నియామకాల కోసం ఏర్పాటు చేసే కమిటీల్లో ప్రతిపక్ష నేత హోదాలో సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఈ నియామకాల కోసం నిర్వహించే సమావేశాలకు ప్రధాని మోడీతో పాటు ఆయన కూడా హాజరవుతారు.

ప్రధాని, ఇతర సభ్యులు కూర్చునే టేబుల్ వద్దే రాహుల్ కూడా ఆశీనులవుతారు. రాజ్యాంగ పదవుల్లో నియామకాలు జరపడానికి ముందు ప్రతిపక్ష నేత అయిన రాహుల్ సమ్మతిని ప్రధాని తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ కమిటీలలో కూడా రాహుల్ భాగస్వామిగా ఉంటారు. ప్రభుత్వం తీసుకునే ఆర్థికపరమైన నిర్ణయాలను ఆయన నిరంతరం సమీక్షించవచ్చు. ప్రభుత్వ నిర్ణయాలపై వ్యాఖ్యలు చేయవచ్చు. ప్రభుత్వ వ్యయాలను పరిశీలించే పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి ప్రతిపక్ష నేతే అధిపతిగా ఉంటారు.

ప్రభుత్వ వ్యయాలను సమీక్షించిన తర్వాత వాటిపై వ్యాఖ్యానాలు చేస్తారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ప్రధాన కమిటీలలో కూడా చేరవచ్చు. ప్రభుత్వ పనితీరును నిరంతరం సమీక్షించే హక్కు ఆయనకు ఉంటుంది.

గురుతరమైన బాధ్యతే

ప్రతిపక్ష నేత పనితీరు సభాపతికి పూర్తి భిన్నంగా ఉంటుంది. కానీ సభలో ఆ బాధ్యతకు చాలా ప్రాధాన్యత ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రతిపక్షం కీలకపాత్ర నిర్వహిస్తుంది. ప్రతిపక్షాలు సమర్థవంతమైన విమర్శలు చేయాల్సి ఉంటుంది. కాబట్టి పార్లమెంటులో ప్రతిపక్షాలు అత్యంత ప్రాముఖ్యత కలిగిన భూమిక నిర్వహిస్తాయ నడంలో సందేహమేమీ లేదు. అధికార పార్టీ ప్రభుత్వాన్ని నడుపుతుంటే ప్రతిపక్షం పరిపాలనలోని తప్పులను ఎత్తి చూపుతూ విమర్శిస్తుంది. కాబట్టి ఈ రెండింటికీ కర్తవ్యాలు, హక్కులు ఉంటాయి. ప్రభుత్వంపై, మంత్రులపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల విధి. ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి ఏకాభిప్రాయంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. పరస్పరం గౌరవించుకుంటూ సహనంతో వ్యవహరించకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటుంది.

లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా

(మొదటి పేజీ తరువాయి)

చేయించారు. అనంతరం మెహతాబ్ మాట్లాడుతూ స్పీకర్ ఎన్నికకు సంబంధించి 17 తీర్మాన నోటీసులు వచ్చాయని, అన్నింటికీ ఆర్డర్‌లో అనుమతిస్తామని అన్నారు. అందులో ఎన్డీఏ నుంచి 14 తీర్మానాలు ప్రవేశపెట్టగా, ఇండియా ఫోరం తరపున మూడు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఎన్డీఏ లోక్‌సభ స్పీకర్ అభ్యర్థి ఓం బిర్లా తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బలపరిచారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (జేడీయూ) తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దాన్ని రాజ్‌కుమార్ సంగ్వాన్ (ఆర్‌ఎల్‌డి) బలపరిచారు. కేంద్ర మంత్రి జితిన్ రామ్ మంఝీ (హెచ్‌ఎం) తీర్మానం ప్రవేశపెట్టగా, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ (బీజేపీ) బలపరిచారు. ఐదో తీర్మానాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. దాన్ని మరో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బలపరిచారు. ఆరో తీర్మానాన్ని కేంద్ర మంత్రి జాదవ్ ప్రతాప్‌రావు గణపతిరావు (శివసేన-షిండే) ప్రవేశపెట్టగా టట్కారే సునీల్ దత్తాత్రేయా (ఎన్‌సీపీ-అజిత్ పవర్) బలపరిచారు. ఏడో తీర్మానాన్ని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జెపి) ప్రవేశపెట్టగా, జోయంత బసుమతరీ (యూపీపీఎల్) బలపరిచారు. ఎనిమిదో తీర్మానాన్ని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి (జేడీఎస్) ప్రవేశపెట్టగా, వల్లభనేని బాలశౌరి (జనసేన) బలపరిచారు. తొమ్మిదో తీర్మానం కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ) ప్రవేశపెట్టగా, లావు శ్రీ కృష్ణదేవరాయులు (టీడీపీ) బలపరిచారు. పదో తీర్మానాన్ని ఇంద్ర హంగ్ సుబ్బా (సిక్కిం కాంత్రికారి మోర్చా) ప్రవేశపెట్టగా, ఫణి భూషణ్ చౌదరి (అస్సాం గణ పరిషత్) బలపరిచారు. 11వ తీర్మానం కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్ (అప్నాదళ్) ప్రవేశపెట్టగా, కేంద్రమంత్రి కృష్ణన్ పాల్ (బీజేపీ) బలపరిచారు. 12వ తీర్మానం కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ (బీజేపీ) ప్రవేశపెట్టగా, కేంద్ర మంత్రి జుయల్ ఓరం (బీజేపీ) బలపరిచారు. 13వ తీర్మానాన్ని ఎస్.పి. సింగ్ బఘేల్ (బీజేపీ) ప్రవేశపెట్టగా, పంకజ్ చౌదరి (బీజేపీ) బలపరిచారు. 14వ తీర్మానాన్ని అన్నపూర్ణదేవి (బీజేపీ) ప్రవేశపెట్టగా, కమల్జీత్ సెహ్రావత్ (బీజేపీ) బలపరిచారు.

ఇండియా ఫోరం అభ్యర్థి కె. సురేష్ తరపున తీర్మానాన్ని అరవింద్ గణపత్ సావంత్ (శివసేన-ఠాక్రే) ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్పీ) బలపరిచారు. రెండో తీర్మానాన్ని ఆనంద్ భదౌరియా (ఎస్పీ) ప్రవేశపెట్టగా, తారిఖ్ అన్వర్ (కాంగ్రెస్) బలపరిచారు. మూడో తీర్మానాన్ని సుప్రియా సులే (ఎన్సీపీ-శరద్‌పవార్) ప్రవేశపెట్టగా, కనిమొళి (డీఎంకే) బలపరిచారు. అనంతరం ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ మూజువాణి ఓటుతో స్పీకర్‌గా ఓం బిర్లాను ప్రతిపాదిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందినట్టు ప్రకటించారు. ఆపైన ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నికైనట్టు ప్రకటించి ఓం బిర్లా స్పీకర్ చైర్‌ను అధిష్టించాలని ఆహ్వానించారు. అయితే కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (జేడీయూ) లేచి డివిజన్ (ఓటింగ్)కు డిమాండ్ చేశారు. అందుకు ప్రొటెం స్పీకర్ మెహతాబ్ జోక్యం చేసుకుని, ఆ స్టేజ్ దాటిపోయామని బదులిచ్చారు. ఓం బిర్లాను స్పీకర్ చైర్‌ను అధిష్టించాలని మళ్లీ పిలిచారు.

రాహుల్‌తో మోడీ కరచాలనం


ఓం బిర్లా వద్దకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన వెంట పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెళ్లారు. ఓం బిర్లాను ప్రధాని మోడీ కరచాలనం చేసుకొని అభినందనలు తెలిపారు. వెంటనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఓం బిర్లా వద్దకు వచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆ వెంటనే ప్రధాని మోడీకి రాహుల్‌గాంధీ కరచాలనం చేశారు. అనంతరం ఓం బిర్లాను ప్రధాని మోడీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పీకర్ స్థానానికి తీసుకెళ్లారు. అక్కడ అప్పటికే ఉన్న ప్రొటెం స్పీకర్ మెహతాబ్, ఓం బిర్లాకు షేక్‌హ్యాండ్ ఇచ్చుకుని అక్కడి నుంచి నిష్క్రమించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లాకు ప్రధాని మోడీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభినందనలు తెలిపి వెనుదిరిగారు.



వెంటనే స్పీకర్ తన సీట్లో కూర్చున్నారు. వివిధ పార్టీల సభ్యులు స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తరువాత ప్రధాని మోడీ మంత్రులను సభకు పరిచయం చేశారు.

స్పీకర్ నోట 'ఎమర్జెన్సీ'

భగ్గుమన్న ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా తొలి ప్రసంగంలో 'ఎమర్జెన్సీ ' అంశాన్ని ప్రస్తావించారు. అత్యయిక స్థితి నాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ సభలో మౌనం పాటించారు. అయితే, స్పీకర్ ప్రసంగంపై కాంగ్రెస్ సహ విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'పై తీసుకొచ్చిన తీర్మానాన్ని చదవి వినిపించారు. "1975, జూన్ 25 మన దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆ రోజున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ని విధించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. ప్రపంచంలోనే మనం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు సాధించాం. ఆ ప్రజాస్వామ్య విలువలు, చర్చలు దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ, నాటి ప్రధాని (ఇందిరాగాంధీ) నియంతృత్వాన్ని అమలు చేశారు. ప్రజాస్వామ్య సూత్రాలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణగదొక్కారు. ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారు. మీడియాపై ఆంక్షలు విధిం చారు. యావత్ దేశం కారాగారంగా మారి పోయింది" అని స్పీకర్ గుర్తుచేశారు. నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం అత్యయిక స్థితిని ఎదిరించిన వారిని తాము అభినందిస్తున్నామని ఓం బిర్లా అన్నారు. అనంతరం నాటి చీకటి రోజులకు నివాళిగా సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దామని సభ్యులను కోరారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. అయితే, స్పీకర్ మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలు నిరసన వ్యక్తం చేశారు.

స్పీకర్ ప్రసంగంపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. "ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి అప్పటి ప్రభుత్వం సాగించిన అన్యాయాలను ఆయన ఎత్తిచూపారు. దాదాపు 50 ఏండ్ల

నేటి తరం తెలుసుకోవాలి : మోడీ

కిందట దేశంలో అత్యయిక స్థితిని విధించారు. దాని గురించి నేటి తరం తెలుసుకోవడం చాలా ముఖ్యం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి.. ప్రజాభిప్రాయాన్ని అణచివేసి, సంస్థలు నాశనం చేసినప్పుడు సమాజం ఎలా ఉంటుందో చెప్పేందుకు నాటి రోజులే సరైన ఉదాహరణ. నియంతృత్వం ఎలా ఉంటుందో ఎమర్జెన్సీ పరిస్థితుల నుంచి తెలుసుకోవచ్చు" అని మోడీ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.

ఇజ్రాయిల్‌కు యుద్ధ సామగ్రి సరఫరా

- రాకెట్లు, పేలుడు పదార్థాలు విక్రయించిన భారత్
- ఒకవైపు చర్చల ద్వారానే ఘర్షణలను నివారించుకోవాలంటూ సుద్దులు
- మరోవైపు యుద్ధ సామగ్రిని చేరవేస్తూ అగ్నికి ఆజ్యం
- మోడీ సర్కార్ ద్వంద్వ నీతి



న్యూఢిల్లీ : గాజాలోని పాలస్తీనీయులపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం యుద్ధ సామగ్రిని విక్రయించింది. సరకు రవాణా నౌకల ద్వారా రాకెట్లు, పేలుడు పదార్థాలు చేరవేసింది. ఇవి గాజా స్ట్రిప్‌కు 30 కిలోమీటర్ల దూరంలో గల ఇజ్రాయిల్‌లోని అష్‌దాద్ ఓడరేవుకు చేరాయని అల్ జజీరా తెలిపింది. ఏప్రిల్ 2న చెన్నయ్ నుండి బయలుదేరిన నౌక హౌతీల దాడుల నేపథ్యంలో ఎర్ర సముద్రం ద్వారా కాకుండా ఆఫ్రికా మీదుగా ఇజ్రాయిల్ చేరుకుంది. యుద్ధ సామగ్రి రవాణాకు సంబంధించిన కీలక పత్రాలు అల్ జజీరాకు లభించాయి.

బార్కమ్ పేరుతో ఉన్న ఈ నౌకలో 20 టన్నుల రాకెట్ ఇంజిన్లు, 12.5 టన్నుల బరువున్న పేలుడు స్వభావం కలిగిన రాకెట్లు, 1500 కిలోల పేలుడు పదార్థాలు, 740 కిలోల ప్రమాదకర వాయువులు ఉన్నాయి. యుద్ధ సామగ్రి ఇజ్రాయిల్‌కు, దాని రక్షణ సంస్థ ఐఎంఐ సిస్టమ్స్‌కు సరఫరా అవుతున్న విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టకూడదని నౌకలోని ఉద్యోగులు, కన్సల్టెంట్లకు ఆదేశాలిచ్చారు. అందుకే ఈ ఓడలో ఇజ్రాయిల్‌కు ఆయుధాలు కానీ, ఇతర సామగ్రి కానీ రవాణా కాలేదని దాని వాణిజ్య మేనేజర్ సంస్థ బుకాయించింది. భారత్ నుంచి బయలుదేరిన రెండో నౌకను మే 21న స్పెయిన్‌లోని కార్టాజనా ఓడరేవులోకి అనుమతించలేదు. ఈ నౌక చెన్నయ్ నుండి 27 టన్నుల పేలుడు పదార్థాలతో ఇజ్రాయిల్‌లోని హైఫా ఓడరేవుకు బయలుదేరిందని స్పెయిన్ పత్రిక తెలిపింది. ఇజ్రాయిల్‌కు యుద్ధ సామగ్రిని సరఫరా చేస్తున్నందునే తమ ఓడరేవులోకి అనుమతి నిరాకరించామని స్పెయిన్ విదేశాంగ మంత్రి తెలిపారు. చర్చల ద్వారానే ఘర్షణలను నివారించుకోవాలని సుద్దులు చెబుతున్న భారత్ ఈ విధంగా ఇజ్రాయిల్‌కు యుద్ధ సామగ్రిని చేరవేసి అగ్నికి ఆజ్యం పోయడాన్ని శాంతి కాముకులు గర్హించారు. కొన్ని సంవత్సరాలుగా భారత్, ఇజ్రాయిల్ మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకుడు జెయిన్ హుస్సేన్ చెప్పారు. ఈ నెల 6న గాజా లోని ఐరాస శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ బాంబు దాడి జరిపింది. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు జారవిడిచిన ఓ క్షిపణి శకలాలపై 'మేడ్ ఇన్ ఇండియా' అనే లేబుల్ కన్పించింది. ఉపరితలం నుండి గగనతలంలోకి ప్రయోగించే మధ్య, దీర్ఘ శ్రేణి క్షిపణులను ఇజ్రాయిల్ కోసం అభివృద్ధి చేశామని మన దేశానికి చెందిన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంగీకరించారు. భారత్-ఇజ్రాయిల్ భాగస్వామ్యం రాకెట్ ప్రొపెల్లర్లకు మాత్రమే పరిమితం కాలేదు. హైదరాబాద్‌లో ఇజ్రాయిల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్‌తో కలిసి అదానీ గ్రూపు మానవ రహిత గగనతల వాహక కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ప్రజాపోరాటాన్ని ఆపొద్దు

- ఆప్ మంత్రిని పరామర్శించిన బృందాకరత్, అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రజల కోసం చేస్తున్న పోరాటాన్ని ఆపొద్దని, ప్రజాసమస్యలపై జరిగే ఉద్యమాలకు అండగా ఉంటామని సీపీఐ (ఎం) నాయకురాలు బృందాకరత్ భరోసానిచ్చారు. న్యూఢిల్లీలోని ఎల్‌ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఢిల్లీ క్యాబినెట్ మంత్రి అతిషిని ఆమె బుధవారం పరామర్శించారు. ఢిల్లీ నీటి సమస్యపై నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన అతిషి ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రి పాలైన విషయం విదితమే. ఈనేపథ్యంలో సమాజ్‌వాద్‌పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా మంత్రి అతిషిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి అతిషి ఆరోగ్యం గురించి ఆరా తీసేందుకు ఆస్పత్రికి వచ్చినట్టు తెలిపారు. ఆప్ మంత్రి అతిషికి ధైర్యం మాత్రమే కాదు... ప్రజల కోసం ఎలా పోరాడాలో తెలుసని అన్నారు. ఢిల్లీ నీటి సమస్య పరిష్కారం కోసం ఆమె నిరంతరం పోరాడుతూనే ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీపై అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఢిల్లీ ప్రభుత్వంపై కేంద్రం చాలా వివక్ష చూపిందని, ఢిల్లీ సీఎంకు అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. బీజేపీకి ముప్పు కలిగించే వ్యక్తులపై సీబీఐ, ఈడీని ప్రయోగిస్తున్నారని, ఆ సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



అతిషిని పరామర్శిస్తున్న బృందాకరత్

నాడు సస్పెండైన వారే నేడు మంత్రులు!

ఓడినా మంత్రులైన ఇద్దరు మాజీలు

- జేడీయూ రాజ్యసభ సభ్యుడు కూడా...
- తిరిగి లోక్‌సభలో ప్రవేశించిన 58 మంది ఎంపీలు



న్యూఢిల్లీ : గత పార్లమెంట్ సమావేశాల సమయంలో ఉభయ సభల నుండి ప్రతిపక్ష పార్టీలకు చెందిన 146 మంది సభ్యులు సస్పెన్షన్‌కుగురయ్యారు. దిగువసభ స్పీకర్ ఓం బిర్లా, ఎగువసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్‌లు అసాధారణ నిర్ణయాలు తీసుకొని వారిని సాగనంపారు. ఆనాడు లోక్‌సభ నుండి సస్పెన్షన్‌కు గురైన 22 మంది ఎంపీలు తాజా ఎన్నికల్లో పోటీ చేయలేదు. డీఎంకేకు చెందిన సభ్యుడు గణేశ మూర్తి చనిపోయారు. 58 మంది సభ్యులు మాత్రం తిరిగి దిగువసభలో ప్రవేశించారు.

17వ లోక్‌సభలో బీజేపీకి పూర్తి మెజారిటీ ఉండడంతో ప్రభుత్వం ఆడింది ఆట...పాడింది పాటలా సాగిపోయింది. సభలో గొంతెత్తితే చాలు...వారిని సస్పెండ్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రతిపక్ష సభ్యులెవ్వరూ సభలో లేకుండానే అనేక కీలకమైన బిల్లులకు ఆమోదముద్ర వేయించుకున్నారు. ఇప్పుడు 18వ లోక్‌సభ కొలువుదీరింది. నాడు స్పీకర్ ఓం బిర్లా సస్పెన్షన్ వేటు వేసిన ముగ్గురు ప్రతిపక్ష సభ్యులు ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో మంత్రులయ్యారు.

ఆ 52 మంది పున : ప్రవేశం

జేడీయూను మినహాయించి గత శీతాకాల సమావేశాల్లో సస్పెన్షకు గురైన 52 మంది సభ్యులు తిరిగి సభలో ప్రవేశించారు. ఏడుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఇప్పటికే పూర్తైనందున మిగిలిన సభ్యులు సభలో కొనసాగుతున్నారు. గత లోక్‌సభలో అనర్హత వేటు పడిన ఇద్దరు ఎంపీలు... రాహుల్ గాంధీ, మహువా మొయిత్రాలు తిరిగి సభలో ప్రవేశించారు. రాహుల్ ప్రతిపక్ష నేత అయ్యారు.

వారిద్దరికీ లక్కీ ఛాన్స్

లూథియానా నుండి కాంగ్రెస్ తరఫున 17వ లోక్‌సభకు ఎన్నికైన రవనీత్ సింగ్ బిట్టూ ఇప్పుడు మోడీ సర్కారులో మంత్రిగా ఎంపికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించకపోయినా ఆయనను మంత్రి గా నియమించారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనుమడైన బిట్టూ సార్వత్రిక ఎన్నికలకు ముందు గోడ దూకారు. అయితే లూథియానా ఓటర్లు మరోసారి కాంగ్రెస్‌కే ఓటేశారు. అయినప్పటికీ మోడీ ఆయనకు మంత్రి పదవిని కట్టబెట్టారు. కాంగ్రెస్‌కు చెందిన మరో ఎంపీ గీతా కోడా కూడా బీజేపీలో చేరి జార్ఖండ్‌లోని సింఘ్‌భుమ్ నుండి బరిలో దిగి ఓటమి పాలయ్యారు. అయినా ఆమెను మంత్రి పదవి వరించింది. గత శీతాకాల సమావేశాల్లో సస్పెన్షన్‌కు గురైన ఆమ్‌ఆద్మీ ఎంపీ సుశీల్ కుమార్ రింకు బీజేపీ తీర్థం పుచ్చుకొని జలంధర్‌లో పోటీ చేశారు. అయితే లూథియానా, సింఘ్‌భుమ్‌లో జరిగిందే జలంధర్‌లోనూ జరిగింది. ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ మంచి మెజారిటీతో గెలుపొందారు.

జేడీయూ సభ్యులు ఎక్కువే

సస్పెన్షన్ గురైన వారిలో జేడీయూకు చెందిన వారు ఎక్కువగానే ఉన్నారు. శీతాకాల సమావేశాల్లో సస్పెన్షకు గురైన జేడీయూ ఎంపీ లల్లన్ సింగ్ తాజా ఎన్నికల్లో విజయం సాధించారు. అదే పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు రామ్‌నాథ్ ఠాకూర్‌ను గత సమావేశాల్లో సస్పెండ్ చేశారు. ఆయన ఇప్పుడు మోడీ క్యాబినెట్‌లో మంత్రి అయ్యారు. గత శీతాకాల సమావేశాల్లో సస్పెండ్ అయిన జేడీయూ ఎంపీలు దులాల్ చంద్ర గోస్వామి, చంద్రేశ్వర్ ప్రసాద్ తాజా ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ పార్టీకే చెందిన నలుగురు ఎంపీలు ఇప్పుడు బీజేపీ సభ్యులుగా లోక్‌సభలో ప్రవేశించారు. నాడు సస్పెండ్ అయిన జేడీయూ రాజ్యసభ సభ్యుడు అంజల్ ప్రసాద్ హెగ్డే ఇప్పుడు బీజేపీ సభ్యుడు. నాడు సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు జేడీయూ సభ్యులు తాజా ఎన్నికల్లో పోటీ చేయలేదు.

ఇకనైనా...

ప్రతిపక్షానికి చెందిన వారు అయినందునే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వారందరినీ శీతాకాల సమావేశాల నుండి సస్పెండ్ చేశారు. అయితే వారిలో చాలా మందిని ఓటర్లు తిరిగి ప్రజాస్వామ్య దేవాలయానికి పంపారు. తిరిగి స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా ఈసారైనా కీలక బిల్లులపై చర్చల్లో భాగస్వాములయ్యేందుకు వారికి అవకాశం ఇస్తారా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

సంపాదకీయం

ప్రజలు ఓడిపోరాదు!



'చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీలు మార్చేస్తున్నారు...' అన్నాడో కవి. ఎన్నికల సందర్భంలో సీటు రాదని తెలిస్తేనో, మరొకందుకో నాయకులు పార్టీలు మారటం కద్దు. ఇప్పుడిది రాష్ట్రంలో మరింత జోరందుకుంది. వారు రోజుకో కండువా కప్పుకుంటున్నారు సరే..చేర్చుకుంటున్న పార్టీల బుద్ధి ఎటుపోతోంది...? రాజకీయమంటే అధికారం ఎక్కడుంటే అక్కడుండటం, తమ తమ వ్యాపారాలు, పరిశ్రమలు, ఇతరత్రా వ్యాపకాలను సజావుగా నడుపుకోవటమేనా..? వీటన్నింటికీ అధికారమే కేంద్రమా..? అలా అయితే ఓట్లేసిన ప్రజలు ఓడిపోతారు కదా..?

పదేండ్లపాటు తెలంగాణను ఏలిన గులాబీ పార్టీ... రాష్ట్రంలో ప్రతిపక్షాలే లేకుండా చేయాలనే కుట్రతో ఫిరాయింపులను యధేచ్ఛగా ప్రోత్సహించింది. కాంగ్రెస్, బీజేపీ మొదలుకుని చిన్నాచితకా పార్టీల వరకూ నేతలందర్నీ చేర్చుకుని బాగా 'వాచింది'. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ జమానాలో 'గులాబీ వనాన్ని' మొత్తానికి మొత్తంగా ఖతం పట్టించేందుకు ప్రయత్నిస్తే... 'చీరి చింతకడ్తం..ఖబర్దార్ రాజశేఖరరెడ్డి...' అని కేసీఆర్ గర్జించారు. అదే కారు సారు అధికారంలోకి వచ్చిన తర్వాత తన గర్జనను తీసి గూట్లో పెట్టి, ఫిరాయింపుల ద్వారా ఇతర పార్టీల నోట్లో మట్టికొట్టారు. పదేండ్ల కాలం ఇట్టే గడిచిపోయింది. ఇప్పుడు సీన్ రివర్సయింది. అప్పటి గులాబీ దళపతి మాదిరిగానే ఇప్పటి హస్తం సారథి వ్యవహరిస్తున్నారు.

> 'ఎమ్మెల్యేలు ఎవరైనా పార్టీ మారితే సభ్యత్వం రద్దు చేస్తాం...' అంటూ మొన్నటి ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్... తాను రాసుకున్న 'వేద వాక్కులకు' తానే చెల్లుచీటి ఇవ్వటం ఆ పార్టీ విలువలకు నిదర్శనం. ఆ మాటకొస్తే అసలు ఫిరాయింపుల నిరోధక చట్టానికి తూట్లు పొడిచిందే కాంగ్రెస్. ఏతావాతా తేలేదేమంటే...ఇబ్బడిముబ్బడిగా ఫిరాయింపులు పెరిగి, ప్రతిపక్షాలు బలహీనపడితే...అది అంతిమంగా రాష్ట్రానికి, ప్రజలకు తీరని నష్టం.

ఇప్పుడు రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలు ముప్పిరిగొంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా (రైతుబంధు) నిధులను విడుదల చేసి...అన్నదాతలను ఆదుకోవాల్సిన సర్కారు, ఇప్పుడు దానిపై ప్రజాభిప్రాయ సేకరణ అంటూ కొంగొత్త రాగం ఎత్తుకుంది. ఎలక్షన్లలో ఎకరానికి, ఒక పంటకు రూ.7,500 చొప్పున రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తామంటూ కాంగ్రెస్ ప్రకటిస్తే... దానికి జనం ఆమోదముద్ర వేశారు. గులాబీ పార్టీని ఓడించటం ద్వారా హస్తాన్ని గద్దెనెక్కిస్తున్నామంటూ వారు తమ అభిప్రాయాన్ని విస్పష్టంగా ప్రకటించారు. ఇదంతా జరిగాక ఇప్పుడు రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ ఏంటో? పెట్టుబడిదారుల షేర్ మార్కెట్ల కోసం మొన్నటిదాకా 'ముందుగానే నైరుతి...' అంటూ కార్పొరేట్ మీడియా ఊదరగొట్టింది. ఇప్పుడు వానల్లేక విలవిల్లాడుతున్న రైతులను పాలకులు పట్టించుకుంటారా? తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేసిన పత్తి విత్తనాలు, సరైన పదును లేకపోవటంతో మొలకెత్తలేదు. దీంతో మళ్లీ విత్తనాలను కొనుగోలు చేసి, విత్తాల్సిన దుస్థితి. నీట్ పరీక్షలో తలెత్తిన అవకతవకలతో రాష్ట్రానికి చెందిన వేలాది మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారినా... దానిపై రేవంత్ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటనేదీ వెలువడకపోవటం ఆశ్చర్యకరం.

లక్షలాది మంది కార్మికులకు సంబంధించిన కనీస వేతనాల జీవోల విడుదల అగమ్యగోచరంగా మారింది. విడిఏను బేసిక్‌లో కలిపి అదే కొత్త జీతమని చెప్పి కార్మికుల చెవుల్లో పూలు పెడ్తున్నారు. రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయాలనీ, అందుకనుగుణంగా తమ డిమాండ్లను పరిశీలించి, పరిష్కరించాలని కోరుతున్న జూనియర్ డాక్టర్లే ఒక అడుగు వెనక్కి తగ్గి తమ ఆందోళనను ముగించారు. వీటితోపాటు ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన ఆసరా పింఛన్ల పెంపు, మహిళలకు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక చేయూత, కౌలు రైతులకూ రైతు భరోసా తదితరాంశాల గురించి ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పటం లేదు. ఈ హామీలను అమలు చేయాలంటే పెద్ద ఎత్తున నిధులు కావాల్సి ఉంటుంది. ఇందుకోసం పదేండ్లపాటు తెలంగాణపై వివక్ష కొనసాగించి నిధులు, గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయాలకు అడ్డుకట్ట వేసిన కేంద్రం నుంచి వాటిని రాబట్టాలి. అవి రావాలంటే గత కేసీఆర్ మాదిరిగా విజ్ఞాపనలు, వినతిపత్రాలకే పరిమితమైతే సరిపోదు. రాష్ట్ర ప్రయోజనాలు, ఆర్థిక వనరులు, హక్కుల కోసం రేవంత్ సర్కార్ మోడీ ముందు తన గొంతు పెంచాలి.

వీటన్నింటినీ పక్కనబెట్టి ఫిరాయింపులు, చేరికలను ప్రోత్సహించటమే పనిగా అధికార పార్టీ బిజీబిజీ అయిపోయింది. అలకపాన్పెక్కిన జీవన్‌రెడ్డి లాంటి సీనియర్లను బుజ్జగించే పనిలో డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు తలమునకలై ఉన్నారు. 'ఎమ్మెల్యేలు ఎవరైనా పార్టీ మారితే సభ్యత్వం రద్దు చేస్తాం...' అంటూ మొన్నటి ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్...తాను రాసుకున్న 'వేద వాక్కులకు' తానే చెల్లుచీటి ఇవ్వటం ఆ పార్టీ విలువలకు నిదర్శనం. ఆ మాటకొస్తే అసలు ఫిరాయింపుల నిరోధక చట్టానికి తూట్లు పొడిచిందే కాంగ్రెస్. ఏతావాతా తేలేదేమంటే...ఇబ్బడిముబ్బడిగా ఫిరాయింపులు పెరిగి, ప్రతిపక్షాలు బలహీనపడితే...అది అంతిమంగా రాష్ట్రానికి, ప్రజలకు తీరని నష్టం. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయటమే దానికి విరుగుడు.

యూరో పార్లమెంటు ఎన్నికలు - ప్రమాద సూచికలు


యూరోపియన్ పార్లమెంటుకు జూన్ 9న జరిగిన ఎన్నికలు పచ్చి మితవాద పార్టీలు ప్రముఖ శక్తిగా ఆవిర్భవించడానికి దారితీశాయి. ఈ పార్టీలలో అనేకం పెట్టుబడిదారీ అనుకూలత, వలస ప్రజానీకంపై వ్యతిరేకత కలిగినవి. అంతేగాక పర్యావరణం గురించి కూడా సందేహాస్పద పాత్ర పోషించేవి. నేటి ప్రపంచీకరణ అనంతర వాతావరణంలో ఈ ఫలితాలు ప్రమాదకర సంకేతాలుగా వున్నాయి. మధ్యేవాద మితవాద కన్సర్వేటివ్ శక్తిగా వున్న యూరోపియన్ పీపుల్స్ పార్టీ ఈ ఎన్నికల్లో తన ఓట్ల వాటాను, సీట్లను కూడా నిలబెట్టుకోలేక పోయింది. వామపక్ష మధ్యేవాద సోషలిస్టులు ప్రజాతంత్ర వాదులతో కూడిన ప్రగతిశీల కూటమి ఓట్ల వాటాను స్వల్పంగానూ (ఒక శాతం), సీట్లను (నాలుగు) కోల్పోయింది. కార్పొరేట్ అనుకూలమైన 'రీన్యూ యూరప్' (పునరుద్ధరణ) కూటమి చాలా తీవ్ర స్థాయిలో నాలుగు శాతం ఓట్లను (23 సీట్లను) కోల్పోయింది. వామపక్షాలు, పర్యావరణ వాదుల బృందం 'జియుఇ/ఎన్‌జిఎల్' ఒక సీటును, 0.2 శాతం ఓట్లను పోగొట్టుకుంది. ఇంకా ఇతర వివిధ హరితవాద పార్టీలు కలసి మొత్తం 20 సీట్ల వరకూ కోల్పోయాయి.

పచ్చి మితవాద పార్టీలు ప్రధానంగా విజయాలు సాధించాయి. ఆ పార్టీల ప్రాతినిధ్యం 30 సీట్లకు పైగా పెరిగింది. 720 మంది సభ్యులున్న యూరోపియన్ పార్లమెంటులో ఈ పచ్చి మితవాద పార్టీలకు 145 స్థానాలు దక్కాయి. అంటే దాదాపు నాలుగో వంతు. మితవాదులు, పచ్చి మితవాదులకు కలసి ఇప్పుడు 331 స్థానాలయ్యాయి. ఇతరులు అనే పేరుతో వున్న 55 మందిలోని అనేకమందిని కలిపితే (వీరిలో చాలామంది మితవాద భావాల పట్ల సానుభూతి కలిగినవారు) మితవాద పక్షం బలీయమైన శక్తి అవుతుంది. యూరప్‌లోని మూడు ప్రధాన దేశాలు/ఆర్థిక వ్యవస్థలైన జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల్లో పచ్చి మితవాద పార్టీలు ఇలా మెరుగైన ఫలితాలతో ముందుకు రావడం ప్రమాద సూచికే. జర్మనీలో డచ్‌లాండ్ ఆల్టర్నేటివ్ (ఎ.ఎఫ్.డి) 16 శాతం ఓట్లు తెచ్చుకుని రెండవ అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. పాలక సోషల్ డెమొక్రాట్లను మూడో స్థానానికి నెట్టింది. ఫ్రాన్స్‌లో మేరీ లీపెన్ నాయకత్వంలోని రసెంబ్లెమెంట్ నేషనల్ లేదా నేషనల్ ర్యాలీ దేశాధ్యక్షుడు మాక్రాన్ కన్నా రెట్టింపుగా 32 శాతం ఓట్లు తెచ్చుకుంది. ఇటలీలో ప్రధాని గ్లోరియా మెలోనీ 'ఫ్రటెల్లి డి ఇటాలియా' 29 శాతం ఓట్లు తెచ్చుకుని మళ్లీ ప్రధాన రాజకీయ శక్తిగా పునరావిర్భవించింది.

> పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడ్డమనే తమ మూకుమ్మడి నమ్మకం ఆధారంగా అన్ని తీవ్ర మితవాద శక్తులను ఒక్కటి చేయడానికి యూరప్‌లోని పాలక వర్గాలు సహాయపడ్డాయి. మితవాద యూరోపియన్ పీపుల్స్ పార్టీ జార్జియా మెలోనీ నాయకత్వంలోని నయా ఫాసిస్టు పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా దానికి చట్టబద్ధత కల్పించింది. దాంతో ప్రజా ప్రతిఘటన వున్నప్పటికీ ఇ.యు లో వాణిజ్య వర్గాలకు మేలు చేసే కొన్ని చట్టాలు ఆమోదం పొందడానికి వీలు కలిగింది. జాతీయ విధానాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. పెన్షన్ సంస్కరణలపై కార్మికుల నిరసనలు, 'ఎల్లో వెస్ట్స్' నిరసనసలపై దాడులకు దిగింది. ఈ నిరసన కారులపై ఇస్లామో వామపక్ష వాదులని ముద్ర వేసింది. 'సంక్షేమ బిచ్చగాళ్లయిన వలసదారులు' అని చులకన చేసింది.

పొదుపు పోట్లతో కుదుపు

సోషల్ డెమొక్రాట్లు, కన్జర్వేటివ్‌లు అధికారంలో వున్న చోట్ల అనుసరించిన 'పొదుపు' చర్యల ఫలితమే పచ్చి మితవాద పార్టీల ఈ విజయం. వారు ఆ పేరుతో సామాజిక సంక్షేమ పథకాలను తీవ్రంగా కోత కోశారు. పదవీ విరమణ వయస్సు పెంచారు. పెన్షన్లు తగ్గించారు. సామాన్య ప్రజలపై విధించిన రకరకాల పన్నులతో వారి జీవనోపాధి దెబ్బ తినిపోయింది. తత్ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగిన తీరును యూరోపియన్ కమిషన్ జరిపిన సర్వే విదితం చేసింది. 2024 వసంత కాలంలో జరిపిన ఈ సర్వేలో 46 శాతం మంది తమ జీవన స్థాయి పడిపోయిందనే అభిప్రాయం వెలిబుచ్చగా ఆరు శాతం మంది మాత్రమే మెరుగు పడిందన్నారు. జీవన వ్యయం పెరుగుదల అతి పెద్ద సమస్యగా వుందని అత్యధిక యూరోపియన్లు (31 శాతం) చెప్పారు. ఆ తర్వాత నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు (26 శాతం) పేర్కొన్నారు. ప్రజల అవసరాలను అందుకోలేకపోతున్న తమ దేశాల ప్రభుత్వాలపై 55 శాతం మంది అవిశ్వాసం వెలిబుచ్చారు. క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితులపై ఆగ్రహం, ప్రధాన రాజకీయ పార్టీలపై నమ్మకం సన్నగిల్లిపోవడంతో ఎ.ఎఫ్.డి, రసెంబ్లెమెంట్ నేషనల్, ఫ్రటెల్లి డి ఇటాలియా వంటి పచ్చి మితవాద పార్టీలు పెరుగుదల సాధ్యమైంది. ప్రధాన స్రవంతి వ్యవస్థాగత పార్టీలు నిరుత్సాహపర్చడం వల్లనే తాము ఎ.ఎఫ్.డికి ఓటు చేశామని జర్మనీలో జరిగిన సర్వేలో 44 శాతం మంది చెప్పారు. ఈ పచ్చి మితవాద పార్టీలు ప్రజల అసంతృప్తిని ఆర్థిక విధానాలపై నుంచి దృష్టి మళ్లిస్తున్నాయి. ఇస్లాంపై ద్వేషం (ఇస్లామోఫోబియా), వలస వచ్చిన వారిపై వ్యతిరేకత ఉధృతంగా ప్రచారం చేశాయి. సమాజంలో తీవ్ర విచ్ఛిన్నాలు సృష్టిం చాయి. యూరోపియన్ యూనియన్‌పై తమ వ్యతిరేకతను కూడా అవి తగ్గించేశాయి. పై రెండు రకాల స్రవంతులను మిళితం చేసేట్టయితే యూరోపియన్ యూనియన్ పరిధిలో వలస జీవులపై మరింత కఠినతర వైఖరి తీసుకుంటామని వాగ్దానం చేశాయి. పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడ్డ మనే తమ మూకుమ్మడి నమ్మకం ఆధారంగా అన్ని తీవ్ర మితవాద శక్తులను



> సోషల్ డెమొక్రాట్లు, కన్జర్వేటివ్‌లు అధికారంలో వున్న చోట్ల అనుసరించిన 'పొదుపు' చర్యల ఫలితమే పచ్చి మితవాద పార్టీల ఈ విజయం. వారు ఆ పేరుతో సామాజిక సంక్షేమ పథకాలను తీవ్రంగా కోత కోశారు. పదవీ విరమణ వయస్సు పెంచారు. పెన్షన్లు తగ్గించారు. సామాన్య ప్రజలపై విధించిన రకరకాల పన్నులతో వారి జీవనోపాధి దెబ్బ తినిపోయింది. తత్ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగిన తీరును యూరోపియన్ కమిషన్ జరిపిన సర్వే విదితం చేసింది. 2024 వసంత కాలంలో జరిపిన ఈ సర్వేలో 46 శాతం మంది తమ జీవన స్థాయి పడిపోయిందనే అభిప్రాయం వెలిబుచ్చగా ఆరు శాతం మంది మాత్రమే మెరుగు పడిందన్నారు. జీవన వ్యయం పెరుగుదల అతి పెద్ద సమస్యగా వుందని అత్యధిక యూరోపియన్లు (31 శాతం) చెప్పారు. ఆ తర్వాత నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు (26 శాతం) పేర్కొన్నారు. ప్రజల అవసరాలను అందుకోలేకపోతున్న తమ దేశాల ప్రభుత్వాలపై 55 శాతం మంది అవిశ్వాసం వెలిబుచ్చారు.

ఒక్కటి చేయడానికి యూరప్‌లోని పాలక వర్గాలు సహాయపడ్డాయి. మితవాద యూరోపియన్ పీపుల్స్ పార్టీ జార్జియా మెలోనీ నాయకత్వంలోని నయా ఫాసిస్టు పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా దానికి చట్టబద్ధత కల్పించింది. దాంతో ప్రజా ప్రతిఘటన వున్నప్పటికీ ఇ.యు లో వాణిజ్య వర్గాలకు మేలు చేసే కొన్ని చట్టాలు ఆమోదం పొందడానికి వీలు కలిగింది. జాతీయ విధానాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. పెన్షన్ సంస్కరణలపై కార్మికుల నిరసనలు, 'ఎల్లో వెస్ట్స్' నిరసనలపై దాడులకు దిగింది. ఈ నిరసనకారులపై ఇస్లామో వామపక్ష వాదులని ముద్ర వేసింది. 'సంక్షేమ బిచ్చగాళ్లయిన వలసదారులు' అని చులకన చేసింది. ఇవన్నీ అచ్చంగా లీపెన్ వాడిన పదాలే.

కొన్ని ఆశాకిరణాలు

ఈ విధమైన సమ్మేళనమే ఈ పచ్చి మితవాద పార్టీలకు ఆమోదయోగ్యత కల్పించి పునాది పెంచుకోవడానికి తోడ్పడింది. ఇటీవల జరిపిన ఒక అభిప్రాయ సేకరణలో రిపబ్లికన్ పార్టీ ఓటర్లలో యాభై శాతం మంది లీపెన్ పార్టీతో పొత్తును సమర్థిస్తున్నట్టు చెప్పారు. ఈ విధంగా ఆ చెదురుమదురు శక్తులే ప్రధాన శక్తులుగా తయారైనాయి. ఈ మొత్తం నిరాశామయ వాతావరణంలో ఒకే ఒక ఆశాకిరణం కనిపిస్తుంది. ఫిన్లాండ్‌లో వామపక్ష కూటమి (వాసెమ్మిస్టోలిట్టో) 17.3 శాతం ఓట్లు అదనంగా తెచ్చుకోగలిగింది. మరోవైపున పచ్చి మితవాద ఫిన్స్ పార్టీ ఓట్లు 6.2 శాతం తగ్గి కేవలం 7.6 శాతానికే పరిమితమైంది. డెన్మార్క్‌లో సోషల్ పీపుల్స్ పార్టీ 17.4 శాతం ఓట్లతో పెద్ద పార్టీగా వచ్చింది. ఇక్కడ పాలక సోషల్ డెమొక్రటిక్ పార్టీ 5.9 శాతం ఓట్లు కోల్పోయి 15.6 శాతం ఓట్లకే పరిమితమైంది. జర్మనీలో సహ్రా వగేనెక్ట్ నాయకత్వంలోని డై లింకె నుంచి విడిపోయిన పార్టీ బుండిస్ సహ్రా వగేనెక్ట్ (బి.ఎస్.డబ్ల్యు) ఆరు సీట్లు తెచ్చుకుని ఆశాకిరణంగా నిలిచింది. వర్గ రాజకీయాలను నొక్కి చెప్పడం ద్వారా వగేనెక్ట్ ఒక వేదికను సృష్టించగలిగింది. గ్రీస్, బెల్జియం, చెక్ రిపబ్లిక్‌లలోని కమ్యూనిస్టు పార్టీలు కూడా మంచి ఫలితాలే సాధించాయి. ఓట్ల శాతం పెంచుకున్నాయి. ఈ పార్టీలు కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిలబడ్డాయి. ప్రజల జీవనోపాధి సమస్యలలో క్రియాశీలంగా పాత్ర వహించాయి. వలస జీవుల విషయంలోనూ సరైన వైఖరి తీసుకున్నాయి. పొదుపు చర్యలపై రాజీ లేని పోరాటం నడిపాయి. ఆ విధంగా ప్రజలకు దగ్గరై వారి విశ్వాసం పొందాయి. ఈ ఫలితాలు ఆ విధమైన సూచికలుగా వున్నాయి. పోర్చుగల్, సైప్రస్‌లలోని కమ్యూనిస్టు పార్టీల ఓట్లు తగ్గుదలపై, ఫలితాలపై సమీక్షించుకుంటున్నాయి. తమ నాయకత్వంలో వర్గ పోరాటాలను మరింత సంఘటితం చేసి పార్టీ నిర్మాణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడం గురించి ఆలోచిస్తున్నట్టు తొలి స్పందనలు తెలియజేస్తున్నాయి.

ఐక్యత దిశగా అడుగులు


పచ్చి మితవాద పార్టీల పెరుగుదల యూరప్ అంతటా ప్రజానీకాన్ని ఆందోళనకు గురి చేసింది. ఈ ప్రమాదాన్ని గుర్తించి మేలన్న వారు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఫ్రాన్స్‌లో ఫ్రాన్స్ ఇన్సొమైజ్, సోషలిస్టు పార్టీ, ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ (పి.సి.ఎఫ్)లే ఎకాలజిస్టుల వంటి వామపక్ష మధ్యేవాద, వామపక్ష శక్తులు ఒక కూటమిగా పాపులర్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. ఫలితాలు వచ్చాక వారంలోనే ఈ ఫ్రంట్ ఏర్పడింది. దేశమంతటా జరిగిన అనేక ప్రదర్శనలు, సభలు వాటిలో వేలకు వేల మంది పాల్గొన్న దానికి ప్రతిస్పందనగా ఈ ఫ్రంట్ ఏర్పడింది. ఈ సమీకరణలన్నింటా మితవాద శక్తుల పెరుగుదల పట్ల ఆవేదన ప్రకటిస్తూ వామపక్షాలు చేతులు కలపాలనే భావన వినిపించింది. కనీస వేతనాల పెంపు, ప్రభుత్వ సర్వీసులలో పెట్టుబడుల పెంపు, రిటైర్మెంట్ సంస్కరణల రద్దు, సంపన్నులపై పన్నుల పునరుద్ధరణ వంటి కోర్కెలతో ఈ ఫ్రంట్ ఒక ముసాయిదా ప్రణాళిక ప్రకటించింది. పొదుపు పేరిట ప్రవేశ పెట్టిన చర్యలను వెనక్కు తీసుకుని పర్యావరణ ప్రణాళిక దిశలో అడుగులు వేయాలని కోరింది. పచ్చి మితవాద శక్తుల ముప్పును తిప్పి కొట్టాలంటే ఆర్థిక విధానాలపై వారిని ఢీకొనాలి. వారి సామాజిక, సాంస్కృతిక విధానాలను సవాలు చేయాలి. దోపిడీకి గురయ్యే వారందరినీ ఐక్యం చేసి బహుముఖ పోరాటాలు నిర్వహించడం ద్వారానే ఈ పచ్చి మితవాద శక్తులను ఓడించడం సాధ్యం.

(జూన్ 19 'పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయం)

ఆకలికేకల ప్రపంచం!

ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్నవారు అత్యధికంగా ఆసియా దేశాల్లో 41.8 కోట్ల మంది ఉండగా, ఆఫ్రికాలో 28.2 కోట్ల మంది ఉన్నారు. కరోనా మహమ్మారి విజృంభణతో అదనంగా 3 కోట్ల మంది పేదలు ఆకలితో అలమటించారు. ప్రత్యేక చర్యలు అమలు పరచని పక్షంలో 2030 నాటికి 66 కోట్ల మంది పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్‌ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు. అన్నార్తులకు సంబంధించి పైన పేర్కొన్న అంశాలు ఈ నివేదిక వెలువరించినవే. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలిచావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత నిర్ణయం తీసుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతు న్నది. లింగ వివక్ష కారణంగా పురుషులకన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రతతో బాధపడు తున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం



తగ్గడం వల్ల 300 కోట్ల మంది పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకా హార లోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేళ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49 ఏళ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురోప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది. గర్భిణులలో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లి పాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, ఓవర్ వేయిట్ పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూల కాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

ఆహార అభద్రత, పోషకాహార లోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/కర్ఫ్యూలు లాంటి అంశాలను నివేదిక పేర్కొంది. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం, ఆదాయాలు తగ్గడం, మార్కెటింగ్ లొసుగుల (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణా, మార్కె టింగ్, ధరలు)తో పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లభ్యత పెరగడానికి... వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరాలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలను పేర్కొంది. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్య సంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం ఘర్షణలు జరగడం సర్వసాధారణం. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావం అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది.

ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దానికన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యు.యస్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహార లోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
సెల్ : 9949700037

బధిరుల వారధి... వికలాంగుల ఉద్యమ సారథి



ఎం.అడివయ్య
9490098713

హెలెన్ కెల్లర్ అంధులకు, బధిరులకు వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారథిగా నిలిచి ప్రపంచంలో ఎందరికో స్ఫూర్తి నింపారు. చిన్నతనంలోనే పెద్ద జబ్బు చేసి, చూపు, వినికిడి, మాట పోగొట్టుకొని పూర్తి వికలాంగురాలైన హెలెన్ కెల్లర్ ప్రపంచాన్ని చూడలేదు. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకొనే అవకాశం లేదామెకు. కానీ, అవయవాలు సక్రమంగా ఉన్నవారందరి కంటే మహోన్నత స్థాయిలో నిలిచి పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదని తన జీవితం ద్వారా నిరూపించారు. ప్రపంచ పౌరులందరికీ ఆదర్శవంతమైన సార్థక సేవా విదుషీమణిగా వన్నెకెక్కారు.

వికలాంగుల కోసమే కాకుండా మహిళల హక్కుల గురించి పత్రిక రచనలు చేసి, స్వయంగా ఉద్యమాలు నడిపిన ధీశాలి హెలెన్ కెల్లర్. 22 ఏళ్ల వయసులోనే "ది స్టోరీ ఆఫ్ మై లైఫ్" గ్రంథ రచనతో మొదలెట్టి 14 పుస్తకాలు తీసుకొచ్చారు. వందలాది వ్యాసాలు రాశారు. వైకల్యానికి, అంధత్వానికీ మూలం పేదరికమనీ అది లేని సమాజ స్థాపన ద్వారా వికలాంగుల సమస్యల పరిష్కారం సాధ్యమనీ, సమ సమాజ స్థాపన ద్వారానే సాధ్యమనీ ధృడంగా విశ్వసించిన మానవతా మూర్తి హెలెన్ కెల్లర్.

హెలెన్ ఆడమ్స్ కెల్లర్ (జూన్ 27, 1880-జూన్ 1, 1968) అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని టస్కాంబియా పట్టణంలో జన్మించారు. పుట్టుకతో వైకల్యం లేనప్పటికి 19 నెలల వయసులో స్కార్లెట్ ఫివర్ (మెనింజైటిస్ వ్యాధి) వలన చూపు, వినికిడి శక్తిని కోల్పోయి వికలాంగురాలిగా మారారు. హెలెన్ కెల్లర్‌లోని సాధారణ తెలివితేటలకు, ఇతర అవయవాలకు, ఆరోగ్యానికి ఎలాంటి లోపం రాలేదు. మూడేండ్ల వయసులో ఉన్నప్పుడు ఒక రోజు గది వెచ్చదనం కోసం ఉంచిన పొయ్యి దగ్గరకు చేరుకోవడంతో ఆమె బట్టలు అంటుకొని కనుబొమలు, జుట్టు, నుదురు కాలాయి. ఈ సంఘటనతో చలించిపోయిన తల్లిదండ్రులు మరింత దిగులుపడ్డారు. బాల్టిమోర్ పట్టణంలోని ప్రఖ్యాత నేత్ర వైద్యున్ని సంప్రదించగా..చూపు వచ్చే అవకాశం లేదు గానీ, మెదడులోని నరాలన్నీ చాలా చురుకుగా పనిచేస్తున్నాయని సూచించి వాషింగ్టన్‌లోని అలెగ్జాండర్ గ్రాహంబెల్ దగ్గరకు తీసుకెళ్లమని సలహా ఇచ్చారు.ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అలెగ్జాండర్ గ్రాహంబెల్ భార్యకు భయంకరమైన చెముడు. ఆమెకు మాటలు నేర్పే పట్టుదల, అవిరామ ప్రయత్నాల ఫలితమే టెలిఫోన్ ఆవిష్కరణ. గ్రాహంబెల్ సలహాతో అంధులకు విద్య నేర్పే "పెర్కిన్స్ ఇన్‌స్టిట్యూట్" యాజమాన్యాన్ని (బోస్టన్) కెల్లర్ తండ్రి అభ్యర్థించాడు. హెలెన్ కెల్లర్‌కు చదువు చెప్పేందుకు అధ్యాపకురాలిని ఒప్పించి ఇంటి దగ్గరే విద్య నేర్పేందుకు పంపమని అభ్యర్థించారు. పెర్కిన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రపంచం లోకెల్లా మొదటిసారిగా బధిరులు, అంధులు మాట్లాడుకోవడం, రాయడం నేర్చుకున్న మొదటి వ్యక్తి లారా బ్రిడ్జియన్. పెర్కిన్స్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌లో హెలెన్ కెల్లర్‌కు జీవితకాల ఉపాధ్యాయురాలిగా అన్నె సలీవాన్‌ను నియమితు రాలయ్యారు.

బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అంధుల సేవకు అంకితమైన సలీవాన్ అధ్యాపకురాలిగా నియమితమవడం ప్రపంచ వికలాంగుల చరిత్రలో ఒక మైలురాయి లాంటిది. దృష్టి లేని జీవితం వృధా అని భావించే సమాజానికి వెలుగులు నింపే క్రాంతి కిరణాలను అందించింది. జ్ఞానేంద్రియాలలో ముఖ్యమైన మూడూ లోపించిన కెల్లర్ విద్య నేర్చుకుంటారని ఎవరూ ఊహించలేదు కానీ అన్నె సలీవాన్ సాధ్యం చేశారు. బొమ్మను చేతికి ఇస్తే సూక్ష్మగ్రాహి అయిన కెల్లర్ వెంటనే ఆమె చేతి మీద 'డాల్' (బొమ్మ) అని తిరిగి రాసింది. కెల్లర్ తన జీవితంలో నేర్చుకున్న మొదటి పదమూ ఇదే. ఎ.బి.సి.డి లను చేతి మీద రాసి చూపడం ప్రారంభమైన తర్వాత కెల్లర్ అచంచలమైన ఆత్మ విశ్వాసంతో టీచర్ బోధనలను అర్థం చేసుకొని నిరంతరం సాధన చేశారు. ప్రతి వస్తువు పేరును హెలెన్ కెల్లర్ అరచేతిపై రాయడం వలన అక్షరాలను తడిమి చూసి గుర్తుపట్టేవారు. ఒకసారి కరచలనం చేస్తే ఆ స్పర్శ ద్వారా ఆ వ్యక్తిని చాలా కాలం తరువాత కూడా గుర్తుపట్టేవారు. భారతదేశం వచ్చిన సందర్భంలో ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గళంలోని సంగీత మాధుర్యాన్ని, ఈమె తన చేతి వేళ్ళ ద్వారా ఆమె గొంతును తాకుతూనే నిర్ధారించగలిగారు.

> తన జీవితాన్ని అంధుల సేవకు స్వచ్ఛందంగా అర్పించుకొని, అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ సంస్థను స్థాపించి, దాని నిధి సేకరణకు ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. సమావేశాలు, సదస్సులను నిర్వహించారు. భారీ స్థాయిలో నిధులు సేకరించి వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేశారు. వికలాంగులను దయాదాక్షిణ్యాలతో పోషించటం కాదని వారు స్వశక్తితో నిలబడేందుకు అవకాశాలు కల్పించి వారిలో ఆత్మవిశ్వాసం, మనో నిబ్బరం కల్పించడమే పరిష్కారమని కెల్లర్ ప్రగాఢంగా విశ్వసించారు. అంతేగాక సార్థక సేవా దృక్పధానికీ బీజం వేశారు. అమెరికా, ఇంగ్లాండ్, స్వీడన్ వంటి అనేకానేక దేశాలలో ఈమె పేరు మీద నెలకొల్పిన సేవా కేంద్రాలు నేటికీ కొనసాగుతున్నాయి.



మనిషి నడుస్తున్నప్పుడు సహజంగా ఏర్పడే భూప్రకంపనాల తారతమ్యాలను అనుసరించి ఆ వ్యక్తి సహజ స్వభావాన్ని అంచనా వేసేవారు. ఈ తరహాలో అనేక అద్భుత మానసిక శక్తులతో ప్రపంచ దేశాలన్నిటినీ ఆకట్టుకొని, వికలాంగుల సేవా కేంద్రాలను నెలకొల్పేందుకు కృషి చేశారు. ఇవన్నీ హెలెన్ కెల్లర్ గొప్ప మేధో శక్తికి నిదర్శనాలు.

తన జీవితాన్ని అంధుల సేవకు స్వచ్ఛందంగా అర్పించుకొని, అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ సంస్థను స్థాపించి, దాని నిధి సేకరణకు ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. సమావేశాలు, సదస్సులను నిర్వహించారు. భారీ స్థాయిలో నిధులు సేకరించి వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేశారు. వికలాంగులను దయాదాక్షిణ్యాలతో పోషించటం కాదని వారు స్వశక్తితో నిలబడేందుకు అవకాశాలు కల్పించి వారిలో ఆత్మవిశ్వాసం, మనో నిబ్బరం కల్పించడమే పరిష్కారమని కెల్లర్ ప్రగాఢంగా విశ్వసించారు. అంతేగాక సార్థక సేవా దృక్పధానికీ బీజం వేశారు. అమెరికా, ఇంగ్లాండ్, స్వీడన్ వంటి అనేకానేక దేశాలలో ఈమె పేరు మీద నెలకొల్పిన సేవా కేంద్రాలు నేటికీ కొనసాగుతున్నాయి. 1902లో ప్రారంభించిన రచనా వ్యాసంగాన్ని, జీవిత పర్యంతం కొనసాగించారు. 'ద స్టోరీ ఆఫ్ ద డార్క్‌నెస్' అనంతరం 'మై రెలిజియన్, ద వరల్డ్ ఐ లివ్ ఇన్, అవుట్ ఆఫ్ ద డార్క్‌నెస్, ద ఓపెన్ డోర్, ద సాంగ్ ఆఫ్ ద స్టోరీ వెల్' మొదలైన రచనలను వెలువరించారు. ఈమె జీవిత కథను ఆధారం చేసుకుని పలువురు డాక్యుమెంటరీ చిత్రాలు రూపొందించారు. ఆస్కార్ అవార్డు (1955) కూడా లభించింది.

అమెరికా దేశపు అత్యున్నత అవార్డు "ద ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్", పిలిప్పీన్స్ దేశపు "గోల్డెన్ హార్ట్" అవార్డు, లెబనాన్ దేశపు "ఆర్డర్ ఆఫ్ క్రాస్" అవార్డు, జపాన్ ప్రభుత్వం వారి "సీక్రెట్ ట్రెజర్" అవార్డు పొందారు హెలెన్ కెల్లర్. బ్రెజిల్ దేశపు ఆర్డర్ ఆఫ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. ప్రపంచంలోని పలు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలలో డాక్టరేట్లు పొందారు. ఫ్రెంచ్ జాతీయ వికలాంగుల సంస్థ గౌరవ సభ్యురాలిగా కొనసాగారు. హెలెన్ కెల్లర్ జీవితాంతం తన శక్తి సామర్థ్యాలను వికలాంగులు, మహిళల అభివృద్ధి కోసం అంకితం చేశారు. మహిళలు, వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం, కార్మికులు వారి హక్కులు, మెరుగైన సౌకర్యాల సాధన కోసం చేస్తున్న పోరాటాలలో పాల్గొంటూ 'అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్' స్థాపించడంలో ముందు భాగాన నిలిచారు. శ్వేత జాతీయుల ఆధిపత్యం, హత్యలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న 'నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కలర్డ్ పీపుల్' సంస్థలకు అండగా నిలిచారు.

(నేడు హెలెన్ కెల్లర్ 144వ జయంతి)

త్రిబుల్ ఆర్ రోడ్డుకు భూములివ్వం

• గజ్వేల్‌లో మర్కుక్ మండల రైతుల నిరసన



నవతెలంగాణ-గజ్వేల్

త్రిబుల్ ఆర్ రోడుకు భూములిచ్చేది లేదంటూ, నిర్మాణం నిలిపి వేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల కాలువలకు భూములు కోల్పోయి రోడ్డున పడ్డామని.. ఇప్పుడు రింగ్ రోడ్డు కోసమంటూ మళ్లీ తమ భూములను ఇవ్వాలనడం సరికాదని మర్కుక్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన చేపడుతూ.. రీజనల్ రింగ్ రోడ్డుకు భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం మూలంగా భూములు కోల్పోయి నిరాశ్రయులయ్యామని.. ప్రస్తుతం ఈ ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు పేరిట భూములను తీసుకునేందుకు ప్రయత్నాలు చేయడం విరమించుకోవాలన్నారు. ఎకరం భూమి రెండు మూడు కోట్లు ధర పలుకుతుండగా ప్రభుత్వం లక్షల్లో పరిహారం చెల్లిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు వేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

చెంచు మహిళ కుటుంబానికి రక్షణ

• డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి సీతక్క • నిమ్స్‌లో బాధితురాలికి పరామర్శ



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లాపూర్‌కు చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను బుధవారం మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈశ్వరమ్మకు మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని, ఆమె కుటుంబానికి సంపూర్ణ రక్షణ కల్పిస్తామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నాగరిక సమాజంలో అనాగరిక చర్యలకు పాల్పడే ఎవరినీ వదలబోమని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసులు.. బాధితుల పక్షానే ఉంటూ నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఇప్పటికే ఈశ్వరమ్మ కుటుంబానికి ఐటీడీఏ, ఎస్సీ ఎస్టీ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖల తరఫున ఆర్థిక సాయం అందజేశామన్నారు. బాధితురాలు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. అదేవిధంగా.. వారి కుటుంబంలో ఓ వ్యక్తి కూడా అనుమానాస్పదంగా మృతిచెందినట్టు బాధితులు తెలపగా.. సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం డ్రగ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నదని.. డ్రగ్స్ సేవించి మహిళలపై, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని శిక్షిస్తామని తెలిపారు. మంత్రి వెంట నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఇతర వైద్యులు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు, పీడబ్ల్యూఓ సంధ్య, ఇతర మహిళ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

అపిటోరియా ఫార్మాలో కార్మికుడు మృతి

నవతెలంగాణ-హత్నూర



పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న ఓ కార్మికుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని అపిటోరియా యూనిట్-9 పరిశ్రమలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కోదాడకు చెందిన కిరణ్(37) కొంతకాలంగా అపిటోరియా యూనిట్-9 పరిశ్రమలో కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరై పని చేస్తుండగా.. ఉన్నట్టుండి స్పృహ తప్పి ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి కార్మికులు అతడిని వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సుభాష్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాష్ట్రానికి విదేశీ జర్నలిస్టులు

• పది దేశాల నుంచి రాక • ప్రముఖ కేంద్రాల సందర్శన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్న పర్యాటక, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలను సందర్శించటానికి 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ప్రోటోకాల్ విభాగం అధికారులు వీరికి స్వాగతం పలికారు. తూర్పు ఆసియా, యూరేసియా, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్క్‌మెనిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, మంగోలియా, కజకిస్థాన్ దేశాలకు చెందిన ప్రముఖ మీడియా ప్రతినిధులు నాలుగు రోజుల పర్యటనకు వచ్చారు. పర్యటనలో భాగంగా గోల్కొండ కోట, శిల్పారామం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, స్కైరూట్ ఎయిరో స్పేస్ సెంటర్, టీ- హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, రామోజీ ఫిల్మ్ సిటీని ఈ మీడియా బృందం సందర్శించనుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీ దౌత్యవేత్త కార్యాలయం అధికారులు సైతం ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

నేడు, రేపు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

• ఎల్లో హెచ్చరిక జారీ • రాష్ట్రంలో 220పైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో గురు, శుక్రవారాల్లో 11 జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం పడే అవకాశాలున్నాయనీ, మిగతా ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. భారీవర్ష సూచన ఉన్న జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాలున్నాయి. వచ్చే మూడ్రోజులు మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశముంది. రాష్ట్రం మీదుగా బలమైన ఉపరిత గాలులు వీచే సూచనలున్నాయి. బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 220కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. జనగామ జిల్లా, మండల పరిధిలోని వడ్లకొండ గ్రామంలో అత్యధికంగా 8.53 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని బచ్చన్నపేటలో 6.8 సెంటీమీటర్ల వాన పడింది. మొత్తం మీద 51 ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది.

మా భూమి ధరణిలో నమోదు కాలేదు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు..

• తహసీల్దార్ కార్యాలయం ఎదుట యువ రైతు ఆత్మహత్యాయత్నం
• ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలి : బాధిత రైతు కుటుంబసభ్యులు



నవతెలంగాణ-శంషాబాద్

నా భూమి ధరణిలో నమోదు కాలేదు, సమస్యను ఎన్నిసార్లు కార్యాలయానికి వచ్చి మొరపెట్టుకున్నా ఫలితం లేదని మనస్తాపానికి గురైన యువ రైతు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో బుధవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు స్పందించి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు సూరిబాబు మాట్లాడుతూ.. మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన చెన్నకేశి మల్లమ్మ-లక్ష్మయ్య దంపతుల పేరు మీద ఘాన్సీనియాగూడ గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబర్లు 4/7, 4/8లో సుమారు 8 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ధరణిలో మిస్సింగ్ నెంబర్‌గా నమోదు చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రుల పేరుమీద ఉన్న భూమి ధరణిలో నమోదు కాకపోవడం వల్ల రైతుబంధుతో పాటు రైతుకు సంబంధించిన అన్ని రకాల హక్కులు కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. మిస్సింగ్ నెంబర్ తిరిగి ధరణిలో చేర్చి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయంలో 10 అక్టోబర్ 2023న తన తల్లిదండ్రులు దరఖాస్తు అందజేసినట్టు చెప్పారు. ఆర్డీవో, కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేశామని, సమస్య మండల స్థాయిలో పరిష్కారం అవుతుందని, అక్కడే చూసుకోవాలన్న ఆ అధికారుల సూచన మేరకు కార్యాలయంలో తహసీల్దార్ నాగమణిని పలుమార్లు కలిసామన్నారు. మొదట్లో ఆమె స్పందించి త్వరలోనే పట్టాదారు పుస్తకాలు ఇస్తామని చెప్పారన్నారు. కానీ రాను రాను సమస్యను దాటవేస్తూ పరిష్కారం చూపకుండా తప్పించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సర్వే నెంబర్లలో తమకు కాకుండా మిగతా వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా వచ్చాయని, తమకు మాత్రమే ఎందుకు ఆగుతున్నాయో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దారే తమకు పట్టా కాకుండా చేస్తున్నారని, అందుకే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకునేందుకు పురుగులమందు, పెట్రోల్‌తో వచ్చామని తెలిపారు. అనంతరం పట్టాదారు కమలమ్మ మాట్లాడుతూ.. ధరణి వచ్చిన తర్వాత అన్ని రకాల ఇబ్బందులు పడుతున్నామని, తహసీల్దార్ కార్యాలయానికి ఎన్నిసార్లు వచ్చి విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ నాగమణిని వివరణ కోరగా.. ఆమె మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి తల్లిదండ్రులు తొమ్మిది నెలల క్రితం దరఖాస్తు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. ఆ సమస్య ధరణి ప్రాసెస్‌లో ఉన్నదని, ఎంత సమయం పడుతుందో చెప్పలేమని తెలిపారు. సీఐ బాలరాజు జోక్యం చేసుకొని తహసీల్దార్‌తో మాట్లాడిన అనంతరం అక్కడి నుంచి వారిని పంపించి వేశారు.

పింఛన్ల పెంపు ఇంకెప్పుడు?

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వెంకట్, అడివయ్య

• రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవ్వాలని పిలుపు
• ఆగస్టు 24,25,26 తేదీల్లో 'వేదిక' రాష్ట్ర మహాసభ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆసరా పింఛన్, చేయూత పింఛన్‌ను ఇంకెప్పుడు పెంచుతారని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్, అడివయ్య అన్నారు. హామీనిచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం ఊసే ఎత్తడం లేదన్నారు. పింఛన్ పెంపు అమలు కోసం ఉద్యమానికి ఆసరా, చేయూత లబ్దిదారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ కమలానగర్‌లోని భాస్కర్‌రావు భవన్‌లో ఎన్‌పీఆర్‌డీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పింఛన్, చేయూత పింఛన్‌ను రూ.4వేలు, రూ.6వేలకు పెంచుతామని హామీలిచ్చారని గుర్తుచేశారు. 2024 జనవరి నుంచే ఆసరా, చేయూత పథకాన్ని అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందనా లేదన్నారు. ప్రజాపాలనా కార్యక్రమం సందర్భంగా పింఛన్‌ల కోసం షుమారు 24.84 లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం గతంలో ప్రకటించినట్టు గుర్తుచేశారు. ప్రతి నెలా చివరి వారంలో పింఛన్ డబ్బులు చెల్లించడం వల్ల లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2014 నుంచి ప్రతి ఏడాదీ 2, 3 నెలల పింఛన్ పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో లేకుండా రెగ్యులర్‌గా పింఛన్లు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచాల్సిన పింఛన్లు కూడా జనవరి నుంచే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జులై పింఛన్‌తో పాటు పెరిగిందీ ఇవ్వాలని, జనవరి నుంచి జూన్ వరకు ఏరియర్స్ కలపాలని అన్నారు. వెంటనే పింఛన్లు పెంచి ఇవ్వాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర 4వ మహాసభ ఆగస్టు 24-26 తేదీల్లో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు 33 జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. మహాసభ నిర్వహణ కోసం ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలయ్య, జె.మల్లేష్, షాయినా బేగం, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, సుల్తాన్ రమేష్, విజయలక్ష్మి, చంద్రమోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు

• ఈసారి సీబీఐ
• మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతి



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను సిబిఐ బుధవారం అరెస్టు చేసింది. కేజ్రీవాల్‌ను ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టింది. మూడు రోజుల సిబిఐ కస్టడీ విధిస్తూ స్పెషల్ జడ్జి అమితాబ్ రావత్ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రోజుకు 30 నిమిషాల పాటు లాయర్‌ను కలుసుకోవడానికి కేజ్రీవాల్‌కు అనుమతి ఇచ్చారు. అంతకు ముందు బుధవారం ఉదయం ముందుగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి కోర్టు అనుమతించింది. దీంతో ఆయన్ను సీబీఐ అరెస్టు చేసింది. కాగా ఇదే కేసులో కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తీహార్ జైలుల్లో కేజ్రీవాల్ ఉన్నారు. కాగా, బుధవారం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సీబీఐ తరువాత కోర్టులో హాజరుపర్చగా.. కేజ్రీవాల్ తన వాదనలను స్వయంగా వినిపించారు. ఈ కేసులో మనీశ్ సిసోడియా పేరు తానే చెప్పినట్టు వస్తున్న వార్తలను ఖండించారు.

కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చిన తర్వాత సిబిఐ తమ వాదనలు వినిపిస్తూ.. మద్యం దుకాణాలను ప్రైవేటీకరించాలని కేబినెట్ సహచరుడు (సిసోదియాను ఉద్దేశిస్తూ) సిఫార్సు చేశారని కేజ్రీవాల్ చెప్పినట్లు కోర్టుకు వెల్లడించింది. దీన్నే కేజ్రీవాల్ ఖండించారు. ఈ కేసులో తనను సిబిఐ గతేడాది సాక్షిగా విచారించిన విషయాన్ని కేజ్రీవాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మద్యం విధానానికి సంబంధించి తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అప్పుడే సిబిఐకి వెల్లడించినట్లు చెప్పారు. ఈ వాదనల అనంతరం కేజ్రీవాల్‌ను కస్టడీకి అప్పగించాలని సిబిఐ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. మూడు రోజుల కస్టడీకి అనుమతించింది.బుధవారం తనను సిబిఐ అరెస్టు చేయడంతో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌ను కేజ్రీవాల్ వెనక్కి తీసుకున్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షులు హతిక్ అహ్మద్

• యూనివర్సిటీని సెంట్రల్ జైలుగా మార్చారు
• ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాలే లక్ష్యంగా యాజమాన్యం బెదిరింపులు
• మూడో రోజుకు విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ-మియాపూర్

విద్యార్థుల సమస్యలపై పోరాటానికి వెనక్కి తగ్గేది లేదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షులు హతిక్ అహ్మద్ స్పష్టంచేశారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న తమపై సస్పెండ్‌ను వ్యతిరేకిస్తూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా బుధవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలకు యూనివర్సిటీ అడ్డాగా మారిందని, వారు ఏది చెబితే ఇక్కడ అదే జరుగుతుందని, అందులో భాగంగానే తమ మీద కేసులు, వెలివేతలు జరుగుతున్నాయని ఆరోపించారు. అడ్మినిస్ట్రేషన్ అక్రమాలను ప్రశ్నిస్తున్న తమను టార్గెట్ చేసి కేసులు పెడుతున్నారని, వాక్ స్వాతంత్రాన్ని కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోహిత్ వేముల మరణం తర్వాత మరోసారి ఇక్కడ వెలివాడ వెలిసిందని, హెచ్‌సీయూ విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న తమను వెలివేస్తున్నారని, రోహిత్ వేముల లాగానే తమపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కృపా మరియా మాట్లాడుతూ.. ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుల ఒత్తిడి వల్లనే ఆమపై కేసులు నమోదు చేశారని, విద్యార్థుల హక్కులపై వీసీని ప్రశ్నించడం తప్పా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ, ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ ధీరజ్ మాట్లాడుతూ.. సుకూన్ యానవల్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తే విద్యార్థి నాయకులను సస్పెండ్ చేశారని, కానీ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఫెస్టివల్ చేస్తే వీసీ వారికి అన్ని విధాలా సహకరించారని, ఏబీవీపీకి ఓ న్యాయం.. మిగతా విద్యార్థి సంఘాలకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. 50 మంది ఏబీవీపీ కార్యకర్తలు వచ్చి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా ఎవరూ పట్టించుకోలేదని, కానీ శాంతియుతంగా ఫెస్ట్ చేసుకునేందుకు అనుమతులు అడిగిన విద్యార్థులపై కేసులు పెట్టి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. వీసీ.. బీజేపీ దాని అనుబంధ సంఘాల ఒత్తిడి మేరకే పనిచేస్తున్నారని, పక్షపాత వైఖరి వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. వీసీని వెంటనే తొలగించాలని, అలాగే నీట్‌లో ఉన్న మెంబర్స్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి

• మేడిగడ్డపై ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీర్ల సూచనలను పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ ఒకలా, నిర్మాణం మరోలా చేయడంతోనే బ్యారేజీ కుంగిందని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ విమర్శించారు. ఆ ప్రాజెక్టులో అవినీతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌కు సంబంధించి వాస్తవాలు ప్రజలకు తెలియకుండా కేసీఆర్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టు నిర్మించడం సరికాదని ఇంజినీర్లు సూచించినప్పటికీ అక్కడే నిర్మించిందని గుర్తుచేశారు. దానికి సంబంధించిన ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కాగ్ తప్పుపట్టిందని కోదండరామ్ వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ మెటీరియల్ సక్రమంగా లేదని, నిర్వహణ కూడా సరిగ్గా లేదని డ్యామ్ సేఫ్టీ అధికారులు నివేదికలో చెప్పారని తెలిపారు. బొగ్గు గనులను వేలం ప్రయివేటీకరణకు దారి తీస్తుందని, వాటిని సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంలో జరిగిన అవినీతి అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తాము రెండు సార్లు పూర్తి సమాచారంతో నివేదికను సమర్పించినట్టు తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ఇప్పటికే రూ.800 కోట్ల ఖర్చుతో కాలువ పనులను చేపట్టారనీ, ఇక్కడి నుంచి నీటిని తీసుకునే అవకాశాన్ని పరిశీలించాలని కమిషన్ ను కోరినట్టు కోదండరామ్ వివరించారు.

మా మొర ఆలకించండి..

- పారిశుధ్య కార్మికుల ఆవేదన ●పర్మినెంట్ చేయాల్సిందేనన్న మున్సిపల్ వర్కర్స్
- జీవో నెంబర్ 1037 నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి ● జీతం లేకుండా ఎన్నాళ్లు పనిచేయాలి : జీపీ వర్కర్స్ ఆవేదన
- మల్టీపర్పస్ విధానం రద్దుకు డిమాండ్ : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, జీపీ కార్మికుల ధర్నాలు

"పారిశుధ్య కార్మికులు చీపురు, పారలు పక్కనబెట్టారు.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. ఎన్ని నెలలు జీతాలు లేకుండా పస్తులుంటూ పనులు చేయాలి? ఇచ్చేదే అరకొర వేతనం.. అదీ ఆరేడు నెలలుగా రావట్లేదు.. పైగా గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ పేరుతో అన్ని పనులూ చేయిస్తున్నారు.. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు.. ఈ వ్యవస్థలను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలి.. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి.. మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తేయాలి.." అంటూ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్స్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్, జీపీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. కలెక్టర్లు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

పారిశుధ్య కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లిస్తున్నట్టుగా తెలంగాణలోనూ రూ.21వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అశోక్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న కార్మికులు ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా అడుగడుగునా వివక్షతకు గురవుతున్నారని తెలిపారు. వివిధ మున్సిపాల్టీల్లో పన్నులు వసూలు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్స్‌ను ఆ బాధ్యతల నుంచి తీసేసి ఇతరులకు అప్పగించారని.. దాంతో వారికి ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. వీరికి ప్రత్యామ్నాయ డ్యూటీలు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనారోగ్యాలకు గురైన, పని చేయలేని స్థితిలో ఉన్న మున్సిపల్ కార్మికుని కుటుంబం ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. నూతన పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని కోరారు.

నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. జీవో నెంబర్ 1037లో ప్రతిపాదించిన మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలనే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్ ఫిక్స్‌డ్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు ఆంధ్రప్రదేశ్‌లో చెల్లిస్తున్నట్టుగా ఇక్కడా 21వేల వేతనం చెల్లించాలని అన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి 5, 6 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సుదాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంట్‌కు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం డీఎల్‌పీవోకు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికులు బైటాయించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి, కార్మికులకు గత ఆరు నెలల వేతనాలను వెంటనే అందించాలంటూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవికి వినతిపత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన తీశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికుల వద్దకొచ్చిన ఏవోకు వినతిపత్రం అందజేశారు.



మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి

- ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీని తొలగించాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ కోర్సు చదివే విద్యార్థులకు న్యాయం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీని తొలగించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయానికి ఆ కోర్సు చదివే విద్యార్థులు వచ్చి న్యాయం చేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం తొమ్మిది కాలేజీల్లో 800 మంది విద్యార్థులు ఆ కోర్సు చదువుతున్నారని చెప్పారు. వారికి సరైన కోర్సు సిలబస్ కూడా లేదన్నారు. మొదటి సంవత్సరం ఫలితాలు ఈనెలలో విడుదలయ్యాయని అన్నారు. సుమారు 97 శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారని వివరించారు. సిలబస్ లేకపోవడం, అధ్యాపకుల్లేకపోవడం వల్లే వారు ఫెయిలయ్యారని చెప్పారు. సాధారణంగా 40 శాతం మార్కులొస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారనీ, వారికి మాత్రం 50 శాతం మార్కులు రావాలన్నారు. ఇంటర్‌లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు ఆరోగ్య వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఫెయిలయ్యారని అన్నారు. గ్రేస్ మార్కులిచ్చి అందర్నీ ఉత్తీర్ణులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, నాయకులు శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.



'మా ఉద్యోగాలు.. మాకు ఇప్పించండి'

- డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టాలి
- మోకాళ్లపై కూర్చుని గురుకుల ఉపాధ్యాయుల నిరసన
- సీఎం రేవంత్‌రెడ్డి నివాసం, గాంధీభవన్ వద్ద ఆందోళన
- పెద్దమ్మ గుడి వద్ద భిక్షాటన

నవతెలంగాణ-బంజారాహిల్స్

"మా ఉద్యోగాలు మాకు ఇవ్వండి.. ఎన్నికల వేళ జాబ్ క్యాలెండర్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ పక్కనపెట్టింది.. ఉన్న ఉద్యోగాలను సైతం ఇవ్వకుండా మనోవేదనకు గురి చేస్తోంది" అని గురుకుల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గురుకుల అభ్యర్థులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. అయితే, ఇక్కడ నిరసనలకు ఎటువంటి అనుమతులూ లేవని.. సెక్యూరిటీరీత్యా ఈ ప్రాంతం నుంచి వెళ్లాలని పోలీసులు ఆదేశించడంతో వారు పెద్దమ్మ గుడి ముందు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. పలువురు మహిళా అభ్యర్థులు కొంగు పట్టి చాచి భిక్షాటన చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా, ఇక్కడి నుంచి కూడా వెళ్లిపోవాలని జూబ్లీహిల్స్ పోలీసులు ఒత్తిడి చేయడంతో వారు నాంపల్లిలోని గాంధీభవన్ గేటు వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వి వాంట్ జస్టిస్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు కేటీఆర్ పరామర్శ



నవతెలంగాణ-ఆల్వాల్

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల సత్యం సతీమణి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌లోని ఎమ్మెల్యే సత్యం నివాసానికి వెళ్లారు. సత్యం భార్య రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేను ఓదార్చారు. కేటీఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

జులై 10న కార్మికుల కోర్కెల దినం

- జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో ధర్నాలు
- కార్మికులంతా జయప్రదం చేయాలి : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా జులై పదో తేదీన కార్మికుల కోర్కెల దినాన్ని పాటించాలనీ, జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో సీఐటీయూ ఆఫీస్‌బేరర్ల సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో చుక్కరాములు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర కోడ్‌ల అమలు, బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలను వేగం చేసిందని విమర్శించారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందనీ, కార్పొరేట్ - మతోన్మాదులను ప్రసన్నం చేసుకొని వారికి లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయంగా ఉందని విమర్శించారు. ఈ విధానాలను నివారించి, కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేయకముందే మతోన్మాద-కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు బిజెపి ప్రభుత్వం రంగంలోకి దిగిందని విమర్శించారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మివేయడం, ప్రయివేటీకరించడం లాంటి వాటిని మరింత వేగవంతం చేస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును బహిరంగ వేలంలో పెట్టడం దారుణమని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేల అమలు, సమాన పనికి - సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లింపు, ఓపిఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసిందనీ, ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకమనీ, బీజేపీ పాలిత రాష్ట్రాలూ పరీక్షలు పెట్టకుండా నిరాకరించాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాల అమలు నుంచి మినహాయింపు ఇవ్వడం, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించడం, ఆశాలకు పరీక్షలు పెడతామనటం దారుణమని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, భూపాల్, ఎస్వీ.రమ, కె. ఈశ్వర్‌రావు, పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్ పాల్గొన్నారు.

తునికాకు బోనస్ నిధులను విడుదల చేయాలి

- అటవీ అధికారుల నిర్లక్ష్యాన్ని సరిదిద్దాలి : అటవీ సంరక్షణ ముఖ్యఅధికారి టీఏజీఎస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు అటవీ సంరక్షణ ముఖ్యఅధికారి డోబ్రియాల్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సహాయ కార్యదర్శి బండారు రవికుమార్, ఉపాధ్యక్షులు తొడసం భీంరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిజనులు, ఇతర పేదలకు సంబంధించిన తునికాకు బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2016లో విడుదల చేసిందని తెలిపారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే చెల్లించారనీ, మరికొన్ని జిల్లాల్లో చెల్లించలేదని పేర్కొన్నారు. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాల్లోని ఎక్కువ గ్రామాల కూలీలకు ఇప్పటి చెల్లించలేదని తెలిపారు. వెంకటాపురం ఎఫ్ఆర్వో బోనస్ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదనీ, డబ్బులు రాలేదంటున్నారని వివరించారు. తాడ్వాయి మండలంలోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎనిమిది వేల మంది లబ్దిదారులకుగాను నాలుగు వేల మందికే పంపిణీ చేశారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతం మందికి మాత్రమే తునికాకు బోనస్ ఇచ్చారని పేర్కొన్నారు. 70 శాతం మందికి ఇంకా అందలేదని వివరించారు. నార్నూరు, ఉట్నూరు, ఇంద్రవెల్లి మండలాల లబ్దిదారులకు ఇప్పటికీ పంపిణీ చేయలేదని తెలిపారు. ఇంద్రవెల్లి మండలంలో అటవీ శాఖ కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి ఆయన కుటుంబ సభ్యుల పేరుతో రూ.ఆరు లక్షలు కాజేసిన విషయం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నిధులను వెంటనే చెల్లించకుంటే దుర్వినియోగం అయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధులను విడుదల కోసం జిల్లా అటవీ అధికారులు, రేంజ్ అధికారుల స్థాయిలో జరుగుతున్న అశ్రద్ధ, నిర్లక్ష్యాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. లబ్దిదారుల వివరాలతో రేంజ్, జిల్లా స్థాయిలో జాబితాను పారదర్శకంగా అందుబాటులో ఉంచేందుకు వారికి తగిన ఆదేశాలను జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ సీనియర్ నాయకులు సూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జులై 5న సింగరేణి బంద్

- 15 రోజులపాటు దీక్షలు, నిరసనలు, కలెక్టరేట్ల ముట్టడి
- బొగ్గుగనుల ప్రయివేటీకరణతో భవిష్యత్తు అంధకారం
- ప్రజలపై భారాలు పెరిగే ప్రమాదం
- వేలంపాటకు వ్యతిరేకంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలి
- పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బొగ్గు గనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల ఐదో తేదీన సింగరేణి (కోల్‌బెల్ట్) బంద్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. 15 రోజులపాటు సీపీఐ, ఏఐటీయూసీ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, నిరాహారదీక్షలు, జిల్లాల కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ ఆవిర్భవిస్తే మన బొగ్గు గనులు మనకే ఉంటాయి. కొత్త గనులు వస్తాయి. మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.'అని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా నిరాశే మిగిలిందని అన్నారు. సింగరేణిపై ఉద్యమ కాలంలో ఇచ్చిన మాటకు భిన్నంగా కేసీఆర్ పాలన సాగించారని విమర్శించారు. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) సవరణ చట్టం-2015 ద్వారా బొగ్గు గనులు రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో నుంచి ప్రయివేటుపరం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా అదానీ, అంబానీలకు బొగ్గు గనులను అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆ చట్టం ద్వారా కుట్ర చేసిందన్నారు. నాటి సీఎం కేసీఆర్ కేంద్రానికి సహకరించారని విమర్శించారు. కేసీఆర్ ఆనాడు చేసిన పాపమే ఇప్పుడు సింగరేణికి శాపంగా మారిందని అన్నారు. ప్రమాదకరమైన ఆ చట్టం గురించి ఎందుకు నోరు మెదపలేదో కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి భవిష్యత్తు, మనుగడ ప్రమాదంలో పడ్డాయని చెప్పారు. సింగరేణి బొగ్గు టన్నుకు రూ.3,500 నుంచి రూ.4,500కు విక్రయించాలని వివరించారు. అదానీ, అంబానీ అయితే టన్ను బొగ్గును రూ.18 వేలకు విక్రయిస్తారని చెప్పారు. సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణ వల్ల బొగ్గు ధర పెరుగుతుందనీ, విద్యుత్, సిమెంట్లు, ఇనుము ధరలు పెరిగి ప్రజలపై భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా ఉండాలనీ, ప్రజల అభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాలనీ, కేంద్రంతో పోరాడాలని కోరారు. వేలం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అయోమయంలో ఉందనీ, వేలంలో పాల్గొంటే వస్తాయో రావోననీ, పాల్గొనకుంటే ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడతారన్న ఆందోళన ఉందన్నారు. సింగరేణిని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంద చెప్పారు. సింగరేణి పరిరక్షణ, బొగ్గు గనుల వేలంపాట విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. సింగరేణిని ప్రయివేట్ పరం చేయబోమంటూనే గనుల వేలం పాటకు తెరలేపడం దుర్మార్గమన్నారు. కొత్త బొగ్గు గనులను ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పగించే ప్రధాని మోడీ కుట్రలో కిషన్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారని అన్నారు. గతంలో ప్రయివేట్ వ్యక్తులకు ఇచ్చిన బొగ్గు గనుల లీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్, కేటీఆర్‌కు లేదని కూనంనేని అన్నారు. 2018లో బీఆర్ఎస్‌కు 88 ఎమ్మెల్యే సీట్లున్నా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదా?అని ప్రశ్నించారు.

ప్రయివేటు సంస్థలకు లాభాలే పరమావధి : అజీజ్‌పాషా

బొగ్గు గనులను నిర్వహిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కార్మికుల సంక్షేమంతోపాటు ప్రజలకు మేలు కలుగుతుందనీ, తక్కువ ధరకే బొగ్గు లభిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. గనులను ప్రయివేటీకరిస్తే ఆ సంస్థలకు లాభాలే పరమావధి తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోబోవని చెప్పారు. కార్మికులను దోపిడీ చేస్తాయన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణను నిలిపేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. సింగరేణి బొగ్గు గనులు ప్రయివేటుపరం అయితే అందులో పనిచేసే కార్మికులకే కాకుండా ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత గోస..

(మొదటిపేజీ తరువాయి)

1, 2014 నుంచి డిసెంబర్ 11, 2018ని కటాఫ్ తేదీలుగా నాటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ధారించింది. అది కూడా మూడు విడుతలుగా అమల్లోకి తెచ్చింది. అసలు+వడ్డీతో కలిపి కుటుంబానికి తొలి విడత రూ.25వేలలోపు, ఆ తర్వాత రూ.50వేల లోపు, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.లక్షలోపు మాఫీ చేసింది. అయితే ఫ్యామిలీ గ్రూపింగ్ సమస్యలు తలెత్తడంతో అతికొద్ది మందికి మాత్రమే రూ.లక్షలోపు రుణం మాఫీ అయింది. ఇప్పుడు రేవంత్ సర్కారు కటాఫ్ తేదీల కారణంగా 2014 నుంచి 2018 డిసెంబర్ 12కు ముందు పంట రుణాలు తీసుకుని, మాఫీకి నోచుకోని లక్షలాది మంది రైతులు ఇప్పుడు కూడా కటాఫ్ తేదీల కారణంగా అనర్హులుగా పరిగణించబడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం కోసం రూ.31వేల కోట్లు కేటాయించింది. 47 లక్షల మందిని లబ్దిదారులుగా సూచించింది. రైతుల పంట రుణాల మాఫీలో పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నింటిని అమలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. అవి అమలైతే లబ్దిదారుల సంఖ్య కొంత వరకు తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కటాఫ్ తేదీల్లో మార్పులు చేసి ఆనాడు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు 2014 ఏప్రిల్ నుంచి పరిగణలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాడు 67వేలు తీసుకుంటే.. నేడు రూ.2లక్షల వరకు..

(మొదటిపేజీ తరువాయి)

కలిపి రూ.లక్షకు పైన అయింది. కేసీఆర్ ప్రభుత్వం విడతల వారీగా మాఫీ చేసే క్రమంలో అప్పటికే రూ.లక్షకు పైన అయింది కాబట్టి మాఫీ వర్తించలేదు. రెన్యువల్ చేయించుకోవాలని బ్యాంకు నుంచి ఒత్తిడి వస్తున్నా.. మాఫీ అవుతుందనే ఉద్దేశంతో కోటిరెడ్డి వడ్డీలు చెల్లించలేదు. ఫలితంగా ఇప్పుడది రూ.2లక్షలకు చేరింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న పంట రుణాలనే పరిగణలోకి తీసుకుంటుండటంతో సదరు రైతు అనర్హుడిగా మారారు. ఇలాంటి రైతులు ఈ ఒక్క గ్రామంలోనే సుమారు 50 మందికి పైగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం లక్షకు పైగా ఉంటారని అంచనా. కాబట్టి కటాఫ్ తేదీల్లో ప్రారంభ తేదీని మార్పు చేయాల్సిందిగా సదరు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ బిల్లుల రీడింగ్‌పై అపోహలొద్దు

- టీజీఎస్‌పీడీసీఎల్ ఎమ్‌డీ ముషారఫ్ అలీ ఫారూఖీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల రీడింగ్‌పై అపోహలొద్దని దక్షిణ తెలంగాణ పంపిణి సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మీటర్ రీడింగ్ తీయాల్సినప్పటికీ, కొన్ని సందర్భాల్లో రెండు, మూడు రోజులు ఆలస్యంగా తీస్తున్నారని తెలిపారు. దీని వల్ల ఆ నెలలో వినియోగించిన యూనిట్లు పెరిగి స్లాబ్ రేటు మారడంతో అధిక బిల్లులు వస్తున్నాయనే ప్రచారం సరికాదన్నారు. 99.5 శాతం బిల్లులు నెల రోజులకే ఇస్తున్నామనీ, అనివార్య పరిస్థితుల్లో ఆలస్యం జరిగితే వినియోగదారులు నష్టపోవద్దనే ఉద్దేశంతో తగిన ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రీడింగ్ తీసిన రోజులతో సంబంధం లేకుండా కేవలం నెల రోజులకే బిల్లులు జారీ చేసేలా స్పాట్ బిల్లింగ్ మెషిన్‌లో తగిన ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. గృహ వినియోగదారుల విద్యుత్ వాడకం బిల్లులకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకునేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్లో " ఎనర్జీ చార్జెస్ క్యాలిక్యులేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసెస్" అనే సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఈ సమాచారాన్ని మొబైల్ యాప్‌లో కూడా చూసుకోవచ్చని వినియోగదారులకు సూచించారు.

డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలిస్తాం

- ఆ మహమ్మారిని కలిసి కట్టుగా ఎదుర్కొందాం
- తాత్కలిక సంతోషం కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- విద్యా సంస్థల్లో నిఘా పెట్టాం : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ ప్రతినబూనాలని పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలను సంపూర్ణంగా నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. వాటికి వ్యతిరేకంగా యువత పోరాడాలని సూచించారు. 'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దురలవాటు - అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. డ్రగ్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్‌లకు, యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని సీతక్క గుర్తు చేశారు. డ్రగ్స్ వాడితే కుటుంబాలు చితికిపోవడంతో పాటు మానసిక కుంగుబాటుతో అచేతనంగా మిగిలిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

డ్రగ్స్, గంజాయి మత్తులో అనేక మంది లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి, ఇండియన్ విమెన్ క్రికెట్ టీం మాజీ కెప్టెన్ పద్మశ్రీ మిథాలి రాజ్, సీనియర్ నటులు సుమన్, హనుమాన్ ఫేం యువ హీరో శ్రీ తేజ సజ్జ, డీజీపీ రవి గుప్తా, హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, డీసీప డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, వికలాంగులు, వయోవృద్ధులు సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

గురువారం | జూన్ 27, 2024 | www.navatelangana.com

దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ఆన్‌లైన్ విధానం ద్వారా 2024-2025 సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థినీ విద్యార్థుల కోసం అన్ని విధాల సదుపాయాలతో, ఉన్నత డిగ్రీలు అనుభవం కలిగిన బోధనా సిబ్బంది కలిగి ఉండి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో నడుస్తున్న డిగ్రీ కళాశాల చదువులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. అర్హత గల అభ్యర్థులు కళాశాల కోడ్ 12818తో దోస్త్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, అడ్మిషన్ల కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి రెండేండ్ల జైలు శిక్ష



నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ ప్రాంతంలో మైనర్‌ను ప్రేమ పేరుతో వేధించడం, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో జైపురి కాలనీ నువ్వుల బండకి చెందిన తన్నీరు సాయి కుమార్‌కు పోక్సో చట్టం ప్రకారం బుధవారం శిక్ష విధించారు. రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి ఈ కేసులో సాక్షాదారాలు పరిశీలించి నిందితుడు సాయి కుమార్‌ను దోషిగా నిర్ధారించారు. నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది. అదేవిధంగా బాధితురాలికి నష్టపరిహారంగా రూ.1,00,000 ప్రభుత్వం నుంచి అందజేశారు.

మెట్రో వాటర్ సరఫరా చేయడంపై హర్షం



● డిప్యూటీ మేయర్ శేఖర్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ పరిధి కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మెట్రో వాటర్ సరఫరాకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషి చేసినందుకు గాను డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట్‌లోని తన ఛాంబర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డిలతో కలిసి బుధవారం విలేకర్ల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలోనే పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలోనే జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉండే పేద, మధ్య తరగతి ప్రజలకు మెట్రో వాటర్ సరఫరా చేయాలనే లక్ష్యంతో ఓఆర్ఆర్ ట్యాంక్ నిర్మాణం, పైపు లైన్ నిర్మాణ పనులను పూర్తి చేశారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున నీటి సరఫరా చేయలేకపోయామన్నారు.

కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 21న జల మండలి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, స్థానిక కార్పొరేటర్ బి. రోహిణి రమేష్ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, శివ కుమార్, నాయకులు బి.శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సినీ రంగంలో సంచలనాలకు మారుపేరు కృష్ణ, దాసరి'



నవతెలంగాణ-కల్చరల్

సినీ రంగంలో సంచలనాలకు నటుడు కృష్ణ, దర్శకుడు దాసరి నారాయణరావులు మారు పేరు అని రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత గుప్త అన్నారు. వారు తీసిన సినిమాలు ప్రేక్షకులు శాశ్వతంగా గుర్తుంచుకుంటారని ఆమె చెప్పారు. ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ కళా నిలయం నిర్వహణలో సూపర్ స్టార్ కృష్ణ 81వ, దర్శకరత్న దాసరి నారాయణరావు 77వ జయంతి వేడుకలను శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుజాత గుప్తా, కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ వేణు గోపాలాచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు అల్లాణి శ్రీధర్‌కు దాసరి పేరిట సినీ జర్నలిస్ట్, వినాయక రావుకు కృష్ణ పేరిట పురస్కారాలు బహుకరించారు. అనంతరం డాక్టర్ వేణు గోపాలాచారి మాట్లాడుతూ అర్హులకు గొప్ప వారి పేరిట అవార్డ్స్ ప్రదానం చేయడంతో వాటి విలువ పెరిగిందన్నారు. శ్రీధర్ రగులుతున్న భారతం సినిమాకు దర్శకత్వం వహించి అక్కినేని, దాసరిలను డైరెక్ట్ చేయడంతో పాటు కొమరం భీం వంటి డాక్యుమెంటరీ ఫిల్మ్ తీసి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు.

వినాయక రావు నాలుగు దశాబ్దాల పైగా జర్నలిస్ట్ గా గుర్తింపు పొందారని వివరించారు. సత్కార గ్రహీత వినాయక రావు మాట్లాడుతూ.. కృష్ణ గొప్ప వ్యక్తిత్వం కల వారని, ఆయన జీవితం గురించి తాను దేవుడు లాంటి మనిషి పుస్తకం రాశానని తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ.. దాసరి మానవత్వం కల మహా మనిషి అని అన్నారు. సినీ కార్మికుల కోసం కృషి చేసిన వారని కొనియాడారు. గాయని హైమవతి భీమన్న అధ్యక్షత వహించిన సభలో చింది బద్రీనాథ్, చందు ఆంజనేయులు, మాగంటి ప్రసాద్, వీర బోగ వసంత రాయలు తదితరులు పాల్గొన్న సభకు సురేందర్ స్వాగతం పలుకగా పుష్ప వందన సమర్పణ చేశారు. తొలుత మంజు ప్రియ అనిల శిష్య బృందం చేసిన విభిన్న సినీ పాటల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ కేఫ్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర ప్రజలకు రుచికరమైన కాఫీని అందించేందుకు దక్షిణ భారత కాఫీ మార్కెట్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న, రెండు తెలుగు రాష్ట్రాల్లో 120 లైట్ మోడల్ అవుట్లెటను కలిగి ఉన్న కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ తన మొదటి ప్రీమియం కేఫ్‌ను అమీర్‌పేటలో ప్రారంభించింది. అమీర్‌పేట్ మెట్రో పక్కన ఉన్న వాసవీ ఎంపీఎం గ్రాండ్‌లో వకీల్‌సాబ్, మల్లేశం చిత్రాల్లో తన పాత్రలకు పేరుగాంచిన ప్రఖ్యాత నటి అనన్య నాగళ్ల ముఖ్య అతిథిగా హాజరై ఈ కేఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ వ్యవస్థాపకుడు, సీఈఓ గోలి గోపి మాట్లాడుతూ "హైదరాబాద్‌లో మా మొదటి ప్రీమియం అవుట్‌లెట్‌ను ప్రారంభించడం ద్వారా మా కోయంబత్తూర్ కేఫ్ మోడల్‌ను విస్తరించడం పట్ల మేం సంతోషిస్తున్నాం. ప్రీమియం కాఫీ అనుభవాల కోసం పెరుగుతున్న కస్టమర్ల డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్రీమియం మోడల్ కేఫ్‌ను ప్రారంభించాం. మా ఫ్రాంఛైజీ భాగస్వాములకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి అందించడమే మా లక్ష్యం. ఈ కొత్త కేఫ్‌తో, కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ ప్రామాణికమైన రుచిని కాఫీ ప్రియులకు అందిస్తాం" అని తెలిపారు. ముఖ్య అతిథి అనన్య నాగళ్ల మాట్లాడుతూ "హైదరాబాద్‌లోని కాఫీ ప్రియులు కోయంబత్తూరు ఫిల్టర్ కాఫీ అందించే ప్రామాణికమైన, రుచికరమైన రుచులను అభినందిస్తారని నాకు నమ్మకం ఉంది" అన్నారు.

నా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తప్పుడు కేసులు



కార్పొరేటర్ మొక్క నరేంద్ర కుమార్

నవతెలంగాణ - మీర్‌పేట్

వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకుడిగా ఎదుగుతున్నందుకు ఓర్వలేక కొంతమంది అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో నాపై కేసులు పెట్టారని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేంద్ర కుమార్ అన్నారు. జిల్లెలగూడలోని ఓ హోటల్లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 6 సంవత్సరాల నుండి మల్లు జగదీశ్వర్ రెడ్డి, సామ గణేష్ రెడ్డి, జిట్టా సురేందర్ రెడ్డి, శ్రీకృష్ణలు వ్యాపార భాగస్వాములుగా కలిసి రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా జగదీశ్వర్ రెడ్డి, సామ గణేష్ రెడ్డి, జిట్టా సురేందర్ రెడ్డిలకు వ్యాపార నిమిత్తం తాను రూ 31.28లక్షలు వివిధ సందర్భాల్లో లక్ష్య ఎంటర్ప్రైజెస్ నుండి (యుటిఆర్ నెంబర్ - ఎంఎచ్బిఎచ్ 4324253860, యూబీఐఎన్ఆర్ 2202308020120, ధనలక్ష్మి ఎంటర్ప్రైజెస్ నుండి (యుటిఆర్ నెంబర్ యూబిఐఎన్ఆర్ 22022111901264917, 22023080201206984, 22023041201427636) పలు మార్లు డబ్బులు ఇచ్చానని తెలిపారు. గత ఏడాది కాలం నుండి నా డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గత సంవత్సరం (04/11/2023) నాడు మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని.. వాళ్లను 10రోజులు రిమాండ్ కూడా చేశారని గుర్తుచేశారు. అందుకే కక్షతో జగదీశ్వర్ రెడ్డి, కీర్తి మల్లు, కళ్యాణ్ రెడ్డిలు రాజకీయంగా వ్యక్తిగతంగా నన్ను దెబ్బతీయాలనే దురుద్దేశంతో నాపై తప్పుడు కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత శనివారం తాను కొంగర కాలన్‌లోని ఓ భూమి విషయంలో తప్పుడు పత్రాలు చూపించి అగ్రిమెంటు చేయించుకుని డబ్బులు తీసుకున్నట్లు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారన్నారు. ఇది ఏమాత్రం నిజం కాదని, అసలు ఆ భూమి ఎక్కడ ఉందో, దాని యజమానులు ఎవరో కూడా నాకు తెలియదన్నారు. కేవలం తనపై కాకుండా నా భార్య, భార్య తమ్ముడుపై కేసులు పెట్టి బెదిరిస్తున్నారని చెప్పారు. నాపై తప్పుడు కేసులు పెట్టి ప్రజల్లో తప్పుడు ప్రచారం చేసినందుకు పరువు నష్టం దావా వేస్తున్నట్లు తెలిపారు. తనకు, నా కుటుంబానికి ప్రాణహాని ఉందని, తనకేం జరిగిన వారే భాద్యులు అవుతారని పేర్కొన్నారు. అందుకే నాకు రక్షణ కల్పించాలని కోరారు.

మత్తులో యువత చిత్తు

● లయన్ సి.హెచ్.గోపాల్ కృష్ణ, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణ వేణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సరదాగా మొదలై... వ్యసనంగా మారి యువత జీవితాలను చిత్తు చేస్తున్నవి(డ్రగ్స్) మాదకద్రవ్యాలని లయన్ సి.హెచ్.గోపాల్ కృష్ణ, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా, అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి తెలిపారు. డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్, ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎస్సీ బాలికల హాస్టల్లో జూన్ 26వ తేదీన 'ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను వార్డెన్ భానుప్రియ నిర్వహించారు. గెలుపొందిన వారికి బుధవారం సాయంత్రం జోన్ చైర్ పర్సన్ లయన్ సి.హెచ్.గోపాల్ కృష్ణ ,లయన్ డా.శ్రీనివాస్, లయన్ జి.కృష్ణవేణి, లయన్ శోభా రాణి, డా.హిప్నో పద్మా కమలాకర్ బహుమతులను, క్రికెట్ కిట్లు, నోట్ పుస్తకాలు, దుస్తులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో అమ్మాయిలు కూడా మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రపంచంలో ఉగ్రవాదం తరువాత అంత 'పెనుసవాలు'గా పరిణమిస్తున్న సమస్య మాదకద్రవ్యాల వినియోగమని చెప్పారు. మానసిక సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం మాదక ద్రవ్యాలే నన్నారు . లైంగిక దాడులు అఘాయిత్యాలు, హత్య, ఆత్మహత్యలకు కారణం మాదకద్రవ్యాలు వాడకమేనన్నారు. సమాజం బాగుండాలంటే తక్షణమే మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, రకరకాల మాధ్యమాలు, పద్ధతులు ద్వారా పట్టణాల నుండి మారుమూల ప్రాంతాలకూ డ్రగ్స్ అందుబాటులోకి వచ్చేసాయిని చెప్పారు. ముఖ్యంగా వీటికి యువత బలవుతోందన్నారు. యువతకు ఎరవేసి తల్లిదండ్రుల ఆకాంక్షల్ని, దేశ భవితవ్యాన్నే కసిగా కాటేస్తున్న మహా కాలసర్పం వంటిది- మత్తు రక్కసి అన్నారు. కైపులో ముంచెత్తి జీవితాలనే కబళిస్తున్న మాదకద్రవ్యాలు దేశం నలుమూలలా వ్యాపిస్తున్న తీరు నిఘా యంత్రాంగం అసమర్థతనే చాటుతోందన్నారు. ఒకర్ని అంతమొందిస్తే మరణదండన విధించే భారత్‌లో అపార యువశక్తి వ్యసనానికి బలిచేస్తున్న మాఫియాను అంతమొందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాలు ఇప్పుడు కాలనీల్లోకీ చొచ్చుకొచ్చాయన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తమైతేనే పిల్లలకు రక్షణ సాధ్యమన్నారు. పిల్లలు ఎంత చిన్నవారయినా ఒంటరిగా వదలవద్దని హెచ్చరించారు. పిల్లలను దగ్గరకు తీసుకునే వారి ప్రవర్తన ఎలా ఉందో గమనిస్తూనే ఉండాలన్నారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు తమ సమస్యను తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేరని తెలిపారు. అందుకే పిల్లల ప్రవర్తనలో మార్పు వచ్చినా, ముభావంగా ఉన్నా తల్లిదండ్రులే చొరవ తీసుకొని ఆరా తీయాలన్నారు. సమస్య తెలుసుకొని సున్నితంగా వారికి అవగాహన, రక్షణ కల్పించాలని కోరారు. ప్రపంచ జనాభాలో 22 శాతం మత్తు మందులకు బానిసలుగా చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. 296 మిలియన్ల మంది డ్రగ్స్ వాడుతుండగా, వీరిలో 36 మిలియన్ల మంది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. 40 శాతం యువత మత్తులో మునిగి తేలుతోందని అన్నారు. హైదరాబాద్ డ్రగ్స్‌కు అడ్డాగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతైనా యువతలో అవగాహన కల్పించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

'18వ వార్డు అభివృద్ధే లక్ష్యం'



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ 18వ వార్డు అభివృద్ధే లక్ష్యమని టీపీసీసీ సభ్యులు, స్థానిక కౌన్సిలర్ కాకుమాను సునీల్ అన్నారు. కమ్మగూడలోని 18వ వార్డులో రూ.13.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో కమ్మగూడ నుంచి వశిష్ట కాలనీకి వెళ్లే వారికి ప్రయాణం సులువవు తుందన్నారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో తమ వార్డులో దశల వారీగా అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాములు, దామోదర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సప్తమి వార్షికోత్సవంలో ఉప్పల



నవతెలంగాణ- నాగోల్

జై పూరి కాలనీ నాగోల్‌లో జరుగుతున్న శివ పంచయతన కాశీ విశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల సాయి తేజ, ఉప్పల సాయి కిరణ్, రాజీ రెడ్డి చిరంజీవి, జై పూర్ కాలనీ అధ్యకుడు యాదగిరి, రమేష్, మాధవి, మమత, ప్రసన్న, మీన తదితరులు పాల్గొన్నారు.

'చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

చేనేత విభాగం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మస్న రవి కుమార్ కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మస్న రవి కుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర కార్యవర్గం బుధవారం ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత విభాగం కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు చేయడానికి పనిలేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. చేనేత కార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. అదే విధంగా చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మెన్‌గా గూడూరు శ్రీనివాసులును నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అంకం శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి సత్యసాయి బాబు, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి కోనంపేట నరసింహారావు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి లింగయ్య, గ్రేటర్ హైదరాబాద్ చేనేత విభాగం అధ్యక్షులు ఏలే నరేందర్, చేనేత విభాగం నాయకులు బొడ్డు శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

30న ప్రఖ్యాత రంగస్థల ప్రయోక్త అయ్యదేవర జయంతి

నవతెలంగాణ-కల్చరల్

పౌరాణిక పద్య నాటకాల్లో విశేష కీర్తి సం పాదించిన అయ్యదేవర పురుషోత్తమ రావు అభి నవ శ్రీ కృష్ణునిగా ఆ పాత్రలో ఒదిగిపోయి నాటి రోజుల్లో పిలువబడ్డారు. ఆయన అభిమానులు శిష్యులు ఈ నెల 30 తేదీన అయ్యదేవర 92వ జయంతిని పురస్కరించుకొని చోడేశ్వర నాట్య కళా మండలి నిర్వహణలో అలకాపురిలోని శృంగేరి శంకర మఠం ప్రాంగణంలో తిరుపతి వెంకట కవులు రచించిన పండవోద్యోగ విజయాలు పౌరాణిక నాటకంలోని శయన దృశ్యం ప్రదర్శించనున్నట్టు మల్లాది వెంకట రమణ సాయి హరీశ్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

మీ ఆరోగ్యమే మీ సంపద, మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పండి అని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ లో ఇంటర్నేషనల్ ఎగినెస్ట్ డ్రగ్ ఎబ్యూజ్ ఎండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ సందర్భంగా బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '1987 నుండీ ప్రతి సంవత్సరం జూన్ 26న మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ డే ఎగినెస్ట్ డ్రగ్ ఎబ్యూజ్ ఎండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ జరుపుకుంటున్నాం అని అన్నారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబ సభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయి అని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు, జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, అసలేమీ నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారు అని చెప్పారు. ఈ సమావేశంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామ రావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి / సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి, ప్రముఖ వైద్యులు నివేదిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు సురేందర్, గంగ కిశోర్, రవి, శ్రీధర్, ప్యారా లీగల్ వాలంటీర్లు, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పార్కు అభివృద్ధికి సహకరిస్తా : ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ పార్కు అభివృద్ధికి సహకరిస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కాలనీవాసులను కలిసి మాట్లాడారు. పార్కులో నీటి కొరత సమస్యను గుర్తించి వెంటనే సొంత నిధులతో బోరును వేయించానని తెలిపారు. పార్కులో మౌలిక వసతుల కల్పనకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోస ఇచ్చారు. అనంతరం ఉపేందర్ రెడ్డి, రాఘవులు గుప్తకు కాలనీవాసులు పుష్పలతా రెడ్డి, ముప్పిడి లింగస్వామి గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, రేగట్టే నరసింహారెడ్డి, వెంకటేశ్వరరావు, దయాకర్ రెడ్డి, రఘువీర్, సంగీత శ్రీనివాస్, బాలకృష్ణ, నరసింహ యాదవ్, సుధాకర్ గుప్తా, సత్య నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమలానగర్‌లో నవజీవన్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో భూగర్భ డ్రయినేజీ మ్యాన్ హోల్‌పై నుండి భారీ వాహనాలు వెళ్లడం వలన ధ్వంసం అయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి బుధవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా కాలనీలో పర్యటించారు. మ్యాన్ హోల్‌ను పరిశీలించిన వెంటనే సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కాలనీలో ఎక్కడ చూసినా చెట్ల కొమ్మలు ఉండడంతో శానిటేషన్ సూపర్ వైజర్ రాజ్ కుమార్‌కు రోడ్డుపై ఉన్నటువంటి చెట్ల కొమ్మలను కట్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు భరత్ సింగ్, మందన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింగ్ రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | జూన్ 27, 2024 | www.navatelangana.com

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డాక్టర్ మధుకర్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభలో శామీర్ పేట రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు, ఉత్తమ రుణాలు వసూళ్లకుగాను 2023-24 సంవత్సరానికి ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి శామీర్ పేట సొసైటీ చైర్మెన్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ రామిడి మధుకర్ రెడ్డికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సంఘ చైర్మెన్ కె. సత్తయ్య ఉత్తమ సేవా పురస్కారం మెమెంటోను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శామీర్ పేట సొసైటీ చైర్మెన్ మధుకర్‌రెడ్డిని సొసైటీ పాలక మండలిని, సీఈఓను, సిబ్బందిని అభినందించారు.

వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా

- సమాచారం అందించిన వారికి రూ.1000 బహుమానం
- ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఇంటి నిర్మాణ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే జరిమానా విధించి జైలుకు పంపిస్తామని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు. బుధవారం దేవేంద్ర నగర్ కాలనీలో రోడ్డుపై ఇంటి నిర్మాణ వ్యర్థాలను పడి వేస్తున్న ట్రాక్టర్లను, గుర్తించి వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేసేవారి సమాచారం ఇస్తే వారికి రూ.1000 బహుమానం అందజేస్తామన్నారు.

అంతర్రాష్ట్ర వాహనాలపై ఆర్టీఏ చర్యలు స్వాగతిస్తున్నాం

- టీఆర్‌సీపీటీయూ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న పొరుగు రాష్ట్రాల వాహనాలపై రవాణాశాఖ తీసుకుంటున్న చర్యలను టీఆర్‌సీపీటీయూ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ స్వాగతిస్తుంది. ఈ మేరకు మంగళవారం టీఆర్‌సీపీటీయూ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. రవాణా శాఖకు లైఫ్ టాక్స్ కట్టకుండా ప్రభుత్వానికి ఆ శాఖకు నష్టం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అదే సమయంలో తెలంగాణ వ్యాప్తంగా 'అన్ గౌట్ డ్యూటీ' అంటూ వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయని, సదరు వాహనాలను అధికారుల తనిఖీల సందర్భంగా చెక్ చేయాలని ఆయన కోరారు. ఇలాంటి వాహనాల్లో సంఘ విద్రోహక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. రవాణా శాఖ ఆమోదించిన ఎల్లో ప్లేట్ స్థానంలో తెలుపు రంగు వాహనాలు నడపడం రవాణా శాఖకు ఆర్థికంగా నష్టమే జరుగుతుందన్నారు. 'అన్ గౌట్ డ్యూటీ' వైట్ ప్లేట్ వాహనాలపై రవాణాశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టాక్సీ ప్లేట్ ఎల్లో రంగు వాహనాల ద్వారా నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.



డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు 'సే నో టూ డ్రగ్' అంటూ బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎంజీఎం ఇంటర్నేషనల్ స్కూల్ చిన్నారులు చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి బంజారాహిల్స్ ఏసీపీ ముఖ్యతిథిగా హాజరై సంతకం చేశారు. డ్రగ్స్ మహమ్మారి నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు అవగాహన ఎంతో అవసరమని వారు తెలిపారు.
-నవతెలంగాణ,బంజారాహిల్స్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు భీం రెడ్డి నవీన్ రెడ్డి, ఆమర్ సింగ్, నాయకులు పప్పుల అంజిరెడ్డి, బొడిగే కృష్ణ, తూంకుంట్ల శ్రీధర్ రెడ్డి, పాశం రాజు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో మోహిత్ కుమార్‌కు రజతం



నవతెలంగాణ-బోడుప్పల్

గోవాలో జరిగిన 7వ అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు చెందిమ టి.మోహిత్ కుమార్‌కు రజత, కాంస్య పథకాలు సాధించాడు. ఈ సందర్భంగా బాలుడిని కార్పొరేషన్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అభిందించారు. భవిష్యత్‌లో ఇలాంటి పతకాలు మరిన్ని సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎస్‌వై ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి స్మార్ట్ టీవీ, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్, ఫౌండేషన్ చైర్మెన్ సామల యాదిరెడ్డి మణెమ్మ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ నందిత రెడ్డి, ఉపాధ్యక్షుడు సామల లక్ష్మణ్ అమూల్య రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు వైస్ చైర్మెన్ బద్దం అనంత రెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్ రెడ్డి, నాయకులు సామల బుచ్చి రెడ్డి, మెట్టు నర్సింహ రెడ్డి, మెట్టు మై రెడ్డి, మెట్టు లక్ష్మణ్ రెడ్డి, సామల జగన్ మోహన్ రెడ్డి, సామల కొండల్ రెడ్డి, పి.నరేష్, బి. నర్సింహ, ఎం. భాస్కర్ రెడ్డి, బి.కాంతు, ఎన్. సత్యనారాయణ, ఎన్. సంజీవ, బి.మల్లేష్, బి.రాజీ, ఎం.తిరుమల్ రెడ్డి, ఎం.అశోక్ రెడ్డి, గుండె స్వామి, గుండె కొండ, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకుకు, ఉపాధ్యాయులు, టీఎస్ఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

నయానో భయానో..'హస్త'వాసి ఎవరో!

- పీర్జాదిగూడపై అధిష్టానం ప్రత్యేక ఫోకస్..
- ఆకర్ష్ మంత్రతో రోజురోజుకూ చేరికలు జోష్
- కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్.. త్వరలోనే మరికొందరు





నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బలు తగ్గడం లేదు. అవిశ్వాసాల జోరుమీదున్న హస్తం పార్టీ నేతలు బీఆర్ఎస్‌ను దెబ్బ తీయ్యడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కుర్ర శాలినీ శ్రీకాంత్ గౌడ్‌ను కాంగ్రెస్ చేర్చుకున్నారు.

బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటికే పీర్జాదిగూడ కార్పొరేషన్‌ను హస్తం చేతికి చిక్కకుండా ప్రస్తుత మేయర్ జక్క వెంకట్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలే చేశారు. నెలల పాటు కార్పొరేషన్‌లో తనవర్గం కార్పొరేటర్లను టూర్లకు తీసుకెళ్లి హస్తంకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక దశలో కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లను మళ్లీ తన వైపునకు తిప్పుకుని తన చతురతను చూపించాడు. ఈ నెల 5న జరగాల్సిన అవిశ్వాస తీర్మానం జరగకుండా అధికార పార్టీ నేతలు అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయించారు. అనంతరం హస్తం నేతలు నయానో భయానో ఆశ చూపుతూ బీఆర్ఎస్‌లో ఉన్న కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేరేలా కృషి చేస్తున్నారు.

పీర్జాదిగూడపై అధిష్టానం ప్రత్యేక ఫోకస్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ పార్టీని దెబ్బతిసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగానే రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపల్ చైర్మెన్లను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు పావులు కదిపారు. రాష్ట్రంలో అన్ని చోట్ల తమ ప్రణాళిక వర్కౌట్ అయినా పీర్జాదిగూడలో మాత్రం కాంగ్రెస్ వేసిన పాచికలు పారలేదు. దీంతో అధి నాయకత్వమే నేరుగా రంగంలోకి దిగింది. ఇప్పుడు ఆకర్ష్ మొదలు పెట్టారు. త్వరలోనే మరికొందరు కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకుని అవిశ్వాసానికి సరిపడా సంఖ్యాబలం రాగానే మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై అవిశ్వాసం పెట్టాలనేది కాంగ్రెస్ ఆలోచనగా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

డ్రగ్స్, మాదకద్రవ్యాలను నిర్మూలించాలి



- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను నిర్మూలించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో డ్రగ్స్‌వద్దు - జీవితమే ముద్దు అని ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ అనేది ఒకప్పుడు ఎక్కడో ఒక చోట దొరికేదని, ఇప్పుడు సినీ నటులు, పాఠశాలు, ఇంజనీరింగ్ కళాశాలలు, కళాశాలలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇలా 60 శాతం యువత డ్రగ్స్‌కు బానిసలు అయ్యారని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంతో పాటు పోలీసులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో పోలీసు సిబ్బందిని కేటాయించాలన్నారు. డ్రగ్స్ తీసుకుని యువత పూర్తిగా చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయిని తీసుకుని మత్తులో ఎవరిపై దాడి చేస్తున్నారో వారికే తెలియడం లేదన్నారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో అమ్మాయిలపై దాడులు విపరీతంగా పెరిగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువత డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి మత్తు నుంచి యువత బయటపడాలంటే ప్రభుత్వం మరింత దృష్టి పెట్టి డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. చిన్నపిల్లల నుంచి మొదలు పెడితే ఇంజనీరింగ్ విద్యార్థుల వరకు డ్రగ్స్‌ను సప్లై చేస్తున్నారని తెలిపారు. యాంటీ డ్రగ్స్ ప్రోగ్రామ్స్‌ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పేర్కొన్నారు. యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో అనేకం నిర్వహిస్తామని చెప్పారు. డ్రగ్స్ వద్దు జీవితమే వద్దు అనే నినాదంతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, జిల్లా సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు, రఘు, నాయకులు సాయి, అజయ్, మిట్టు, సుబ్బు, నిఖిల్, నితీష్, శివ, చందు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాంతర ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్.కే పురం ఫ్లైఓవర్ మరమ్మతులు, సమాంతర మరో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మల్కాజిగి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బుధవారం ఆర్.కే పురంలో సమాంతర ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరగా సమాంతర ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మొదలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారి సుధాకర్, జీహెచ్ఎంసీ ఈఈ రాజు, డీఈ రేణుక, బీఆర్ఎస్ నాయకులు జి. కె హనుమంతరావు, రావుల అంజయ్య, చిందం శ్రీనివాస్, మేకల రాము యాదవ్, వెంకన్న, శ్యామ్, రాజేష్, పాపి రెడ్డి, సాయి గౌడ్, సుధీర్, నరేష్, రాజేష్, రవీంద్ర, నవీన్, బాలకృష్ణ, శంకర్ రావు, నర్సింహ, శోభ, ఉమాదేవి, రమాదేవి, పరిమళ, కాలనీవాసులు, పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థులు బుధవారం సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవితాలను కాపాడుకుందాం.. సికిల్‌సెల్ అనీమియాను ఓడిద్దామని విద్యార్థులు నినాదాలు చేశారు. సికిల్‌సెల్ అనీమియా నిర్మూలన మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మాలోత్ సైదా మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో విస్తృతంగా సికిల్ సెల్ అనీమియా, తల సేమియా వ్యాధి నిర్మూలనకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. సికిల్ సేల్ అనీమియా వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉంటే వ్యాధిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. మేడ్చల్ మండల పరిధిలోని తండాలలో జూలై మూడు వరకు



సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ మేడ్చల్ జిల్లా అధికారి జి.వినోద్ కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ రవీందర్ నాయక్, తిరుపతి, సుభాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహాలమ్మ, డాక్టర్ వేరోనికా, మరియమ్మ, సూపర్వైజర్స్ బుజ్జి, సుదర్శన్ రెడ్డి, ఆశా వర్కర్లు, ధనరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ పేరు చెప్పి రూ. 2లక్షలు వసూలు

- రూ. 3 కోట్లు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్ట్
- తహశీల్దార్, కలెక్టర్ ఆఫీస్ నుంచి వచ్చానని గంగస్థాన్ వెంచర్ నిర్వాహకులకు ఫోన్
- తహశీల్దార్ శైలజ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ తహశీల్దార్ పేరు చెప్పి ఓ వెంచర్ నిర్వాహకులకు ఫోన్ చేసి రూ.2లక్షలు వసూలు చేసి మరో మూడు కోట్లు డిమాండ్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన సీహెచ్.మహేందర్ రెడ్డి అనే వ్యక్తి సోమారం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న గంగస్థాన్ వెంచర్ నిర్వాహకులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. గంగస్థాన్ వెంచర్ నిర్వాహకులు బీఎల్ రెడ్డికి తరచూ ఫోన్ చేసి తాను మేడ్చల్ మండల తహశీల్దార్ అని, కలెక్టర్ ఆఫీస్ వారు చెప్పడంతోనే మిమ్మల్ని డబ్బులు అడుగుతున్నానని చెప్పాడు. కాగా ఇటీవల సదరు వెంచర్ నిర్వాహకులు చెక్కు రూపంలో రూ.2 లక్షలు మహేందర్ రెడ్డికి ఇచ్చినప్పటికీ మరో మూడు కోట్లు ఇవ్వాలని కోరాడు. ఇదే విషయాన్ని వెంచర్ నిర్వాహకులు బీఎల్ రెడ్డి తహశీల్దార్ శైలజ దృష్టికి తీసుకెళ్లారు. తీవ్రంగా స్పందించిన తహశీల్దార్ శైలజ సంబంధిత వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 22వ తేదీన మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వగా ఫిర్యాదు చేశారు. కాగా కేసు నమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు తహశీల్దార్ పేరు చెప్పి డబ్బు డిమాండ్ చేసిన సిహెచ్.మహేందర్ రెడ్డిపై ఐపీసీ 420,419,170 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



- మత్తుకు అలవాటు పడితే మరణమే
- మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-జవహర్‌నగర్

యువత మాదక ద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మేడ్చల్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'మత్తు పదార్థాల అలవాటు - నివారణ' అనే అంశంపై మాట్లాడుతూ..విద్యార్థులకు వాటి నుండి వచ్చే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ప్రజలు, దురఅలవాట్లకులోను కాకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తెలిపారు. చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, జవహర్ నగర్ సీఐ నాగరాజు, డీపీఈవోలు నవీన్ కుమార్, ఫయాజ్‌ఉద్దీన్, సీడబ్ల్యూసీ మెంబర్ రామ్మోహన్, ఎంఈవో శశిధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజామొయినుద్దీన్, సీడీపీవో స్వాతి, జిల్లా, మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యువత మత్తు పానీయలకు దూరంగా ఉండాలి



- మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-ఉప్పల్

మత్తు పదార్థాలు, మత్తు పానీయలు సేవించి, వాహనాలు నడుపుతే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ రింగ్ రోడ్డులో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మత్తు పానీయలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.జూలై నుంచి ట్రాఫిక్ కొత్త రూల్స్ వస్తున్నాయని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎస్సై చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-ఉప్పల్

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ కల్యాణిపూరి కి చెందిన ఎన్.అర్జున్‌రావు (32) ప్రయివేట్ వ్యాపారం చేస్తున్నారు. అత్యాశతో ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక ఇంట్లో ఎవరూ లేని సమయం లో సిలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నెహ్రూ తెలిపారు.

కాశీలో పూజకు మేడ్చల్‌లో శివలింగాల తయారీ

నవతెలంగాణ- మేడ్చల్

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి (కాశీ)లో నవంబర్ 4 నుంచి 13వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించే కోటి పార్థివ శివలింగాల పూజా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి పుట్ట మట్టితో తయారు చేసిన కోటి లింగాలను కాశీకి పంపించనున్నారు. ఇందులో భాగంగా మేడ్చల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మే30 నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారు 40వేల శివలింగాలను తయారు చేసి సిద్ధంగా ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం శివలింగాల తయారీ ముగింపు సందర్భంగా వారు తయారు చేసిన శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగాల తయారీలో పాలుపంచుకున్న వైశ్య కులస్తులు మాట్లాడుతూ.. కోటి శివలింగాల తయారీలో తాము భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 27రోజుల పాటు నిష్టగా శివలింగాలను తయారు చేసినట్టు తెలిపారు.



దోషులను కఠినంగా శిక్షించాలి

● ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ పద్మ, కె.నాగలక్ష్మీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాచిగూడకు చెందిన 15 ఏండ్ల బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ పద్మ, కె.నాగలక్ష్మీ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గంజాయికి అలవాటుపడిన నలుగురు యువకులు అమ్మాయిని బెదిరించి వారు చెప్పినట్టు ఒప్పుకోక పోతే చంపేస్తామని, యాసిడ్ పోస్తామని బెదిరించి గత కొంత కాలంగా ఆమె పై లైంగికదాడి చేస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. నగరంలో మద్యం,గంజాయి ఏరులై పారుతోందని ప్రభుత్వం వీటిని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాలికపై లైంగికదాడి విషయం ఆలస్యంగా తెలుసుకున్న ఆమె తల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని ఈ విషయంలో దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. తండ్రి లేని ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని వారికి సహాయం చేయాలని, నగరంలో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్, కుత్బుల్లాపూర్ మండల పరిధిలో రేషన్ కార్డులు లేని వారందరికి.. రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ నేతలు ఏఎస్ఓ జి.శ్రీనివాస్‌ను కోరారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్న కేసీఆర్ పది సంవత్సరాలు ఒక్క రేషన్ కార్డును మంజూరు చేయలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు మంజూరు చేయాలని తెలిపారు. గత కొంతకాలంగా నిరుపేదలు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో నిరు పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ, చారి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో కానరాని అభివృద్ధి



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

ఫతేనగర్‌లో డివిజన్ పరిధిలో కానరాని అభివృద్ధి పనులు అలాగే ఉన్నాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదుల పై ఎమ్మెల్యే స్పందించి, బస్తీలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీనదయాల్ నగర్, అదేవిధంగా భరత్ నగర్ నాలాలకు నిధులు మంజూరు అయ్యాయని, ఆయా డివిజన్ లలో పనులను వేగవంతంగా చేయాలని తెలిపారు. ప్రధానంగా డ్రయినేజీలు పొంగిపొర్లుతున్నా యని, శానిటేషన్ కూడా ఏమాత్రం జరగడం లేదని, దీనివలన ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు స్పందించి, నాలా పనులను డ్రయినేజీ, రోడ్ల పనులు, వీధి దీపాల సమ్యసలను ముఖ్యంగా శానిటేషన్, ఫాగింగ్ పనుల పై సమ్యసలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అధికారుల పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కావున స్థానికులు, పలు అసోసియేషన్ వారు ఇచ్చిన పిర్యాదు పై స్పందించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, కూతాడి రాములు, జీహెచ్ఎంసీ అధికారులు, అసోసియేషన్స్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గుర్రపుడెక్క వల్ల విజృంభిస్తున్న దోమల బెడదను పరిష్కరించండి : ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందించిన మధుసూదన్ రెడ్డి..

కూకట్‌పల్లి: చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా విజృంభిస్తున్న దోమల, ట్రాఫిక్ సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, రెయిన్బో విస్టా అధ్యక్షుడు బండి మధుసూదన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముల్లకత్వ చెరువుల్లో కలుషిత జలాల వలన పేరుకు పోయిన గుర్రపుడెక్క... దోమలు, పగలు రాత్రి అనే తేడా లేకుండా విజృంభిస్తుందటంతో, స్థానికులు వాటి బారిన పడి రోగాల పాలవుతున్నారు. ఈ చెరువుల చుట్టుపక్కల ఉన్న 2572 కుటుంబాలు, దాదాపు 10 వేల పైచిలుకు జనాభా కలిగిన రెయిన్బో విస్టాస్, రాక్ గార్డెన్, 1290 కుటుంబాలు 4 వేల పైచిలుకు జనాభా, రెయిన్బో విస్టాస్ ఫేస్1, 450 కుటుంబాలు దాదాపు 2 వేల జనాభా, చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్రనగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సప్దార్ నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్ కాలనీల దోమల సమస్యకు, అలాగే కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం వల్ల, నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్యకు, పరిష్కారం చూపమని స్థానిక కృష్ణరావుని, బండి మధుసూదన రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రామిడి.ప్రమోద్ రెడ్డి, టి.రామ్ కిరణ్, పూసపాటి దీప్తి పాల్గొన్నారు.



కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

● ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి
● ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్
● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇంటర్డీఇయట్ కార్యాలయం ఎదుట ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కారం చేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధతం చేస్తామన్నారు. శ్రీచైతన్య, నారయణ, రెసోనెన్స్ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమీల పేరుతో, లాంగ్‌టర్మ్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో ఒకే క్యాంపస్‌లో హాస్టల్స్, కాలేజీని నడుపుతూ రూ.లక్షల ఫీజులు వసూళ్లు చేస్తున్నా ఇంటర్మీడియట్ అధికారులు పరివేక్షణ లేదన్నారు. కూకట్‌పల్లి, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, ఘట్కేసర్, ఈసీఐఎల్, కొంపల్లిలో పదుల సంఖ్యలో అపార్టుమెంట్లు తీసుకుని పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు క్లోజ్ అనే పేరుతో ఫీజుల దందా చేస్తున్నారన్నారు. అనుమతుల్లేకుండా, అఫ్లియేషన్ లేకుండా తరగతులు ఇప్పుడే ప్రారంభించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ దందా నడుస్తున్నా అధికారులు కనీసం చర్యలు కూడా తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఫీజుల దందాను బంద్ చేయించి, నియంత్రణలోకి తేవాలని కోరారు. ఒకే క్యాంపస్‌లో కళాశాల, హాస్టల్స్ నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని భర్తీ చేయాలనీ, కళాశాలలు ప్రారంభమై రెండు వారాలు దాటినా పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్టుగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇచ్చి కళాశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రీ-వేరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా వేరిఫికేషన్ చేసి, మార్కులను తప్పులు లేకుండా స్పష్టంగా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు నిర్లక్ష్యం నిరసిస్తూ జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం బోర్డ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు లొంగకుండా నిష్పక్షపాత ధోరణిని అవలంభిస్తూ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాన్ని రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, జిల్లా సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు, రఘు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, అజయ్, మిట్టు, సుబ్బు, నిఖిల్, నితీష్, శివ, చందు, దినేష్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన 'డబుల్' ఇండ్ల లబ్దిదారులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ను, తన నివాస కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు కలిశారు. బాచుపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో ఉన్న మంచి నీరు, విద్యుత్, డ్రయినేజీ, దొంగల సమస్యల పరిష్కారించమని ఎమ్మెల్యేను కోరారు. అలాగే ట్రాన్సా ఫార్మర్ సమస్య గురుంచి కూడా ఆయనకు వివరించారు. దీనిపై శాసనసభ్యులు వెంటనే స్పందించి, పేదవాడి ఆత్మ గౌరవం, అలాగే కేసీఆర్ మానస పుత్రిక ఈ రెండు పడకల గదుల ఇండ్లులని వారి సమస్యలు పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం.అశోక్ కుమార్, మద్దెల సత్యనారాయణ, కిషన్, డేవిడ్, చాంగ్లెర్ ప్రశాంత్ మోహన్, దుర్గ ప్రసాద్, జయ రాజు, లబ్దిదారులు సుజిత బేగం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులలో నాణ్యత పాటించాలి



● కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తాగునీటి పైపులైన్ పనులలో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని కల్వరి టెంపుల్ నుంచి 4వ పేజ్ ఎస్‌టీపీ ప్లాంట్ వరకు నిర్మాణంలో ఉన్న వాటర్ పైప్‌లైన్ పనులను ఆయన పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉన్న ఎడల సంప్రదిస్తే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం సంశీద్, మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాదకద్రావ్యాల వ్యతిరేక దినోత్సవం



● ర్యాలీతో కదంతొక్కిన ఎంఎల్‌ఆర్ఐటీఎం, ఫార్మసి విద్యార్థులు

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపల్ పరిధిలోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మాధకద్రావ్యాల వ్యతిరేకదినోత్సవ సందర్భంగా బుధవారం మాధక ద్రావ్యాలను అరికట్టి వాటి వల్ల అనారోగ్యల బారిన పడొద్దని వ్యతిరేకంగా యాంటీ డ్రగ్ డే పేరు మీద విద్యార్థులకు కార్యక్రమం ధీర ఆర్గనైజషన్, ఎన్ఎస్ఎస్ సహకారంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యం డ్రగ్స్ వల్ల విద్యార్థులకు జరిగే అనర్థాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం వెయ్యికి పైగా విధ్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ దుండిగల్ పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.పి. శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జూన్ ఇరవై ఆరున మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నేషనల్ డే ఎగినెస్ట్ డ్రగ్ ఎబ్యూజ్ ఎండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ జరుపుకుంటాం అన్నారు. ఈ సంవత్సరపు థీం 'బెటర్ నాలెడ్జ్ ఫర్ బెటర్ కేర్' డ్రగ్ ఎబ్యూజ్ లేని సమాజాన్ని సాధించటమే ఈ రోజు యొక్క లక్ష్యం అని తెలిపారు. ఈ లక్ష్య సాధనకి ప్రభుత్వాలూ, సంస్థలూ, కుటుంబాలూ, వ్యక్తులూ అందరూ కలిసి పని చేయాలని పేర్కొన్నారు. ఆ అవగాహనని అందరికీ కల్పించే ఉద్దేశ్యం తోనే ఇది జరుపుకుంటున్నాం అని ఈ యొక్క కార్యక్రమాన్ని విద్యార్థుల యొక్క భవిష్యత్తు కోసం.. వారు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలంటే ఇలాంటి అవగాహన ఎంతగానో ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.పి శ్రీధర్, ప్రిన్సిపాల్ డా.మురళి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా.అర్నబ్ మాలిక్, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా మూసేసిన సెయింట్ మోసెస్ పాఠశాల




● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని జయరాం నగర్‌లో ఉన్న సెయింట్ మోసెస్ పాఠశాల విద్యార్థుల సామర్థ్యం సరిపడా లేరని బుధవారం అర్ధాంతరంగా మూసేశారు. దాంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో పాఠశాల ముందు నిరసనకు దిగారు. 2024 - 2025 విద్యా సంవత్సర ప్రారంభమైన 15 రోజుల అనంతరం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా పాఠశాల మూసివేయడంతో పాఠశాల యజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, సిబ్బందికి నిలదీశారు. పాఠశాల యజమాన్యం సయ్యద్ బకార్ ఆజ్ యాత్రలో ఉన్నారని, వారి ఆదేశాల మేరకే పాఠశాలను మూసివేసామని ఉపాధ్యాయులు, సిబ్బంది తెలిపారు. దానిపై మండిపడ్డ తల్లిదండ్రులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే తమ వద్ద ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను, పాక్షిక రుసుమును వసూలు చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికిప్పుడు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలని, ఇప్పటికే పలు పాఠశాలల్లో కొత్త పోర్షన్ కూడా ముగించుకొని ఇంటర్నల్ పరీక్షలకు కూడా సిద్ధమవుతున్నారని ప్రశ్నించారు. తమ వసూలు చేసిన ప్రస్తుత విద్య సంవత్సరం ఫీజును పాఠశాల నిర్వహకులు తిరిగి చెల్లిస్తామంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



● ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం కూన శ్రీశైలం గౌడ్‌ని వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, పలువురు కార్యకర్తలు తన నివాసం వద్ద కలిసి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే, ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. పలువురు మాజీ ఎమ్మెల్యేకి పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో వేలకోట్ల రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి వహిస్తున్నానని తెలిపారు. బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యేని కలిసేందుకు వివిధ బస్తీలు, కాలనీల, సంక్షేమ సంఘాల సభ్యులు, నాయకులు ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఆయన ను కలిసి వారి సమస్యలను స్వయంగా చెప్పుకున్నారు. సమస్యల పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్‌కు బ్లాక్ బెల్ట్, గ్రాండ్ మాస్టర్ చ్యూ చూ సూట్ మెమోరియల్ సేవా అవార్డు పురస్కారం..

దుండిగల్ : కుత్బుల్లాపూర్ యంగ్ డైనమిక్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌కి స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా వారు బ్లాక్ బెల్ట్ , గ్రాండ్ మాస్టర్ చ్యూ చూ సూట్ మెమోరియల్ సేవా అవార్డుతో గౌరవించి, బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనని స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా వారు గౌరవ బ్లాక్ బెల్ట్ గ్రాండ్ మాస్టర్ చ్యూ చూ సూట్ మెమోరియల్ సేవా అవార్డుతో సన్మానించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. అలాగే కారాటే సాధన ఆత్మ సంరక్షణతో బాటు ఆరోగ్యవంతమైన, దృఢమైన శరీరం కలుగుతుందని, ఆరోగ్యవంతమైన శరీరం మనకు మంచి ఆలోచనలు కలిగిస్తాయని, అందువలన నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాలనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ సలీమ్ జావీద్ బైగ్, మాస్టర్లు మీర్జా రషీద్ బైగ్, ఖాజా పశ, షోయబ్ బైగ్, ఎం.డి.బషీర్, సమీర్ బైగ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రామి రెడ్డి, రుద్రా అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో రూ.89.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పెద్ద సంఖ్యలో సీసీ రోడ్ల నిర్మాణం చేరవేగంగా పూర్తి చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. కొన్ని చోట్ల విడి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని, మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు, వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. రోడ్లు వేసేటప్పుడు కాలనీవాసులకు, వాహనదారులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండాలని ఆయన అన్నారు. ఆయనతో పాటుగా అను, అరుణ, జీహెచ్ఎంసీ అధికారులు ఇర్ఫాన్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..




● కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బస్తీ పర్యటనలో భాగంగా, బుధవారం భరత్ నగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మల్లేష్ గౌడ్ డాకయ్య, ఐలయ్య, విజయ భవాని, అభిలాష్, స్వామి పాల్గొన్నారు.

బోనాల పండగ నిధుల కోసం దరఖాస్తులు చేసుకోండి

- ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-ఓయూ

బోనాల ఉత్సవాలకు ఉత్సవాల నిర్వహించుకునే ఆలయ కమిటీ ప్రతినిధులు నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పిలుపునిచ్చారు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సందర్భంగా గత ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు రూ. 15 కోట్లు మంజూరు చేసిందని.. ఇప్పుడు ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం 34 శాతం పెంచి 20 కోట్ల రూపాయల నిధులు బోనాల పండుగ ఉత్సవాలకు మంజూరు చేసిందని తెలిపారు. కాగా, కంటోన్మెంట్ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల కమిటీ వారు పీకెట్‌లో ఎమ్మెల్యే క్యాంపు దరఖాస్తు చేసుకుంటే ఆలయాలన్నింటికీ నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు...

లబ్దిదారులకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడ్‌పల్లి లబ్దిదారులకు మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీ గణేష బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ కలిశారు లక్డీకపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్చాలిచ్చి సన్మానించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బడ్జెట్ గురించి చర్చించారు అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఆస్పత్రిలో, అంగన్వాడి కేంద్రాలలో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో మరికొన్ని బస్తీ దవాఖానాలు,అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు నివేదిక అందించారు.



పూర్తి స్థాయిలో నిఘా పెంచాం

- ఏసీపీ జగన్

నవతెలంగాణ-ఓయూ

నగరంలో నేరాల నియంత్రణకు సీపీ ఆదేశాల మేరకు పగలు రాత్రి అనే తేడా లేకుండా పూర్తి స్థాయిలో నిఘా పెంచామని ఓయూ ఏసీపీ జగన్ తెలిపారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి రౌడీ షీటర్లు అనుమానితులకు బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం, లాలాగూడ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రెడ్డితో కలిసి ఏసీపీ జగన్ మాట్లాడుతూ సమాజానికి హాని కలిగించే విధమైన చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అర్థరాత్రుల్లో అనవసరంగా రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 11 గంటల తరువాత దుకాణాలు మూసివేయాలని, లేదంటే కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎట్టిపరిస్థితుల్లో వెనుకడుగు వేసే ప్రస్తకే లేదన్నారు.

పీఎస్ పరిధిలో 22 రౌడీషీటర్లు, 34 అనుమానితులు

లాలాగూడ పీఎస్ పరిధిలో 32 మంది రౌడీషీటర్లు, 34 మంది అనుమానితులు ఉన్నారన్నారు. రౌడీ షీటర్లలో 17 మంది మర్డర్ కేసుల్లో ఉన్నవారని తెలిపారు. ఈస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో అత్యధిక రౌడీ షీటర్లు ఉన్న పోలీస్ స్టేషన్లలో లాలాగూడ ఒకటని వెల్లడించారు. రౌడీషీటర్లు ఇక ముందు ఏ కేసులో తలదూర్చినా వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉండి ఎటువంటి కేసుల్లో తలదూర్చకుండా ఉంటే వారిపై ఉన్న సస్పెక్ట్, రౌడీ షీట్లు తొలగించే విధంగా ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. రానున్న పండుగలు ప్రశాంతంగా జరగాలంటే శాంతి భద్రతలు విఘాతం కలిగించే వాళ్లపై ఉక్కుపాదం మోపక తప్పదన్నారు. అందువల్ల రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు మంచి ప్రవర్తనతో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రెడ్డి, లాలాగూడ, ఏ పెండర్, కమలాడి, ఎస్ఐలు సాహిద్పసా నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.



జులై 1న గోర్ బంజారా జాతీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఓయూ

లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 1న రవీంద్ర భారతిలో నిర్వహించే గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ నాయక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో అనేక డిమాండ్లు సాధించామని.. జులై1న జరగబోయే జాతీయ సమ్మేళనంలో గోర్ బోలిని రాజ్యాంగంలోని 8 షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో బెల్లయ్య నాయక్ ఆధ్వరంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్టు చెప్పారు. ఈ గోర్ బంజారా సమ్మేళన్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతిని ధులు, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఓ ప్రధాన కార్యదర్శి విజేందర్ పవార్, కార్యదర్శి జగదీష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ సంతోష్ నాయక్, గ్రేటర్ హైదరబాద్ అధ్యక్షులు వెంకటేష్ నాయక్, ఓయూ అధ్యక్ష కార్యదర్శులు చందర్ -గణేష్, విద్యార్థి నాయకులు కిషన్,రాజు, జంపన్న, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.



బ్రాహ్మణ బస్తీలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ

బ్రాహ్మణ బస్తీలో అధికారులతో కలిసి సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ బుధవారం పర్యటించారు స్థానికులు డ్రయినేజీ ఓవర్ ఫ్లో అవుతున్నదని, డ్రయినేజీ పైప్ లోపల చెత్త చెదరం ఉండి లోపల ఇరుక్కపోయిందని ఫిర్యాదు చేయగా అందుకు సంబంధించిన అధికారులతో కార్పొరేటర్ మాట్లాడి నూతన మ్యాన్ హోల్ నిర్మించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కార్పొరేటర్

చిలకలగూడలోని శ్రీ కట్ట మైసమ్మ పోచమ్మ ఆలయ నూతన ధర్మ కర్తలమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా కార్పొరేటర్ సామల హేమ హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ గుంటి కృష్ణ ,సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, గౌడ్ శ్రీను, సాయి యాదవ్, కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీన ప్రక్రియను ప్రారంభించినందుకు మంచి వికాస్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు అలాగే విలీనం విషయంపై ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ప్రతినిధులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గద్దం ఏబుల్, ప్రధాన కార్యదర్శి సంకీ రవీందర్, ఎలకంటి ప్రభు గుప్తా, అంబాల శ్రీనివాస్, మహమ్మద్ ఫసివుద్దీన్, అరుణ్ యాదవ్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కంటోన్మెంట్

జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బుధవారం ఐఏఎస్ ఆమ్రపాలి కాట బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ఆమ్రపాలి కాటకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రోనాల్డ్ రోస్ నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ ఆమ్రపాలిని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిలు కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



ఐఎన్‌టీయూసీ ప్లాటినం జూబ్లీ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టీయూసీ) ప్లాటినం జూబ్లీ(75వ) వేడుకలు జూబ్లీ వేడుకలు బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో నిర్వహించారు. ఐఎన్టీయూసీ ఆల్ ఇండియా సెక్రటరీ, మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాణాళిక సంఘం వైస్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, టీజేఎస్ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ్ రెడ్డి, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఝనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలను వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ప్రస్తావించారు. యూనియన్ ఎన్నికలు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బల్దియా ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని, సెక్రటేరియట్ ఉద్యోగులతో సమానంగా 125 చదరపు గజాల స్థలం ఇవ్వాలన్నారు. ప్రమోషన్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, 1 జనవరి 2024న లేదా ఆ తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కె శివ కుమార్, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు తులం బంగారం అందజేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బేగంపేట

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు తులం బంగారం అందజేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం బేగంపేటలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణ లక్ష్మి కింద 122, షాదీ ముబారక్ కింద 37 మందికి మొత్తం 159 మంది లబ్దిదారులకు ఆర్ధిక సహాయం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల పెండ్లి కోసం ఆయా కుటుంబాలు పడుతున్న ఆర్ధిక ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని వారికి అండగా నిలవాలనే ఆలోచనతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ. లక్ష 116 చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంగ్రింద లక్షలాది మంది ఆర్థిక సహాయం పొందారని వివరించారు. అయితే అర్హులైన లబ్దిదారులకు ఆర్ధిక సహాయంతో పాటు ఒక తులం బంగారం కూడా అందజేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు తులం బంగారం కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు టి.మహేశ్వరి, కుర్మ హేమలత, సుచిత్ర, దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, తహసీల్దార్ పాండు నాయక్ తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- ఐక్య విద్యార్థి, యువజన సంఘాల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



నవతెలంగాణ-ఓయూ

నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి మళ్ళీ పరీక్ష నిర్వహించాలని ఐక్య విద్యార్థి, యువజన సంఘాల కమిటీ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఐక్య విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయలేని విద్య శాఖ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల కొనుగోలులో ఉన్న వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాలని, నీట్ పరీక్ష అవకతవకల మీద సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించాలని కోరారు. నీట్ పరీక్షను రద్దు చెయ్యని యెడల ఐక్య విద్యార్థి సంఘాలు కలిసి దేశవ్యాప్తంగా నిరసనలు,ర్యాలీ లు,బంద్‌లు, రాస్తారోకోలు చేసి ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు నాగేశ్వరరావు, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ ఓయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాష్ యాదవ్, నాయకులు సుమంత్, నగేష్, శేఖర్, గోపి, నవాజ్, వీరయ్య, కార్తిక్, శంకర్, సుమంత్,రుక్మత్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



SYED SHALIMA
2460104822
467/470

MOHD.ABDUL.RAHEEM
2460104772
437/440

SHAHEEN BEGUM
2460107624
494/500

RISHI BAI
2460106277
493/500

- విద్యార్థులను అభినందించిన కాలేజీ డైరెక్టర్ కె. రమేష్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

యూసుఫ్ గూడా చెక్ పోస్ట్‌లో గల మాస్టర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపులలో గత 11 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి మార్కులను సాధిస్తున్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా అన్ని గ్రూపులలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను, మాస్టర్స్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ కె రమేష్ అభినందించారు. 11 సంవత్సరాలుగా మాస్టర్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించటం తమ కాలేజీకి ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులను అభినందిస్తూ అధ్యాపకుల శ్రద్ధ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం అభినందనీయమని డైరెక్టర్ రమేష్ అన్నారు.. సయ్యద్ శాలిమా ఎంపీసీ గ్రూప్‌లో 467/470, మహమ్మద్ అబ్దుల్ రహీం బైపీసీలో 437/440, షాహీన్ వేగం ఎంఈసీ గ్రూప్‌లో 494/500, రిషి బాయ్ సీఈసీలో 493/500. మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు.

'మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలా..?'



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రజా అభ్యున్నతి లక్ష్యంగా సుదీర్ఘ కాలంగా తన రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకురాలుగా కొనసాగుతున్న గిరిజన బిడ్డ మంత్రి సీతక్క పై సామాజిక మాధ్యమాల్లో తెర వెనుక ఉండి నిరాధారమైన ఆరోపణలు చేసే వారిపై చట్టపరంగా ముందుకు పోతామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్, ఇతర ఆదివాసి సంఘాలు హెచ్చరికలు జారీ చేశాయి. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్‌టీఎఫ్ అధ్యక్షులు ఉషా కిరణ్ మాట్లాడుతూ మంత్రి సీతక్క గిరిజన మహిళ అని చిన్న చూపు చూస్తూ ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రి దగ్గర పీఏ గా పనిచేసి ఎప్పుడో మానేసిన ఒక వ్యక్తి ద్వారా బురద జల్లుదాం అని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తెరవెనుక నుంచి ఆరోపణలు చేయిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి భంగపాటు తప్పదన్నారు. సీతక్క పై వారికి సంబంధించిన కొన్ని సామాజిక మాధ్యమాల ద్వారా బీఆర్ఎస్ పార్టీ బురద జల్లడం ఆపకపోతే చట్టపరంగా చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. ఇకనైనా బీఆర్ఎస్ బుద్ధి తెచ్చుకొని ప్రజల సమస్యల పైన దష్టి పెట్టాల్సిందిగా హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మహిళా కన్వీనర్ నాగమణి, రాష్ట్ర అధ్యక్షులు మేడే శ్రీను, ఆర్గనైజేషన్ సెక్రటరీ వాలు వాయు శ్రీని, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు పాపారావు, వారాయి సురేష్,పాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన విద్యార్థిపై చర్యలు తీసుకోవాలి

- ఓయూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టీ మహేందర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ బి మెస్‌లో పనిచేస్తున్న వర్కర్ చాంద్ పాషా పై అకారణంగా దాడి చేసిన విద్యార్థిపై చర్యలు తీసుకోవాలని ఓయూ కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీ యూ) అధ్యక్షులు టీ మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో బీ మెస్ ఎదుట ఓయూ కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్ వర్కర్స్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలా స్థాయి విస్మరించి ఉద్యోగి పై ఎలా చేయి చేసుకుంటారని ప్రశ్నించారు. విద్యార్థి పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీనివాస్ రావు ,సైన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చెన్నారెడ్డి, అడిషనల్ చీఫ్ వార్డెన్ లక్ష్మారెడ్డి ధర్నా దగ్గరకు వచ్చి వర్కర్స్‌కు జరిగిన పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అక్కడికి వచ్చిన అధికారులతో కార్మికులు విద్యార్థులు తమపై దాడి చేస్తూ పని చెయ్యకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందించి దాడి చేసిన విద్యార్థి పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చర్యలు జరగకుండా జాగ్రతలు తీసుకుంటామని హామీనిచ్చారు. దాంతో వర్కర్స్ ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా టీ మహేందర్ మాట్లాడుతూ ఓయూలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలీ చాలని వేతనాలతో కాలం గడుపుతూ ఉద్యోగాలు చేస్తుంటే వారి జీవన స్థితిగతులను అర్థం చేసుకోకుండా విద్యార్థులు అకారణంగా దాడి చెయ్యడం దుర్మార్గం అని అన్నారు. కార్మికులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.దాడి చేసిన విద్యార్థిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ఉద్యోగులపై పదేపదే దాడి జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. అధికారులు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరిగితే కార్మికులందరికీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ నేత అలకుంట హరి , కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ నాయకులు నాగరాజు,శ్రీనివాస్,నరేష్, లక్ష్మణ్ గౌడ్ మహేందర్ , పుష్ప, లక్ష్మి,శివాజీ,శ్రీనివాస్,పద్మ, పాల్గొన్నారు. మరొక వైపు చంద్ పాషా సదరు విద్యార్థి పై ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.





అందంగా ఉండాలంటే అవగాహన ఉండాలి

- మాధవి చౌదరి..

నవతెలంగాణ - బంజారాహిల్స్

అందంగా ఉండాలంటే సరిపోదని అవగాహన ఎంతో అవసరమని అప్పుడే అది సాధ్యపడుతుందని స్కిన్ స్పెషలిస్ట్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ మాధవి చౌదరి అన్నారు.జూబ్లీహిల్స్ సెలబ్రిటీ సీక్రెట్ అడ్వాన్స్ స్కిన్ అండ్ బ్యూటీ క్లినిక్‌లో యూఎస్ఏ తరహా పింక్ లిప్ బూస్టర్ స్కిన్ వైటినింగ్ ట్రీట్మెంట్, పోర్సిలీన్ అనే రెండు బూస్టర్ ట్రీట్మెంట్‌ను మొదటి సారి భారతదేశంలో మాధవి చౌదరి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కిన్ అండ్ బాడీ వైటనింగ్ కోసం సహజసిద్ధ మైన పద్ధతిలో పింక్ లిప్ బూస్టర్ ట్రీట్మెంట్ అందిస్తూ అందంగా ఉండాలంటే సరిపోదని అవగాహన ఎంతో అవసరమని అప్పుడే అది సాధ్యపడుతుందని అన్నారు.14 ఏండ్ల క్రితం సెలెబ్రిటీ సీక్రెటి క్లినిక్ లాంచ్ చేసిన సక్సెస్ ఫుల్‌గా బ్యూటీ రంగంలో సేవలు అందిస్తున్నామన్నారు. సెలెబ్రిటీ స్టూడియో పేరుతో బ్యూటీ అండ్ వెల్నెస్ కోసం ఒకే చోట కాస్మో టాలజీ, బ్యూటీ పెజెంట్, యోగ ట్రైనింగ్, ఇంటర్నేషనల్ కోర్స్ లను ఒకే చోట అందుబాటు లోకి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. హైలరానిక్ యాసిడ్స్ స్కిన్ బస్టర్స్ వాడటం వల్ల ఎలాంటి స్కిన్ మాయిశ్చరైజర్స్ అవసరం లేదని చెప్పారు.బ్యూటీ ఇండస్ట్రీలో ఉన్నవారు కొత్త ట్రీట్మెంట్ పై ట్రైనింగ్ తీసుకునే వారికి పింక్ లిప్స్,పోర్సిలీన్ అనే రెండు బూస్టర్ ట్రీట్మెంట్ పై సెలెబ్రిటీ స్టూడియోలో ట్రైనింగ్ ఇస్తామన్నారు.



ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతాఫల్ మండి పరిధిలో రవీంద్ర నగర్ పర్దిబస్తీ లో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఓయూ ఏసీపీ గ్యార జగన్ మాట్లాడుతు. డ్రగ్స్ సేవించినా ,విక్రయాలు చేసినా రవాణా చేసినా ప్రోత్సాహించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికులు ఇలాంటి అంశంపై సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్‌తో అనేక కుటుంబాలు ఎన్నో వివిధ రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానికుల చేత డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకుంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఓయూ సీఐ రాజేందర్ , ఎస్ ఐ లు నరేష్ ,కాశీ స్థానికులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

బ్లాక్ బుక్‌లో పొన్నం పేరు రాస్తున్నా

- అధికారంలోకి వచ్చాక చర్యలు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



నవతెలంగాణ - బంజారాహిల్స్

తాము అవినీతికి పాల్పడుతున్న అధికారులు, మంత్రుల పేర్లను బ్లాక్ బుక్‌లో రాస్తున్నామని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఫిల్మ్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో బ్లాక్ బుక్‌లో మొదటగా మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు చేర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల పేర్లను బ్లాక్ బుక్ లో రాస్తున్నానని తెలిపారు. వచ్చే ఐదేండ్ల తరువాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని అప్పుడు వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి పొన్నంపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని తెలిపారు. టీటీడీ ఆలయంలో సవాలు స్వీకరించి వచ్చానని.. మంత్రి సచ్చీల్లుడైతే సవాలును స్వీకరించి నిరూపించుకోవడానికి రావాలని సవాల్ విసిరారు. నిరాధారమైన ఆరోపణలు చేయడానికి తనకే అవసరం లేదని ఉన్న వాస్తవాన్ని తాను తెలియజేస్తున్నానన్నారు. ఈ విషయాన్ని మంత్రి గమనించి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

కూకట్‌పల్లి పోలీసుల వాహనాల తనిఖీలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బాలానగర్ డీసీపీ సురేష్ కూకట్ ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావుతో కలిసి, కూకట్‌పల్లి పీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ బృందాలు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఖైత్లాపూర్, భాగ్య నగర్ బస్టాప్ వద్ద వాహన తనిఖీలు చేయగా సరైన పత్రాలు లేని, సరైన నంబర్ ప్లేట్‌లు లేని 10 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, బహిరంగ మద్యం సేవించడం, పబ్లిక్ న్యూసెన్స్ కలిగించే వారి పై చిన్న కేసులు విధించారు. కూకట్‌పల్లిలోని అశోక్ వన్ మాల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి సూచనలు ఇచ్చారు.

నలుగురు ప్రముఖులకు వరిష్ఠ పురస్కారాలు

- త్వరలో హైదరాబాద్‌లో కార్యక్రమం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పుస్తకాలతో నిమిత్తలేకుండా సాహిత్య రంగంలో సమగ్ర కృషిని గుర్తిస్తూ నలుగురు ప్రముఖులకు పరిషత్తు ఏటా వరిష్ట పురస్కారాలు అందజేస్తున్నది. ఈసారి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్య, ప్రముఖ కవి, రచయిత జింబో (మంగారి రాజేందర్), ప్రముఖ ప్రజాకవి జయరాజు, ప్రముఖ కథ, నవలా రచయిత బోరి మురళీధర్ లకు 2024 సంవత్సరానికి వరిష్ట పురస్కా రాలు ప్రదానం చేసింది.

త్వరలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఉత్తమ గ్రంథ రచనలు, వరిష్ట పురస్కారాల కింద రూ.20 వేల నగదు, యువ పురస్కారం కింద రూ.10వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించడం జరుగుతుందని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి డాక్టర్ జె. చెన్నయ్య తెలిపారు.

ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం...

- యువకుడి గొంతుకోసి దారుణ హత్య
- ఒక మైనర్‌తో పాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్ బేగంపేటలో ఓ యువకుడు అతి దారుణంగా హత్యకు గురయ్యాడు. తన మరదలిని ప్రేమిస్తున్నాడని ద్వేషం పెంచుకున్న యువకుడు తన చిన్ననాటి స్నేహితుడు, మరో ఐదురుగు వ్యక్తులతో కలిసి అతి కిరాతకంగా గొంతు కోసి హత్య చేశాడు. ఈ హత్యలో ఓ మైనర్ కూడా పాల్గొనడం గమనార్హం. ఆరుగురు నిందితులను బేగంపేట పోలీసుల ంఅరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ ఏ.అశోక్‌తో కలిసి డీసీపీ ఎస్. రష్మి పెరుమాల్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

సికింద్రాబాద్ బేగంపేట పాటిగడ్డలో నివాసముండే ఆటోడ్రైవర్ మహ్మద్ ఇజాజ్ అదే ప్రాంతంలో నివాసముండే షేక్ ఉస్మాన్(26) ఇద్దరు చిన్ననాటి స్నేహితులు. కాగా షేక్ ఉస్మాన్, ఇజాజ్ మరదలు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. గత రెండేండ్లుగా వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నది. కాగా ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం ఇజాజ్‌కు తెలియడంలో ప్రేమ వ్యవహారాన్ని ఇక్కడ తో విరమించుకోవాలని, ఇక నుంచి ఇద్దరి మధ్య ఎలాంటి ఫోన్ సంభా షణలు, ఇతర సమాచారాలు ఉండరాదని హెచ్చరిస్తూ వారి ఇద్దరి ఫోన్ నంబర్లు బ్లాక్ చేయించాడు. ఇదిలా ఉండగా ఇజాజ్ మరదలి తల్లి దండ్రులు ఆమెకు పెండ్లి సంబంధాలు చూస్తున్నట్టు తెలుసుకున్న షేక్ ఉస్మాన్ ఆమె తన నుంచి దూరం అవుతుందని.. ఆమెకు పెండ్లి సంబంధాలు రాకుండా ఉండేందుకు గాను ఆమె పేరు మీద స్నాప్‌చాట్‌లో ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేశాడు. అందులో ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్టు ఫేక్ మెసేజ్‌లు పెట్టడం ప్రారం భించాడు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో షేక్ ఉస్మాన్, అతని తల్లి, సోద రుడు హుస్సేన్ కలిసి ఇజాజ్ ఇంటికివెళ్లి అతని మరదలిని ఉస్మాన్‌కు ఇచ్చి పెండ్లి చేయాలంటూ ఇజాజ్ భార్యతో ఘర్షణకు దిగారు. లేదంటే ఉరి వేసుకుని అత్మ హత్య చేసుకుంటానని ఉస్మాన్ బెదిరింపులకు పాల్పడ్డాడు.ఇదే విష యాన్ని ఇజాజ్‌కు ఆయన భార్య ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆగ్రహానికి గురైన ఇజాజ్ తన మిత్రులతో కలిసి ఉస్మాన్ సోదరుడు అయిన హుస్సేన్ వద్దకు వెళ్లి అతన్ని బెది రించాడు. ఫేక్ మెసేజ్లుపెట్టి ఆమె పరువు తీయ రాదని, ప్రవర్తన మార్చుకోకుంటే ఉస్మాన్‌ను చంపేస్తానని బెదిరించాడు. అటు తరువాత ఇజాజ్ తన స్నేహితులు అయిన పాడిగడ్డకు చెందిన మెకానిక్ మహ్మద్ ఫెరోజ్, సాహిల్ ఖాన్, స్విగ్గీ డెలివరీబాయ్‌గా పనిచేస్తున్న మహ్మద్ ఫజల్, ట్రావెల్స్ ఏజెంట్ ఎండీ. రషీద్, మరో మైనర్‌ను ఉస్మాన్‌ను చంపేందుకు స్కెచ్ వేశాడు.తన ప్లాన్‌లో భాగంగా మంగళవారం రాత్రి 11.40గంటల సమయంలో ఉస్మాన్ కోసం దారిలో మాటు వేశారు. అదే సమయంలో ఉస్మాన్ తన సోదరితో కలిసి బైక్‌పై పాటిగడ్డ ఆటో స్టాండ్ నుంచి వస్తూ గణేష్ మండపం వద్దకు చేరుకోగా అప్పటికే తన స్నేహితులతో అక్కడ మాటు వేసిన ఇజాజ్ ఉస్మాన్ బైక్‌ను అడ్డగించాడు. అతని బైక్ నుంచి దింపి పక్కనే గ్రౌండ్‌లోకి లాక్కెళ్లారు. మిగతా వారు ఉస్మాన్‌ను గట్టిగా పట్టుకోగా మృతుడి సోదరి ఎదుటే కత్తితో ఇజాజ్ అతని గొంతు కోశాడు. ఉస్మాన్‌ను ముఖంపై కత్తితో అనేక సార్లు పొడిచాడు. దీంతో ఉస్మాన్ గొంతు పూర్తిగా తెగిపోయి తల మొండానికి వెళాడుతూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. హటాత్పరిణా మాన్ని కళ్లారాచూసిన అతని సోదరి గట్టిగా కేకలు వేయడంలో నిందితులు అక్కడ నుంచి పారిపోయారు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్తలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి గంటల వ్యవధిలోనే ఆరుగురు నిందితులను అరెస్టు చేసి ఐదుగురిని రిమాండ్ చేయగా, బాలుడిని జువైనైల్ హెూవమ్‌కు తరలించారు.

భూదేవి హిల్స్‌ను నందనవనంగా చేస్తా



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలతో పాటు భూదేవిహిల్స్ కాలనీని సమస్యలు లేకుండా అభివృద్ధి చేసి నందనవనంగా చేస్తానని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధి భూదేవిహిల్స్ ప్రాంతంలో పలు సమస్యలపై పర్యటిం చారు.కొన్ని వీధుల్లో రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో స్పందించిన ఆయన గ్రేటర్ నిధులు మంజూరు చేయించి రోడ్ల మరమ్మత్తుల పనులకు శ్రీకారం చుట్టారు. ఆ ప్రాంత ంలో జరుగుతున్న రోడ్ల పనులను పరిశీలిం చారు. అనంతరం కాలనీవాసులు శాలువాతో అభి నందిస్తూ ధన్యవాదాలు తెలి పారు. ఈ సందర్భంగా కార్పొరేట ర్ కే.జగన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు విషయంలో రాజకీయాలు చేయకుండా ప్రతీ ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని వారికి చెప్పారు. కొలుకుల జైహింద్, పాల్గొన్నారు.

ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలు అందించాలి



- డీసీపీ కే.సురేష్ కుమార్
- జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సందర్శన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పోలీస్ స్టేషన్ వచ్చే ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలు అందించాలని బాలానగర్ జోన్ నూతన బాధ్యతలు స్వీకరించిన డిసిపి కే.సురేష్ కుమార్ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం సైబరాబాద్ కమిషనరేట్,బాలనగర్ జోన్ పరిధి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ.హనుమంతరావు సీఐ కే. క్రాంతి కుమార్‌తో కలిసి సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేసిన అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలు పోలీస్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరికి మెరుగైన సేవలు అందించి, వారికి తగిన న్యాయం చేసే విధంగా సిబ్బంది సహకరించాలని సూచించారు. ఫిర్యాదులు తొందరగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడ రాజీ పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, ఏఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు రూ.21వేల వేతనం ఇవ్వాలి



- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అశోక్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పారిశుధ్య కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లిస్తున్నట్టుగా తెలంగాణలోనూ రూ.21వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మున్సిపల్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న కార్మికులు ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా అడుగడుగునా వివక్షతకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ 60ని విడుదల చేసి కేటగిరీల వారీగా వేతనాలను రూ.15,600, రూ.19,600, రూ.22,750 లుగా నిర్ణయించిందని తెలిపారు. వివిధ కేటగిరీలకు వేతనాలు అమలు చేయకుండా గంపగుత్తగా అందరికీ ఒకే వేతనాన్ని వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీంతో మున్సిపాల్టీల్లో పని చేస్తున్న పబ్లిక్, నాన్ పబ్లిక్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జీఓ 970ని సవరణలు చేసి జీఓఆర్ టినెం.1037ను విడుదల చేసి జీఓ నెం.60, జీఓ నెం.63లలో నిర్ణయించిన విధంగా కేటగిరీల వారీగా వేతనాలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. సవరణ చేసి జీఓఆర్ నెం.1037ను విడుదల చేసినప్పటికీ మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పజెప్పాలని, ప్రతి ఏడాదీ ఈ సేవలను రెన్యువల్ చేసుకోవాలని ఆ జీఓలో పేర్కొన్నారని తెలిపారు. ఈ పనులను ఎంపిక చేసిన కాంట్రాక్ట్ ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించారని, దీనివల్ల గతంలో అమలు జరిగిన మళ్ళీ కాంట్రాక్ట్ దందా ప్రారంభమవుతుందని, దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతుందని తెలిపారు. వివిధ మున్సిపాల్టీల్లో పన్నులు వసూలు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్స్ నుండి పన్నులు వసూలు చేసే బాధ్యతలను తీసివేసి ఆ పనులను ఇతరులకు అప్పజెప్పారన్నారు. దీంతో వారికి ఉపాధి లేకుండా పోయిందని, వీరికి ప్రత్యామ్నాయ డ్యూటీలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందని కోరారు.

గత ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అనారోగ్యాలకు గురైన, పని చేయలేని స్థితిలో ఉన్న మున్సిపల్ కార్మికుని కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, నూతన పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లో పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న రూ.21వేల వేతనం మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకి ఇన్సూరెన్స్ కల్పించాలని, కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవాలనీ, సుబ్బు, నేను, ఇవ్వాలని, అధికారులు వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికులందరినీ పర్మనెంట్ చేస్తామని, ఔట్సోర్సింగ్ విధానం రద్దు చేస్తామని చెప్పి పదేండ్లు మున్సిపల్ కార్మికుల గురించి పట్టించుకోవడంలేదని గుర్తు చేశారు. ఈ ధర్నాలో మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ అధ్యక్షత వహించగా.. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, ఫిర్యాదిగూడ మున్సిపల్ నాయకుడు సోమయ్య, స్వప్న, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల నరసింహ, ఎల్లయ్య, సూరి, వెస్టేశ్, మహేశ్, సురేష్ మధు,పాల్గొన్నారు.



PUBLIC NOTICE

Under the instructions of My Client Sri.**Aesham Rajesh Yadav S/o Sri. Aesham Gyaneshwar Yadav** aged about 30yrs Occu;Business, R/oH.No. 8-1-93,Kummari Basti ,Old Bowen pally,Tirumalagiri,Hyderabad General Public are hereby informed that He is the absolute owner and possessor of Plot No.78 adms 159 Sq.yards in Sy Nos.610,611,612 and 613 situated at Nagaram Village and Municipality ,Keesara Mandal,Medchal-Malkajgiri Dist having purchased through Registered Sale Deed No.1494/2024 from Sri.Mohammed Khaja Pasha who has purchased from the Legal Heir of Late RLN Raju' sole legal heir Sri.R.Shankar through Regd.Sale Deed No.11537/2022. Sri.R.Shankar sold property to Mr.Mohammed Khaja Pasha declaring that he is the sole legal heir to Late RLN Raju's property vide Regd.Sale Deed No.794/1989.

General Public are hereby informed that Sri.Regunti Shankar could not provide valid Legal Heir Certificate of Late RLN Raju from competent authority. If any person has any objection, claim ,whatsoever on above subject matter is instructed to meet the undersigned with relevant documents within 7 days from the date of this publication.

E.A.Srikanth Raju
Advocate
#Flat No.202,2 nd Floor
Sarala Apartments,SR Nagar
Hyderabad-38

IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT : SECUNDERABAD
O.P.No.21 OF 2024

BETWEEN:
1. Arige Muni Devi ,W/o Arige Prakash Aged about yrs, Occ: House hold
2.Arige Prasad , aged about 39yrs, S/o Arige Prakash, Both are R/o Flot No.203, Sri Tirumal Home H.No 12-10-395, Seethaphalmandi Secundrabad-61 .
...Petitioners
AND
1.The Manager, Union Bank of India, (Erstwhile Andhra Bank) Sithaphalmandi, Secundrabad.
2.The Manager, State bank of INDIA Warasiguda Secunderabad.
3.The Manager, Cental Bank of India,Chilakal Guda,Secunderabad
4.The Manager, Bank of Baroda, Chilakal Guda, Secunderabad.
5. All Concerned
...Respondents

Please take notice that the above succession O.P No 21 of 2024 is filed by the petitioners to declare them as successors of Late Arige Prakash S/o A.Keshavalu and the same is posted **on 15-07-2024**, if any person/s having any objection / claims kindly appear either in person or through an advocate in the above said court **at 10-30 a.m.** on the above said date, as otherwise the matter will be decided accordingly.

//By Order of Court//
K.Sanjeevkumar
Advocate
Off: 11-1-30/1 Seethaphalmandi
Secunderabad-61
Cell:8309390313

IN THE COURT OF HON'BLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT:HYDERABAD.
O.S.No.1882/2024

Between :-
1).Koduri Nikhila
2).YSV Ramani
3).Rajani Prasad
4).Neeraja Nandamudi
...PLAINTIFFS.
AND
1).The Tahasildar, Ameerpet, Mandal, Hyderabad District.
2.ALL CONCERNED.
...DEFENDANTS.

Where as the above named plaintiffs has instituted a suit against you for Declaration of Legal Heirs of Late Yellapantula Venkata Bala. The second defendant herein i.e. the GENERAL PUBLIC / ALL CONCERNED are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all the material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions **On 12-07-2024 at 10-30 A.M.** to answer the claim, and further you are hereby directed to file on that day written statement of your defence and to produce on the said day all the documents in your possession or power upon which you base your defence.

A.Sneha Vardhani
Advocate
Office Address Flat No 305, Sai Sharan Apartments Anand Nagar Colony, Kahairatabad, Hyderabad. 500004.

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
C.C.NO. 34 OF 2023

Between:
Dr.A.Rajender Reddy
...Complainant
And
M/s Yashoda Krishna Automobiles (p) Ltd, And 4 others
...Opposite Parties
To,
M/s Yashoda Krishna Automobiles (p) Ltd, D.No. 2-4-1, Uppal Main Road, Uppal, Hyderabad-Rep.by its Chairman Sri. Maganti Subramanyam,

The above complainant has filed the above consumer complaint vide C.C.No.34 of 2023 against the Opposite Parties. The matter is posted to 26-07-2024 for your appearance. You are hereby summoned to appear in person or through your pleader with your defence, if any, **on 26-07-2024, at 10.30 A.M.** before the Hon'ble District Commission, RR Dist At L.B.Nagar, failing which the complaint will be heard and determined ex-parte.

Srinivasa Rao Pachwa
Advocate
#103, Venkatarama Towers,
Basheerbagh, Hyderabad-29
Ph.No.98480 44177

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE R.R.DIST., AT : HAYATHNAGAR
E.P.NO.14 OF 2018

Between:
S.Sudhakar Reddy
...Plaintiff/ DHR
And
K.L.Lalitha Kumari
...Defendant/JDR

" Here inform to general public that as per orders of honble Prl Junior Civil Judge, at Hayathnagar the public auction of below mention schedule property will be conduct **on 2-07-2024 at 10-30 AM** at court premises. Any body intertest to participate in public auction please come and participate in the same.

SCHEDULE OF PROPERTY

All that the Plot bearing No.79, in sy.No.209, situated at Abdulla hpurmet village, Abdullahpurmet mandal, R.R.Dist., admeasuring 200 Sq.Yards and bounded by :
North: Plot No. 78,
South: Plot No. 80,
East : Plot No. 63
West : 25" wide Road,

(BY ORDER OF THE HONBLE COURT)
G.SRINIVAS REDDY
Advocate,
H.No. 17-2-818, Madannapet,
Saidabad, Hyd.,
Ph. No. 9391150884

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL. JUNIOR CIVIL JUDGE CUM METROPOLITAN MAGISTRATE MEDCHAL MALKAJGIRI DISTRICT
O.S.NO. 505 OF 2024

Between :
Athinagaram Narsimulu & others.
... Plaintiffs.
AND
The Tahasildar & another.
... Defendants
To,
To whom soever it may concern.

NOTICE

Whereas, the plaintiff filed the the above suit for Suit for Declaration to declare the plaintiffs No. 1 to 6 as Legal Heirs of Late A. Mallamma in respect of suit schedule property againstTahsildar and to whom so ever concern. The case is posted on 11-07-2024 for appearance if any persons are having claim or objections they can appear before the said court on the said date at 10:30 AM., if you failed to appear on the said date and time before the said court the case will be decided as per law.

// BY ORDER OF THE COURT //
P. RAVI,
Advocate,
Sangareddy.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT: NALGONDA
I.A.NO. 1112 OF 2023
IN
OS NO.15 OF 2009

Between:-
Yeshamalla Manjula Bai
....Petitioner/Plaintiff
AND
Maila Ramesh Kumar & others
....Respondents/Defendants
To,
Respondent No.6. M/s Susruta Edu cational Academy Hyderabad, Rep. by its Secretary
Mr. G. Saibaba Reddy,O/o: 7-1-638, Flat No 116, Bhanu Enclave, Near ESI Hospital Erragadda, Hyde rabad-500038.

Take notice that the petitioners filed the above petition to appoin t- ment of Advocate Commissioner and the said petition is posted on 22.07.2024 for your appearance in the above case. If anybody have objection in this regard, appear before the Court on the said date at 10.30 AM. Otherwise, the matter will be decided Exparte. Hence, you are hereby directed to appear in persons or through Advocate before the Hon'ble Court at Nalgonda on 22.07.2024 at 10.30 AM without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per law.

// BY ORDER OF COURT //
M/S M. VIJAYAKANTH
M.Z AHMED
T. KISHORE KUMAR
SAYYAD AFROZE
Advocates,Hyderabad.
Ph: 9848985001.

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE , SANGAREDDY DISTRICT AT: SANGAREDDY.
O.S No. 1626 OF 2022

Between
Smt. Nagasani Laxmi
... Plaintiff
AND
B. Chandrakala and others
...... Defendants

SUMMONS

To
1. Sri. D.Akhil S/o. D.Hanumanthu Aged about: 26, occ: Not Known to the Plaintiff , R/o. 2-4-1106, Lal Bunglow, Nimboliadda, Hyd
Sir,

Please take Notice that, the Plaintiff has filed above for suit for perpetual injunction against the defendants in respect of Suit Schedule property. The Hon'ble Court has ordered to publish the summonson above named defendant i.e Defendant no.2 to be published in Nava Telangana Telugu Daily News Paper for his appearance on 30-07-2024 at 10:30 AM before the said Hon'ble Court. Hence, ifanyone has objection make it convenient to appear before the Hon'ble 1stAddl. Junior Civil Judge, at Sangareddyon the said date and time otherwise, the case will be decided on merits and on the material available, in your absence.

By Orders of the Court
B.SRINIVAS
ADVOCATE,
SANGAREDDY
Cell : 9618458785.

IN THE COURT OF HON'BLE PRL JUNIOR CIVIL JUDGE: YADADRI-BHONGIRI DISTRICT AT: BHONGIRI
O.S.No.128 OF 2024

BETWEEN:
1.Smt.S.Shobha Udupa W/o Late V Satyanarayana Udupa, Age 43yrs, Occ: Pvt Employee.
2.S.Mahesh Udupa S/o Late V.Satyanarayana Udupa, Age19yrs Occ: Student Both are R/o 1-37/41 /204, Flat No.204, BalajiResidency Srinivas Nagar Colony, Near Medi palli Arch, Medipalli, Ghatkesar,
...Plaintiffs
AND
1.The Tahsildar, Bhongiri Mandal Yadadri- Bhongiri District
2.All concerned
...DefendantsTo
All concerned ...Defendant No.2

Please take notice that the above suit is filed by the plaintiffs to declare them as legal heirs of LATE V SATYANARAYANA UDUPA and the same is posted **on 22-07-2024,** if any person/s having any objection / claims kindly appear either in person or through an advocate in the above said court **at 10-30 a.m.** on the above said date, as otherwise the matter will be decided accordingly.

// By Order of Court//
MOHD SAMADULLAH
ADVOCATES
#1-1-110/22, Ramdas Nagar,
Kapra, ECIL, Hyderabad.
Cell: 7981472745

BEFORE THE CHAIRMAN, MOTORACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-1ST ADDL.. DISTRICT JUDGE, AT SURYAPET
O.P.NO.17 OF 2023

BETWEEN:
ARELLA SAIBABA ...Claimants
AND
V.Venkateshwar Reddy and others. ...Respondent

Respondent No.1
Vangala Venkateshwar Reddy S/o Laxma Reddy Age;30 Years. Occ; Driver R/o Thimmapuru village and mandal,Karimnagar Dist,Telangana state.

Respondent No.2
Velicheti Sai Surya Kiran S/o Sudhakar Age; Major. Occ; owner R/o Plat No. 201, Plot No.422, Phase -1, Bhagthsinghnagar KPHB Colony,Hydrabad, Telangana state.

NOTICE

Please take notice in the above OP the case posted on 04-07-2024 for your appearance so your appe ar in person or through counsel on 04-07-2024 at about 10.30 am before the Honble court in case of your absence through matter will be decided as exparte.

// Published as per order of Honble court //
ANANTHULA YALLAIAH
ADVOCATE AND NOTARY
SURYAPET.
Date: 26-06-2024
Place: Suryapet.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT: NALGONDA
I.A.NO. 1111 OF 2023
IN
OS NO. 15 OF 2009

Between:-
Yeshamalla Manjula Bai
....Petitioner/Plaintiff
AND
Maila Ramesh Kumar & others
....Respondents/.Defendants
To,
Respondent No.6. M/s Susruta Educational Academy Hyderabad, Rep.by its Secretary
Mr. G. Saibaba Reddy,O/o: 7-1-638, Flat No 116, Bhanu Enclave, Near ESI Hospital Erragadda, Hyde rabad-500038.

Take notice that the petitioners filed the above petition to appoin t- ment of Advocate Commissioner and the said petition is posted on 22.07.2024 for your appearance in the above case. If anybody have objection in this regard, appear before the Court on the said date at 10.30 AM. Otherwise, the matter will be decided Exparte. Hence, you are hereby directed to appear in persons or through Advocate before the Hon'ble Court at Nalgonda on 22.07.2024 at 10.30 AM without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per law.

// BY ORDER OF COURT //
M/S M. VIJAYAKANTH
M.Z AHMED
T. KISHORE KUMAR
SAYYAD AFROZE
Advocates,Hyderabad.
Ph: 9848985001.

సారస్వత పరిషత్తు రాష్ట్ర స్థాయి పురస్కారాలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు 2024 సంవత్సరానికి గాను తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రకటించింది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం హైదరాబాదులో వివరాలు వెల్లడించారు. పద్య, గేయ కవిత్వంలో రాచాలపల్లి బాబు దేవిదాస శర్మ రచించిన 'శ్రీరామాయణోపనిషత్తు' బహుమతి కి ఎంపికైంది. వచన కవితలో తోట నిర్మలా రాణి 'అద్దం నా చిరునామా కాదు' బహుమతి గెలుచుకుంది. నవల ప్రక్రియలో డాక్టర్ వెన్నం ఉపేందర్ రచించిన 'మత్తడి దునికిన కోపుల నీళ్లు' గ్రంథం బహుమతికి ఎంపికైంది. సాహిత్య విమర్శలో బండారి రాజ్ కుమార్ రచించిన 'తెలంగాణ కవి ముద్ర' గ్రంథం ఎంపికైంది. కథ ప్రక్రియలో డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన 'కండిషన్స్ అప్లై' గ్రంథం పురస్కారానికి ఎంపికైంది. ఇతరాల విభాగంలో రావుల పుల్లాచారి రచించిన 'రచ్చబండ' నాటికల సంపుటి పురస్కారానికి ఎంపికైంది. పోలీస్ భూమేష్ రచించిన 'స్వేచ్ఛకు సంకెళ్లు' కవితా సంపుటికి యువ పురస్కారం లభించింది.



గురుకుల అభ్యర్థులు తమకు ఉద్యోగాలు కల్పించాలని సీఎం ఇంటి ముందు ఆందోళన చేశారు. అక్కడ నుంచి నాంపల్లిలోని గాంధీ భవన్‌కు వద్ద ఉద్యోగాల భర్తీ చేపట్టి, తమకు న్యాయం చేయాలని నిరసనకు దిగారు. నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జలమండలి ఎండీగా అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- ఘన స్వాగతం పలికిన అధికారులు, ఉద్యోగులు
- 2009-11 మధ్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సేవలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.15 గంటల సమ యంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయనకు జలమండలి ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఇప్పటిదాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి నుంచి ఆయన ఛార్జ్ తీసుకున్నారు.

గతంలోనూ జలమండలితో అనుబంధం

అశోక్ రెడ్డికి ఇప్పటికే జలమండలితో అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన రెండేళ్లపాటు జల మండలిలో పనిచేశారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో ఆయన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), ఫైనాన్స్ డైరెక్టర్‌గా సేవలు అందించారు. తర్వాత 2012 నుంచి 2014 వరకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. 2019లో 9 నెలల పాటు మూసీ రివర్ డెవల ప్‌మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గానూ పని చేసిన అనుభవముంది. ఇప్పటి దాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి సాధారణ పరిపాలన శాఖకు బదిలీపై వెళ్లారు. ఆయన గతేడాది డిసెంబరు 18న జలమండలి ఎండీగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 7 నెలలపాటు ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

'బొల్లి మచ్చలు ఉన్న వారు బాధపడాల్సిన అవసరం లేదు'





- అందంతో ఆనందం..ఆనందంతో ఆరోగ్యం
- బార్బీ స్కిన్ కాస్మోటిక్ అండ్ లేజర్ క్లినిక్ ఎండి డాక్టర్ ఎం.నరసింహారావు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదని, బొల్లి మచ్చలు ఉన్న వారు బాధపడవలసిన అవసరం లేదని బార్బీ స్కిన్ కాస్మోటిక్ అండ్ లేజర్ క్లినిక్ ఎండి డాక్టర్ ఎం. నరసింహా రావు అన్నారు. 'అందంతో ఆనందంగా ఆనందంతో ఆరోగ్యంగా' అనే నినాదంతో బార్బీ స్కిన్ కేర్ క్లినిక్ దాదాపు 28 సంవత్సరాల నుంచి ఎంతో కృషి చేస్తుందన్నారు. నయనమ్..ప్రధానమ్ అన్నట్లుగా శరీరంలో అన్ని భాగాల తర్వాత అధిక ప్రాధాన్యత చర్మానికి ఉంటుందన్నారు. బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదని, భయపడవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఎలాంటి చెట్ల మందులు తీసుకోకుండా, నొప్పి లేకుండా ట్రీట్ మెంట్, డైట్ ద్వారా తగ్గించుకోవచ్చునని ఆయన సూచించారు.బొల్లి మచ్చలతో బాధపడవలసిన అవసరం లేదని, ముఖ్యంగా తమ స్కిన్ కేర్ క్లినిక్ లో బొల్లి మచ్చల వ్యాధిని తగ్గించడం, నల్ల మచ్చలు, మొటిమలు, మొటిమ గుంటలు నిర్మూలించడం లో లేజర్ అండ్ సర్జికల్ చికిత్సల ద్వారా పూర్తి నయం చేయవచ్చున న్నారు. జుట్టు రాలడం, బట్టతలకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నామ న్నారు. తమ క్లినిక్ లు హిమాయత్ నగర్, కోఠి, కేపీహెచ్‌బీ కాలనీ, ఏపీలో విజయవాడ, వైజాగ్ ప్రాంతాల్లో అందు బాటులో ఉన్నాయని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యం ఛార్జీలు ఉండటం తమ ప్రత్యేకత అన్నారు. ప్రతీ మంగళ వారం ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు పేదలకు ఉచితంగా హిమాయత్ నగర్ బ్రాంచీలో వైద్య సేవలతో పాటు భోజన సౌకర్యం ఉంటుం దన్నారు. అన్ని రకాల చర్మ, కాస్మోటిక్ చికిత్సలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్: 8885625515ను సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి

- ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చెందాలంటే ప్రతి కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల ఖైరతా బాద్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోలుపునూరి కృష్ణ గౌడ్‌ను ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు యాసిన్ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని కొత్త పాత అని తేడా లేకుండా పార్టీ అభివృద్ధికి సమిష్టి కృషితోనే పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట మైనార్టీ అధ్యక్షులు మోహిద్ అలిమ్ యూసుఫ్, స్థానిక నాయకులు మహమ్మద్ అలీ, యూసుఫ్, నిజాంద్దీన్ వాజిద్, అమీర్, బషీర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ లోని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. చిక్కడపల్లిలోని సంజీవయ్య నగర్ బస్తీలో జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీత వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్‌తో కలిసి పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరు గుతున్నాయని వాటిని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందిస్తా మన్నారు. సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు మరిన్ని నిధులు కేటాయించేందుకు చర్చించి, కమ్యూనిటీ హాలుకు మరిన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేసేందుకు తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల సురేందర్, గ్యనేశ్వర్, స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహా నగరానికి నీరు సరఫరా చేసే కష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-2 లోని కోదండా పూర్ పంప్ హౌజ్‌లో రెండో పంపు ఎన్ఆర్‌వీ వాల్వ్ మరమ్మతులకు గురైంది. దీంతో అత్యవసరంగా నీటి సరఫరా నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో అటు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు కూడా జరు గుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే.. యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరిస్తారని అధికారులు తెలిపారు. ఈ మరమ్మతుల పనుల కారణంగా జలమండలి ఓ అండ్ ఎం డివిజన్లు - 2, 3, 4, 5, 7, 9, 10(ఏ), 10(బీ), 13, 14, 16, 20 పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం తాగు నీటి సరఫరాలో కొన్నిచోట్ల పూర్తి అంతరాయం, కొన్నిచోట్ల పాక్షిక అంతరాయం ఏర్పడుతుందని వారు చెప్పారు. మరి కొన్నిప్రాంతాల్లో ప్రెజర్‌తో నీరు సరఫరా అవుతుందన్నారు. కావున అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగ దారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

ఎస్‌పీఏ, మిరాలం, బాలాపూర్, మైసారం, బార్కాస్ భోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండి, భోలక్ పూర్, చిలకల గూడ, తార్నాక, లాలాపేట్, బౌద్ధ నగర్, మారేడ్ పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్ నగర్, పాటిగడ్డ, హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, వైశాలి నగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కపురి కాలనీ, మహీంద్రహిల్స్, ఎలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కా నగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, మీర్ పేట్, బడంగ్ పేట్, శంషాబాద్.

'ఆస్తమా నిర్మూలనకు
డా.వీరపనేని విష్ణున్ రావు అవిశ్రాంత పోరాటం'

- శ్వాస ఫౌండేషన్‌తో ఉన్నతమైన వైద్య సేవలు
- ఆస్తమా అంతం.. కాలుష్య నివారణతోనే సాధ్యం
- జాతీయ స్థాయిలో వైద్యులుగా ఆయనకు పేరు ప్రఖ్యాతలు







నవతెలంగాణ-హిమాయత్‌నగర్

డాక్టర్ వీరపనేని విష్ణున్ రావు జాతీయ స్థాయిలో ఆస్తమా వైద్య నిపు ణులుగా పేరొందారు. సాధారణ వైద్యుడిగా ప్రస్థానం ప్రారంభిం చిన విష్ణున్‌రావు తన అవిశ్రాం త అధ్యయనం, పరిజ్ఞానంతో జాతీయ స్థాయిలో రాణిస్తూ అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. మానవుడి మనుగడపై తీవ్రమైన ప్రభావం చూపించే ఆస్తమా వ్యాధి మూలాలను శోధించిన డాక్టర్ వీరపనేని విష్ణున్ రావు గడిచిన 40 ఏండ్లుగా వేల మందికి ఆస్తమా నుంచి ఉపశమనం కలిగించారు. వైద్య సేవలతో పాటు ఆస్తమా వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్న వాటిపై ప్రజలు యుద్ధం చేయాలని ప్రబోధిస్తూ ప్రత్యేక ఉద్యమానికి సన్నద్ధమవుతున్న చైతన్యశీలి డాక్టర్ విష్ణున్ రావుపై జూలై 1న "డాక్టర్స్ డే" సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నేరేడుచర్ల మండలం, కల్లూరు గ్రామానికి చెందిన వీరపనేని విష్ణున్ రావు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రథమార్థం లో నేరేడుచర్ల మండలంలోనే వైద్యశాలను ఏర్పాటు చేశారు. అనం తరం 1992లో మిర్యాల గూడ పట్టణంలో చిన్న పిల్లల వైద్యశాలను ప్రారం భించిన ఆయన అప్పుడే విస్తరిస్తున్న ఆస్తమా వ్యాధిపై అధ్యయ నం ప్రారంభించారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఆస్తమా అధికంగా వస్తున్న అంశాన్ని గుర్తించిన విష్ణున్ రావు ఆ ప్రాంతంలో సుమారు 5,6వేల మంది చిన్నారులను పరీక్షించి ఆస్తమా వ్యాధి రావడానికి గల కారణాలు అన్వే షించి 2003లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఊపిరితిత్తుల మహా సభలో తన నివేదికలను ప్రవేశపెట్టి 'యంగ్ సైంటిస్ట్' అవార్డు అందుకు న్నారు. ఈ క్రమంలోనే 1999లో ఆస్తమా 2000ను ప్రారంభించి 'ఆస్తమా శాపం కాదు.. అనుకుంటే నయమైపోద్ది' అనే కాన్సెప్ట్ తో ఆస్తమా వ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. రాష్ట్రంలో అప్పటి వరకు ఆస్తమా నివారణకు సరైన వైద్యులు లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆస్తమా రోగులు అత్యధికంగా డాక్టర్ విష్ణున్ రావు వద్దకు వచ్చి వైద్యం పొంది నయం చేయించుకునే పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ఆస్తమా వైద్య సేవలను అందరికి అందుబాటులో ఉంచాలనే సదుద్దేశ్యంతో హైదరాబాదులో 2004 సంవత్సరంలో శ్వాస ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక వైద్యశాలను ప్రారంభించారు. గడిచిన 20 ఏండ్లుగా ఆస్తమా బారి నుంచి అనేక మందికి విముక్తి కలిగిస్తూ జాతీయ స్థాయి వైద్యులుగా పేరు ప్రఖ్యాతలు సాధించారు.

ఆస్తమా అంతం కాలుష్య నివారణతోనే సాధ్యం..

ప్రస్తుత సమాజంలో ఆస్తమా వ్యాధికి కాలుష్యమే అత్యధికంగా కారణమవుతుందని ఆస్తమా వైద్య నిపుణులు డాక్టర్ వీరపనేని విష్ణున్ రావు అన్నారు. సింహభాగం ఆస్తమా పిల్లల్లో మొదలవుతుందన్నారు. జీన్స్‌లో లేని వారికి కూడా ఆస్తమా వ్యాపించడానికి కాలుష్యమే కారణమవుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం కారణంగా ప్రతి సంవత్సరం 70 లక్షల మంది మృతి చెందుతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనై జేషన్ లెక్కలు చెబుతుందన్నారు. ఆస్తమా వ్యాప్తికి ఇండోర్, అవుట్ డోర్ కాలుష్యాలే కారణ మవుతున్నాయన్నారు. కాలుష్యాన్ని కంట్రోల్ చేసే మూల కారణాలను అన్వేషించాల్సిన బాధ్య త ప్రజలందరిపై ఉందన్నారు. అందుకోసమే జాతీయ స్థాయి సేవా సంస్థల సహకారంతో రాష్ట్రంలో శ్వాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ క్లబ్ ఏర్పాటు చేసి 'డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్' ఉద్య మాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

ఇంటి నుంచే కాలుష్యాన్ని కంట్రోల్ చేసుకోవాలి..

ఆస్తమా వ్యాధికి అడ్రస్‌గా మారే కాలుష్యాని కి ఇంట్లో అనుసరించే విధానాలే కారణమవుతు న్నాయన్నారు. ఇంట్లో దేవుళ్ల వద్ద వెలిగించే అగరవత్తులు, సాంబ్రాణి పొగలు, కర్పూరం బిల్లల నుంచి వెలువడే వాయువుల కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అత్యధికంగా వ్యాపిస్తాయన్నారు. అలాగే బాత్ రూమ్‌ల్లో, వంట గదుల్లో సువాసనల కోసం ఏసీ, కూలర్లలో కలిపే కెమికల్స్ వల్ల ఆస్తమా వచ్చే అవకాశాలు సింహ భాగం ఉన్నాయన్నారు. కాలుష్య విధ్వంసంపై ఆస్తమా వ్యాప్తిపై ఉద్యమించేందు కు శ్వాస ఫౌండేషన్, ఆస్పత్రి ఆధ్వర్యంలో తమ వైద్య బృందం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

'అగ్నిపథ్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి'

- అగ్నిపథ్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారత రక్షణ రంగాన్ని ప్రయివేటు పరం చేసే 'అగ్నిపథ్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద 'అగ్నిపథ్' పథకాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం నిప్పులబాట పథకమని విమర్శించారు.

స్వాతంత్ర్య వచ్చి 75 ఏండ్లు గడచిన ఆర్మీ అభ్యర్థుల పట్ల పాలకులు కనబరుస్తున్న తీరు బాధాకరమన్నారు. సైనికులకు దీర్ఘకాలిక ఉపాధి కల్పించడం వల్ల వారు దేశానికి అంకిత భావంతో పని చేసే బాధ్యతను ఎంచు కుంటారని పేర్కొన్నారు. కానీ మోదీ విధా నాలు సైనికుల త్యాగనిరతిని దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. ఆర్మీలో పెన్షన్ల భారం అంటూనే కాషాయ మత చాందస విధానా లను అనుసరించే కుటిల ప్రయత్నాలలో భాగమే ఈ అగ్నిపథ్ నియామక ప్రక్రియ అని అన్నారు. అగ్నిపథ్ సైనికులకు నాలుగేళ్ల సర్వీస్ తర్వాత తమ పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామని బడా సంపన్నులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత కాలం ఎంత మంది సైనికులకు ఉపాధి అవకాశాలు కల్పించారో వారు వెల్లడించాలని ప్రశ్నిం చారు. కేంద్ర ప్రభుత్వం 2019లో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22 శాతానికి తగ్గించారని, ఈ తగ్గింపు వల్ల దేశానికి రూ. 10 వేల కోట్లు, కార్పొరేట్ పన్ను తగ్గింపుతో దేశానికి లక్ష కోట్ల రూపాయల రెవన్యూ లోటు ఏర్పడిందన్నారు. ఇదంతా పారిశ్రామికవేత్తలకు, ధనికులకు లాభాలు గత మూడేళ్లలో 57 శాతం పెరిగిందన్నారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని, యువతకు ఉపాధి అవకాశాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్ అలీ ఖాన్, అనీల్ కుమార్, బాలు, మహేష్, మురళీ, కిరణ్, చెట్టుకింద శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలను తగ్గించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజు రోజుకూ పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ పద్మ కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ చౌరాస్తాలో ధరలపై జరిగిన ధర్నాలో మహిళలు పాల్గొని నిరసన తెలిపారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. ఆకాశాన్నంటుతున్న ధరలతో ప్రజలు అర్ధాకలితో కాలం గడపాల్సి వస్తోందని మహి ళలు సరైన ఆహారం తీసుకోలేక రక్తహీనతతో అనా రోగ్యాల బారిన పడుతున్నారని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పెరుగుతున్న ధరలను అదుపు లోకి తేవాలని లేని యెడల మహిళలు పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతారని ఐద్వా హైదరాబాద్ సెంట్ర ల్ సిటీ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ధర్నా కార్యక్రమంలో ఐద్వా నగర నాయకులు వై. వరలక్ష్మి, పీ.విమల, షాబాన, రాణి, తదితరులు పాల్గొన్నారు.

సంచలనమైనా కేసులను సైతం సింపుల్‌గా హ్యాండిల్

- ఎక్కడ పనిచేసినా చెరగని ముద్ర
- రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డు సొంతం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ ఎంత పెద్ద కేసునైనా చాలా సింపుల్‌గా హ్యాండిల్ చేస్తారు. ఎంత ఒత్తిడి ఉన్నా.. దర్యాప్తుపై ప్రభావం పడకు ండా చూసుకుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఎన్నో సంచలనాత్మకమైన కేసులను ఇట్టే పరిష్కరించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగా లపై మంచిపట్టుంది. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం సంయుక్త పోలీసు కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ తన మార్క్ మార్పులను చూపించారు. పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్ సమస్యల నుంచి హైదరాబాద్ ప్రజలకు ఎన్నో పరిష్కారా మార్గాలు చూపారు. ఆపరేషన్ రోప్‌లో రంగనాథ్ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా రంగనాథ్ ట్రాఫిక్ సీపీగా బాధ్యతలు చేపట్టే సమయంలో నగరంలో వాహనదారులపై కోట్లాది రూపాయల ఛాలన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో వాహనదారులు రోడ్లపైకి వస్తే చాలు ట్రాఫిక్ పోలీసులు ఛాలన ్లను ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. దాంతో ఆటోవాలాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందుల ను ఎదుర్కొన్నారు. విషయాన్ని రంగనాథ్ దృష్టికెళ్లింది. ట్రాఫిక్ ఛాలన్లపై దృష్టి సారించిన ఆయన క్షేత్రస్థాయిలో విషయాన్ని పరిశీలించి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. రంగనాథ్ ప్రతిపాదనలను పరి శీలించిన ప్రభుత్వం ఆ తర్వాత 70శాతం నుంచి 80 శాతం వరకు డిసౌంట్‌ను ప్రకటించింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా డిస్కౌంట్ అమలు కావడంతో ఆటో యూనియన్లు, ఇతర సంఘాల నాయకులు, సామాన్య వాహనదారుల నుంచి రంగనాథ్ ప్రశంసలు పొందారు. నగరంలో ట్రాఫిక్ డీసీపీ, జాయింట్ సీపీగా, అదనపు సీపీ క్రైమ్స్ అండ్ సిట్, మల్టీజోన్ -1ఐజీగా పనిచేసిన రంగనాథ్ గతంలో ఖమ్మం, నల్గొండ ఎస్‌పీగా, వరంగంల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి చెరగని ముద్ర వేశారు. జీహెచ్ఎంసీ ఇవీడీఎం పరిధి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఐజీ రంగనాథ్‌ను నియమించినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.

రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డు

1996 బ్యాచ్‌కు చెందిన రంగనాథ్ 2000 సంవత్సరంలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ఆ తర్వాత కొత్త గూడెం డీఎస్పీగా బదిలీ అయి, 2003 వరకు కొత్తగూడెంలో పనిచేశారు. ఆ తర్వాత సం వత్సరంపాటు వరంగల్ జిల్లా నర్సంపేటలో పనిచేశారు. బలిమెల ప్రాంతంలో గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ పునరుద్ధరించడంలో ఏవీ రంగనాథ్ కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలో రంగనాథ్ పనికి గుర్తింపుగా రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డు కూడా దక్కింది.

కీలక కేసులను ఛేదించిన ఐజీ రంగనాథ్

సంచలనం సష్టించిన అయేషా మీరా హత్యకేసు, నల్లగొండ జిల్లాలో అమత-ప్రణయ్ కేసు విషయంలో ఎంతో చొరవ చూపారు. అప్ప టి కష్ణా జిల్లా నందిగామలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసును ఛేదించడంలో రంగనాథ్ అత్యంత కీలకంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నా రు. 2004లో ప్రకాశం జిల్లా మార్కాపురంలో విధులు నిర్వర్తించారు. వరంగల్‌లో మెడికల్ విద్యార్థిని ప్రీతి కేసు తెలంగాణలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. విద్యార్థులు, మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో రంగంలోకి దిగిన రంగనాథ్ గంట ల్లోనే చర్యలు తీసుకున్నారు. ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారణమైన మెడికో సైఫ్‌ను అదుపు లోకి తీసుకున్నారు. ఆయన సర్వీస్‌లో ఎన్నో సంచలనమైన కేసులను ఛేదించారు.

వరంగల్‌లో క్షీరాభిషేకం...



సంచలనమైన కేసులను ఛేదించడంలో రంగనాథ్‌కు మంచి పేరుప్రతిష్టలున్నాయి. భూ కబ్జాధారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ఆయన సామాన్యులకు న్యాయం చేస్తారన్న పేరుంది. ఒక కేసును ఛేదించేందుకు క్షేత్రస్థాయిలో దర్యాప్తుపై దృష్టి సారిస్తారు. అసలు సమస్య ఎక్కడ మొదలైంది.. ఎలా పెరిగింది.. అందుకు కారణం ఏంటో స్పష్టంగా తెలుసుకొని ముందుకెళ్తారు. నేరస్తులు ఏంతటి వారైనా వదిలిపెట్టరు. వారిలో పోలీసులున్నా, వారి ప్రమేయమున్నా చర్యలు తీసుకుంటారు. రాజకీయ నాయకులైనా కేసులు నమోదు చేపిస్తారు. రైతు నాడెం వీరస్వామి, రాజ్యలక్ష్మి దంపతులకు వరంగల్ జిల్లా నర్సంపేటలోశివారు ప్రాంతంలో రెండెకరాల భూమి ఉంది. అందులో నుంచి ఇరవై గుంటల భూమిని 2018లో బానోతు సునీల్ నాయక్ దంపతులకు విక్రయించారు. మిగితా భూమిని సైతం విక్రయించాలంటూ వారు ఒత్తిడి చేయడం తో పాటు బెదిరించారు. కొంత మందితో కలిసి హద్దురాళ్లను తొలగించి పొలాన్ని ధ్వంసం చేశా రు. అయినప్పటికీ బాధితులు వీరస్వామి లొంగ కపోవడంతో తప్పుడు కేసులను పెట్టించారు. భయాందోళనకు గురైన దంపతులు సీపీ రంగ నాథ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచా రణ జరిపించిన సీపీ బాధితులకు న్యాయం చేశా రు. ఎక్కడకూడా న్యాయం జరగకపోవడం, సీపీ వద్ద న్యాయం జరిగిందని పట్టలేని సంతో షంతో ఆ దంపతులు సీపీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఒక పోలీస్ అధికారికి క్షీరాభిషేకం చేయడంతో ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

జీహెచ్ఎంసీ ఇవీడీఎం కమిషనర్‌గా ఏ.వీ. రంగనాథ్



జీహెచ్ఎంసీ ఎన్ ఫోర్సుమెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ నూతన కమిషనర్‌గా ఏ.వీ. రంగనాథ్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలియజేశారు.



తెలుగు చిత్ర పరిశ్రమలో భానుమతి తర్వాత గర్వించదగిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. తన నటనతో ప్రేమక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు. బాలనటిగా, కథానాయికగా, దర్శకురాలిగా, నిర్మాతగా తన ప్రతిభాపాటవాలను చాటరు. అత్యధిక సినిమాలకు దర్శకత్వం వహించిన తొలి మహిళగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు లిఖించుకున్నారు. చారడేసి కండ్లతో వెండితెరపై ఓ వెలుగు వెలిగారు. విజయ కృష్ణ బ్యానర్‌పై పదిహేను చిత్రాలు నిర్మించిన ఘనత ఆమెకే దక్కింది. ఆమే ప్రముఖ నటి, దర్శకురాలు **విజయ నిర్మల**. ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా ఆమె సినీ ప్రస్థానం నేటి మానవిలో...

సెట్‌లో మాత్రం హిట్లర్

విజయనిర్మల సొంతూరు గుంటూరు జిల్లాలోని నరసరావుపేట. తల్లి శకుంతల. విజయ నిర్మల బాల్యం అత్యధిక భాగం పాతూరులో గడిచింది. రాజావారి కోటలోని విక్టోరియా హాల్లో చిన్నతనంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చేవారు. తర్వాత కాలంలో ఆమె తల్లిదండ్రులు చెన్నైలో స్థిరపడ్డారు. ఈమె అసలు పేరు నిర్మల. తనకు సినీరంగంలో కథానాయికగా తొలి అవకాశమిచ్చి, మంచి విజయాన్ని అందించిన విజయా స్టూడియోకు కృతజ్ఞతగా విజయనిర్మల అని పేరు మార్చుకున్నారు. అలాగే అప్పటికే నిర్మల పేరుతో మరో నటి ఉండటంతో కూడా తన పేరును మార్చుకున్నారు.

తొలి చిత్రానికే నంది

1950లో తమిళ చిత్రం మచ్చ రేకై, పాండురంగ మహత్యం వంటి చిత్రాలలో బాలనటిగా సినీ రంగంలోకి ప్రవేశించారు. తర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకున్నారు. 1964లో మలయాళ చిత్రం భార్గవి నిలయంలో ప్రధాన పాత్రలో నటించి అతి పెద్ద సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఆ తర్వాత విజయ ప్రొడక్షన్స్ నిర్మించిన తమిళ చిత్రంలో నటించారు. రంగులరాట్నం చిత్రంలో మొట్టమొదటిసారిగా తెలుగు చిత్రసీమలోకి అడుగు పెట్టారు. అందులో అగ్ర కథానాయికగా నటించారు. తొలి చిత్రానికే నంది అవార్డు అందుకున్నారు. తెలుగులో ఆమె రెండవ చిత్రం సాక్షి. ఆ సినిమాలో కృష్ణ హీరో. ఆ సినిమాలో నటిస్తుండగా ఇద్దరి మధ్య పరిచయం పెరిగి వివాహానికి దారి తీసింది. వీరిద్దరూ కలిసి 47 చిత్రాలలో నటించారు.

కుటుంబ విలువలకే ప్రాధాన్యం

మీనా అనే నవల ఆధారంగా తీసిన 'మీనా' చిత్రంతో దర్శకురాలిగా అరంగ్రేటం చేశారు. దర్శకత్వంలో ఆమె పనితనం చూసి అందరూ ఆమెను పని రాక్షసి అని పిలిచేవారు. విజయనిర్మల తెలుగులో నలభై చిత్రాలకు దర్శకత్వం వహించగా, మలయాళం, తమిళంలో ఒక్కొక్క చిత్రానికి దర్శకత్వం వహించారు. శివాజీ గణేషన్‌కి దర్శకత్వం వహించిన ఘనత ఆమెకే దక్కింది. ఈవిడ సినిమాలు ఎక్కువగా కుటుంబ విలువలకు ప్రాధాన్యం ఇచ్చేవిగా ఉండటమే కాక తెలుగుదనం ఉట్టి పడేలా ఉండేవి. విజయనిర్మల కృష్ణ నటించిన సినిమాలు టక్కరి దొంగ, అక్క చెల్లెలు, మంచి కుటుంబం, మళ్లీ పెళ్లి, పగసాగిస్తా, మోసగాళ్లకు మోసగాడు, దేవదాసు, కురు క్షేత్రం, మూడు పువ్వులు ఆరు కాయలు.

ప్రతి సినిమా ఓ ఆణిముత్యం

అల్లూరి సీతా రామరాజు, దేవదాసు, కురుక్షేత్రం సినిమాలలో ఆమె నటనకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టారు. దేవదాసులో ప్రేమించిన వ్యక్తికి దూరమై, ఇంకొకరికి భార్యై, పిల్లలకు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రియుడు మద్యానికి బానిస అయ్యాడని తెలుసుకుని మానసిక క్షోభకు గురైన పార్వతి పాత్ర ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. పట్నవాసం సినిమాలో గీత పాత్రలో చదువు రాని పల్లెటూరి వాడికి చదువు నేర్పించి, తన దగ్గర మేనేజర్‌గా ఉద్యోగం ఇచ్చి అతన్నే ప్రేమించి పెండ్లి చేసుకోవాలి అనుకున్నప్పుడు ఆమె చుట్టు ఉన్న బంధువులు సమస్యలు సృష్టించినా వాటికి భయపడక ధైర్యంగా నిలబడి వారిని ప్రశ్నించిన తీరు అందరికీ ఆదర్శం. ఇలా ఆమె ప్రతి సినిమా ఓ ఆణిముత్యం. ఎక్కడా అసభ్యత కనిపించేది కాదు. కుటుంబంతో సహా చూడదగ్గ సినిమాలు తీసిన ఘనత ఆమెది. సినీ రంగంలో మాహిళలును ఎంతగానో ప్రోత్సాహించారు. వెండితెరపైనే కాదు బుల్లి తెర ప్రేక్షకులకు కూడా ఆమె దగ్గరయ్యారు. పెళ్లి కానుక అనే ధారావాహికలో నటించి మెప్పించారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్

లోకల్‌గా షూటింగ్‌లు జరిగేటపుడు ఈమే స్వయంగా అందరికీ వంట చేసి క్యారెజ్‌లు తీసుకెళ్ళేవారంట. అదే ఔట్ డోర్ షూటింగ్‌లప్పుడు వంట సామగ్రిని తీసుకు వెళ్లేవారంట. అక్కడ కూడా స్వయంగా వంట చేసి అందరికీ పెట్టేవారు. అందుకే అందరూ ఆమెను అన్నపూర్ణమ్మగా భావించేవారు. అలాగే అసిస్టెంట్ డైరెక్టర్లు ఈమెను ప్రేమగా అమ్మ అని పిలిచేవారు. అయితే సెట్‌లో మాత్రం హిట్లర్‌గా ఉండేవారు. 200 కంటే ఎక్కువ చిత్రాల్లో నటించి, ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన మహిళా దర్శకురాలిగా విజయ నిర్మల చరిత్ర సృష్టించారు. ఇందుకు గానూ 2002లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కించుకున్నారు. 2008లో ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డ్ గెలుచుకున్నారు. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి తన 73 ఏండ్ల వయసులో అనారోగ్యంతో జూన్ 27వ తేదీ కన్నుమూశారు.

- పాలపర్తి సంధ్యారాణి



దేవదాసులో ప్రేమించిన వ్యక్తికి దూరమై, ఇంకొకరికి భార్యై, పిల్లలకు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రియుడు మద్యానికి బానిస అయ్యాడని తెలుసుకుని మానసిక క్షోభకు గురైన పార్వతి పాత్ర ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయిందనడంలో అతిశయోక్తి లేదు.



ఆమె ప్రతి సినిమా ఓ ఆణిముత్యం. ఎక్కడా అసభ్యత కనిపించేది కాదు. కుటుంబంతో సహా చూడదగ్గ సినిమాలు తీసిన ఘనత ఆమెది. సినీ రంగంలో మాహిళలును ఎంతగానో ప్రోత్సాహించారు. వెండితెరపైనే కాదు బుల్లి తెర ప్రేక్షకులను కూడా ఆమె దగ్గరయ్యారు. పెళ్లి కానుక అనే ధారావాహికలో నటించి మెప్పించారు.

వేడి నీళ్లు.. ఎన్నో లాభాలు

వర్షాలు పడుతున్నాయి... మరో వైపు ఎండా మండుతున్నది. ఇలాంటప్పుడు ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకోవాలి. ఆహారంతో పాటు నీటిని తీసుకోవడంలోనూ తగు జాగ్రత్తలు పాటించాలి. తాగే నీళ్ల వేడిచేయడం వల్ల కంటికి కనిపించని క్రిములు, కీటకాలు నశించిపోతాయి. జలుబు, దగ్గు, జ్వరాలు రావు.

చల్లని వాతావరణం ఉన్నప్పుడు గోరువెచ్చటి



నీళ్లు తాగితే శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యి బద్ధకం తగ్గి యాక్టివ్‌గా మారుతుంది. చలి, వణుకు లాంటి లక్షణాలు ఏమైనా ఉంటే తగ్గిపోతాయి.

అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారు రోజూ వేడి నీరు తాగితే శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

ఆడవాళ్లకు నెలసరిలో వచ్చే అనేక సమస్యలు గోరువెచ్చటి నీళ్లతో పరిష్కారమవుతాయి. ఆ సమయంలో కలిగే విసుగూ అలసటా తగ్గుతాయి. పీరియడ్స్ టైమ్‌లో వచ్చే కడుపు నొప్పి నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. మొటిమలు రావు. చుండ్రు రాదు. జుట్టు రాలదు, కుదుళ్ల బలపడతాయి.

వేడి నీళ్లతో అవయవాలన్నీ ఉత్తేజితమవుతాయి. జీర్ణప్రక్రియను వద్ధిచేసి మలబద్ధక సమస్యను నివారిస్తాయి. కడుపు నొప్పి, అజీర్తి జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

వేడినీళ్లు తాగితే.. నరాల పనితీరు మెరుగుపడుతుంది. రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. శరీరంలో మలినాలన్నీ వెళ్లిపోతాయి.

వేడి నీళ్లు తాగితే దంతాల్లో ఇరుక్కుపోయిన క్రిములు చచ్చిపోయి దంత సమస్యలు తగ్గుతాయి. కీళ్ల నొప్పులతో బాధపడేవారు వేడి నీళ్లు తాగితే, ఆర్థ్రైటీస్ సమస్యలు తగ్గుతాయి. శరీరం పొడి బారదు. ముఖం కాంతిమంతంగా ఉంటుంది. ■

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించండి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే జాతీయ రహదారులుగా ప్రకటించిన మార్గాల పనుల ప్రారంభం తదితర విషయాలను కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ (158.645 కిలోమీటర్లు) రహదారిని జాతీయ రహదారి గా ప్రకటించారని, దాని భూ సేకరణకయ్యే వ్యయంలో సగభాగాన్ని తమ ప్రభుత్వమే భరిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ భాగంలో తమ వంతు పనులు వేగవంతం చేశామని తెలిపారు. చౌటుప్పల్ నుంచి ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి వరకు (181.87 కిలో మీటర్లు) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి, ఈ ఏడాది ఎన్‌హెచ్ఏఐ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ (ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్) నుంచి వలిగొండ-తొర్రూర్-నెల్లికుదురు-మహబూబాబాద్-ఇల్లెందు- కొత్తగూడెం వరకు రహదారిని (ఎన్‌హెచ్-930పీ) జాతీయ రహదారిగా ప్రకటించారని, ఇందులో కేవలం ఒక ప్యాకేజీ కింద 69 కిలో మీటర్లకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని సీఎం మంత్రి గడ్కరీ దష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ వాసులు భద్రాచలం వెళ్లేందుకు 40 కిలో మీటర్ల దూరం తగ్గించే ఈ రహదారిని జై శ్రీరామ్ రహదారిగా వరంగల్ సభలో నితిన్ గడ్కరీ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఈ రహదారిలో మిగిలిన మూడు ప్యాకేజీలకు (165 కిలో మీటర్లు) టెండర్లు పిలిచినందున వెంటనే పనులు ప్రారంభించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య రహదారి పనులు చేపట్టాలి

హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్ 65) జాతీయ రహదారిని 2024, ఏప్రిల్‌లోగా ఆరు లైన్లుగా విస్తరించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలకమైన ఈ రహదారిలో రోజుకు 60 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, వాహనాల రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విపరీతమైన రద్దీ ఉన్నప్పటికీ రాష్ట్ర విభజనతో వాహన రద్దీ తగ్గిందని, తమకు సరైన ఆదాయం రావడం లేదంటూ కాంట్రాక్ట్ సంస్థ ఆరు లైన్ల పనులు చేపట్టడం లేదని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఎన్‌హెచ్ఏఐ, కాంట్రాక్ట్ సంస్థ మధ్య వివాదాన్ని పరిష్కరించి త్వరగా ఆరులైన్ల రహదారి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఐకానిక్ బ్రిడ్జి.. ఎలివేటెడ్ కారిడార్

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్- సోమశిల- కరివెన-నంద్యాల (ఎన్‌హెచ్-167కే) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి 142 కిలో మీటర్ల పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. మిగిలిన 32 కిలోమీటర్ల పనులకు, ఐకానిక్ బ్రిడ్జికి టెండర్లు పిలిచారని, ఆ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ వాసులకు తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. కల్వకుర్తి-నంద్యాల రహదారి (ఎన్‌హెచ్ -167కే) హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ఉన్న రహదారిలో (ఎన్‌హెచ్ 765కే) 67 కిలోమీటర్ వద్ద (కల్వకుర్తి) ప్రారంభమవుతుందని, ఎన్‌హెచ్ 167కే జాతీయ రహదారి పనులు చేపట్టినందున, హైదరాబాద్- కల్వకుర్తి వరకు ఉన్న (ఎన్‌హెచ్ 765కే) రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి-కరివెన వరకు జాతీయ రహదారి పూర్తయ్యే లోపు హైదరాబాద్-కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం (ఎన్‌హెచ్ 765) మార్గంలో 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని, అటవీ అనుమతులు లేక అక్కడ పనులు చేపట్టలేదని తెలిపారు. ఈ మార్గంలో నిత్యం ఏడువేలకుపైగా వాహన రాకపోకలు సాగిస్తాయని, ఈ నేపథ్యంలో ఆమ్రాబాద్ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

మంథనికి జాతీయ రహదారి ప్రకటించండి

ఇప్పటి వరకు జాతీయ రహదారుల చిత్రంలో మంథనికి చోటు దక్కలేదని, జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ రహదారి పూర్తయితే ఎన్‌హెచ్-565, ఎన్‌హెచ్-353సీ అనుసంధానమవుతాయని, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు అనువుగా ఉంటుందని, దక్షిణ కాశీగా గుర్తింపుపొందిన కాళేశ్వరం క్షేత్రానికి అనుసంధానత పెరుగుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.

కేంద్ర మంత్రి దృష్టికి ఇతరాంశాలు

తెలంగాణను కర్ణాటక, మహారాష్ట్రను అనుసంధానించే హైదరాబాద్-మన్నెగూడ నాలుగు వరుసల జాతీయ రహదారిగా (ఎన్‌హెచ్-163) ప్రకటించడంతో భూ సేకరణ పూర్తి చేశాం. టెండర్లు పిలవడం పూర్తయిన ఎన్జీటీలో కేసు వలన పనులు ప్రారంభం కాలేదు. ఆ మార్గంలో ఉన్న మర్రి చెట్లను కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం ట్రాన్స్‌లోకేషన్ చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించింది. ఈ దశలో ఎలైన్‌మెంట్ మార్చడం సాధ్యం కాదు. సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేసి ఈ మార్గం పనులు వెంటనే ప్రారంభించాలి. సేతు బంధన్ స్కీం కింద 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 12 ఆర్వోబీలు/ఆర్‌యూబీలను వెంటనే మంజూరు చేయాలి.జగిత్యాల-కాటారం (130 కిలో మీటర్లు), దిండి-నల్గొండ (100 కిలో మీటర్లు), భువనగిరి-చిట్యాల (44 కిలో మీటర్లు), చౌటుప్పల్-సంగారెడ్డి (182 కిలో మీటర్లు), మరికల్-రామసముద్రం (63 కిలో మీటర్లు), వనపర్తి-మంత్రాలయం (110 కిలో మీటర్లు), మన్నెగూడ-బీదర్ (134 కిలో మీటర్లు), కరీంనగర్-పిట్లం (165 కిలో మీటర్లు), ఎర్రవెల్లి క్రాస్ రోడ్-రాయచూర్ (67 కిలో మీటర్లు), కొత్తపల్లి-దుద్దెడ (75 కిలో మీటర్లు), సారపాక-ఏటూరు నాగారం (93 కిలో మీటర్లు), దుద్దెడ-రాయగిరి క్రాస్ రోడ్ (63 కిలో మీటర్లు), జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కిలో మీటర్లు), సిరిసిల్ల-కోరట్ల (65 కిలో మీటర్లు), భూత్పూర్-సిరిగిరిపాడు (166 కిలో మీటర్లు), కరీంనగర్-రాయపట్నం (60 కిలో మీటర్లు) మొత్తం 1,617 కిలో మీటర్ల జాతీయ రహదారులను అప్‌గ్రేడ్ చేయాలి.

ఆస్ట్రేలియాకు అసాంజే

(మొదటిపేజీ తరువాయి)

డిపార్ట్‌మెంట్ ముందు హాజరైన ఆయన ఒక ఒప్పందం ప్రకారం తన తప్పును అంగీకరించారు. దీంతో అసాంజే విడుదలకు మార్గం సుగుమమైంది. దశాబ్దకాలానికిపైగా న్యాయ పోరాటం తర్వాత స్వేచ్ఛ వాయువులు పీల్చుకునేందుకు వీలైంది.

ఇది ట్రైలరే..

(మొదటిపేజీ తరువాయి)

తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతో 20 నిమిషాల పాటు ఫోన్‌లో సంప్రదించారు. సురేష్‌ను అభ్యర్థిగా నిలిపేముందు ఇండియా బ్లాక్ తనను సంప్రదించ లేదని మమత కినుక వహించారు. ఆమెను శాంతపరిచేందుకు రాహుల్ చేసిన ప్రయత్నం ఫలించింది.

ఫామ్‌హౌస్‌లో గులాబీ బాస్ బిజీ బిజీ

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేల్లో నలుగురు బుధవారం కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు వెళ్లి కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్టు ప్రచారం సాగుతున్న వారంతా కూడా కేసీఆర్‌ను కలవడం విశేషం. ఆయనను కలిసిన వారిలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డితో పాటు జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఢిల్లీలోనే ఉన్నందున కేసీఆర్ భేటీకి హాజరుకాలేదు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు రసమయి బాలకృష్ణ, జీవన్‌రెడ్డి, రజినీ సాయిచంద్ కూడా ఉన్నారు.

మర్యాద కోసం కలిసినా చివరి వరకు కొనసాగేనా..?

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేల్లో కొందరు చివరి వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై భూకబ్జాలు, విద్యా సంస్థల్లో అక్రమాలంటూ అనేక కేసులు చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే పలు కేసుల్లో అరెస్టులు, రాద్ధాంతాలు సాగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్తులు, విద్యా సంస్థల్ని కాపాడుకోవడమే మల్లారెడ్డి కుటుంబం తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నట్టు ఆయన వర్గీయుల్లో చర్చ నడుస్తోంది. దీనికోసం తప్పనిసరి పరిస్థితుల్లో అధికార పార్టీ గుమ్మం తట్టే అవకాశమూ లేకపోలేదని అంటున్నారు. మల్లారెడ్డి కోడలు ఇప్పటికే పలుమార్లు కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకుల్ని కలిసిన విషయం విదితమే. ఇక ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సైతం నియోజకవర్గ అభివృద్ధే మంత్రంగా పనిచేస్తున్నారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆయన కేవలం నియోజకవర్గ అభివృద్ధి పేరిటనే బీఆర్ఎస్‌లో చేరారు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆయన ప్రస్తుతమూ నియోజకవర్గ అభివృద్ధి, అనుచరులు, క్యాడర్‌ను కాపాడుకునేందుకే కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశముందని ఆయన సన్నిహితులు చెబుతున్న మాట. ఇక ఉప్పల్, మల్కాజిగిరి, పటాన్‌చెరు ఎమ్మెల్యేలు కూడా తమ ఆస్తులు, వ్యాపారాలు దెబ్బతినకుండా ఉండేందుకు కారు దిగుతారనే చర్చ ఉంది. అయితే కేసీఆర్ పట్ల నమ్మకం, భరోసా ఉన్నందునే వారు ఎర్రవెల్లికి వెళ్లి కలిశారంటున్నారు. పార్టీలో కొనసాగుతారంటూ బీఆర్ఎస్ విశ్వసిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు వరుసగా పార్టీ వీడుతుండటంతో నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ అయోమయానికి గురవుతుంది. పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల్ని కాపాడుకోవడం కోసమే కేసీఆర్ ఎర్రవల్లి కేంద్రంగా వరుసగా మంతనాలు జరుపుతున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. కష్టకాలంలో పార్టీని వీడిపోవాలన్న వారి గురించి ఆలోచించకుండా ఉన్న వాళ్ల చేజారి పోకుండా కాపాడుకునేందుకు కేసీఆర్, హరీశ్‌రావు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. చివరివరకు ఎంత మంది ఉంటారనే ఆసక్తి నెలకొంది.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

(మొదటిపేజీ తరువాయి)

స్పెషాలిటీ ఆదేశాలకు సవరణ, కొత్త మెడికల్ కాలేజీలకు బస్సు సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం తమకు సంతృప్తినిచ్చిందని వారు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో జూడాల వసతిగహాలు, ఇతర సౌకర్యాలు, కాకతీయ మెడికల్ కాలేజీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం రూ.204 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంటిది కాదని గుర్తుచేశారు. జూడాలు తనకు ఈ నెల 15న వినతిపత్రం సమర్పించారనీ, 11 రోజుల్లోనే సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. వినతిపత్రం స్వీకరించినప్పటి నుంచి తమ శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరిపారనీ, ఆర్థికశాఖ, ఇతర శాఖలతోనూ ఆ డిమాండ్లపై చర్చించినట్టు తెలిపారు. డాక్టర్ల భద్రతకు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి హోంశాఖను ఇప్పటికే కోరామని తెలిపారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం కోర్టు పరిధిలో ఉన్న అంశమనీ, అయినప్పటికీ దాని నిర్మాణానికి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తున్నదని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యమందించడం ద్వారా ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తున్నదని తెలిపారు. ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామనీ, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్‌ను కూడా అదే విధంగా అమలు చేస్తామని తెలిపారు.

నీట్ స్కామ్‌పై మోడీ మౌనమేలా!

(మొదటిపేజీ తరువాయి)

ఎస్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కృష్ణ మాట్లాడారు. తెలంగాణ నుంచి 65 వేల మందికిపైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, వారి భవిష్యత్తు గురించి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాట్లాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష, చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

అప్పటికీ స్పందించకపోతే నీట్ కౌన్సెలింగ్ రోజు దేశవ్యాప్తంగా అన్ని విద్యార్థి, యువజన సంఘాలను ఏకం చేసి భారత్ బంద్ నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా ఎన్‌టీఏ, నీట్ పరీక్షలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హస్మి బాబు, ఎండీ జావిద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సాయికృష్ణ, ఏఐవైఎఫ్ అనిల్, స్టాలిన్ శ్రీమాన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఎంపీ గోడం నగేష్ నివాసాన్ని విద్యార్థులు ముట్టడించారు. ఎంపీ ఇంటి ఎదుట బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. నాయకులను బలవంతంగా అక్కడి నుంచి అరెస్టు చేసి తీసుకెళ్లే క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. నీట్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నా పార్లమెంట్‌లో ఏ ఒక్క ఎంపీ మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. నీట్ తప్పిదాలను కప్పి పుచ్చేందుకు జూన్ 14న రావాల్సిన ఫలితాలను, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేసి విద్యార్థులను పక్కదారి పట్టించారని విమర్శించారు. నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించడంతో పాటు ఎన్టీఏపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేయగా.. వారిని పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థి యువజన నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

ఢిల్లీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మణ్‌తో కలిసి ఢిల్లీకి వెళ్లారు. అక్కడ ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆయనతో చర్చలు జరిపారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. గత మూడు రోజులుగా హైదరాబాద్‌లో బుజ్జగించినా ఆయన శాంతించలేదు. దీంతో ఆయనకు ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు రావడంతో హుటాహుటిన వెళ్లారు. పార్టీలో సముచిత గౌరవం కల్పిస్తామంటూ అగ్రనేతలు జీవన్‌రెడ్డికి నచ్చజెప్పనున్నారు. తన రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

'నీట్'తో అంతా బహిర్గతం

- 'వన్ నేషన్-వన్ ఎగ్జామ్' విఫల ప్రయోగం
- 'కేంద్రీకృత' పరీక్షలు సరికావు
- మోడీ పాలనపై మేధావులు, నిపుణుల ఆగ్రహం



న్యూఢిల్లీ : దేశంలో వైద్య కోర్సుల ప్రవేశ పరీక్ష (నీట్) ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. పేపర్ లీక్‌లు, పరీక్ష వాయిదాలతో యూజీ, పీజీలలో అడ్మిషన్లు కోరే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అయితే, 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్'గా తీసుకొచ్చిన ఈ నీట్ ఒక విఫల ప్రయోగమని మేధావులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చీఫ్‌ను తొలగించటం, కమిటీని ఏర్పాటు చేయటం వంటివి కొంత వరకు జరిగినా విలువైన విద్యార్థుల సమయాన్ని మోడీ ప్రభుత్వం వృథా చేసిందని మేధావులు అంటున్నారు. 'నీట్' విషయంలో మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనబడుతున్నదని కాంగ్రెస్ వంటి విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే, మోడీ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా కార్పొరేట్ మీడియా తన వంతు కృషి చేస్తున్నదని పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయం నుంచి విద్య వరకు.. కేంద్రీకృతం చేయటానికి మోడీ సర్కారు భావిస్తున్నదనీ, భారత్ వంటి అతిపెద్ద విశాల దేశంలో ఈ విధానం ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని నిపుణులు చెప్తున్నారు. నీట్-యూజీ, జేఈఈ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి వాటితో సహా 15 ప్రధాన పరీక్షలు దేశంలో నిర్వహించ బడుతున్నాయి. ఆచరణాత్మకంగా దేశవ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించటానికి సంబంధించిన పనులన్నీ అవుట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించబడతాయి. వారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్లు తమ సిబ్బందితో పరీక్షలను నిర్వహించటం, ఐటీ సిస్టమ్‌లు, క్యూఆర్ కోడ్-సంబంధిత పని వంటి అన్ని సాంకేతిక పనులు ఔట్‌సోర్సింగ్ ద్వారానే జరుగుతాయి. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షలైన వీటికి ఔట్‌సోర్సింగ్ సహాయం తీసుకుంటే లీక్‌కు దారులు తెరిచినట్టేనని మేధావులు అంటున్నారు.

ఈ పరీక్షల బాధ్యతను ఎన్టీఏ చేపట్టక ముందు సీబీఎస్ఈ, ఏఐసీటీఈ వంటి ప్రభుత్వ సంస్థలు ఈ పరీక్షలను నిర్వహించేవి. స్టేట్ సెలక్షన్ బోర్డ్‌ల వంటి వివిధ రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలో, అలాగే రైల్వేలు, బ్యాంకుల వంటి రంగాల కోసం రిక్రూట్‌మెంట్‌లో కూడా ఔట్‌సోర్సింగ్ జరిగిందని విశ్లేషకులు చెప్తున్నారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఇప్పుడు కనిపిస్తున్న లోపాలు రాష్ట్రాలలో పదేపదే బయటపడ్డాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రచురించబడిన ఒక ఆంగ్ల వార్తా సంస్థ సమాచారం ప్రకారం.. గత ఐదేండ్లలో 15 రాష్ట్రాల్లో కనీసం 48 పేపర్ లీక్ కేసులు కనుగొనబడ్డాయి. ఈ లీక్‌లు సుమారు 1.2 లక్షల పోస్టులకు కనీసం 1.4 కోట్ల మంది దరఖాస్తుదారుల జీవితాలను ప్రభావితం చేశాయి.

కేంద్రీకృత పరీక్షలు ఎందుకు?

మోడీ పాలనలో గత కొన్నేండ్లుగా 'కేంద్రీకృత' వ్యవస్థ అంశం ఎక్కువగా వినబడుతున్నది. పరీక్షల నిర్వహణకు కేంద్ర పరీక్షా ఏజెన్సీని కలిగి ఉండాలనే ఆలోచన కూడా మొదట 1990 ప్రారంభంలో సూచించబడిందన్నది విశ్లేషకులు చెప్తున్నారు. కానీ, మోడీ ప్రభుత్వం జాతీయవాద శక్తిపై "ఒకే దేశం, ఒకటే ప్రతిదీ" అనే భావజాలాన్ని వ్యాపింప చేయాలనీ, దానిని ప్రజలపై బలంగా రుద్దాలని చూస్తున్నదని అంటున్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్, వన్ రేషన్ కార్డు, హెల్త్ కార్డు వంటివి ఇందులో భాగమని వారు చెప్తున్నారు. అన్ని ప్రాంతీయ ఆకాంక్షలు, వైవిధ్యాలకు భిన్నంగా ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థలు దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కావని మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ వంటివి విఫల ప్రయోగాలనీ, వీటితో మోడీ సర్కారు విద్యార్థులు, నిరుద్యోగులు, దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నదని వారు ఆరోపిస్తున్నారు.

నవచిత్రం



డివోషనల్ థ్రిల్లర్.. షణ్ముఖ

వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. 'శాసనసభ' అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన చివరి షెడ్యూల్‌తో ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుంది.

ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ,'ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్రం కోసం ఎంతో రిచ్‌గా వేసిన ఓ సెట్‌లో చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. కేజీఎఫ్, సలార్ చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బసూర్ ఈ చిత్రానికి స్టనింగ్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం అత్యున్నత సాంకేతిక నిపుణులతో నిర్మాణాంతర పనులు మొదలు కానున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఓ వండర్‌ఫుల్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. తప్పకుండా ఈ చిత్రం ఆది కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది తప్పకుండా ప్రేక్షకులను బాగా అలరిస్తుంది' అని అన్నారు.

హీరో ఆదిసాయికుమార్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఇప్పటివరకు ఎన్నో రకాల సినిమాలు చేశాను. అవన్నీ ఓ ఎత్తయితే ఈ సినిమా మరో ఎత్తు. ఓ సరికొత్త పాయింట్‌తో మంచి కంటెంట్‌తో రూపొందుతున్న ఈ తరహా చిత్రంలో నటించడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో బాగా గుర్తుండిపోయే సినిమాగా ఇది విశేష ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. మా దర్శకుడు అనుకున్న కథని తెరకెక్కించేందుకు బాగా కష్టపడ్డారు. ఆయన కష్టం కచ్చితంగా స్క్రీన్ మీద కనిపిస్తుంది. ఇక మా నిర్మాతలు ఏ విషయంలోనూ రాజీ పడకుండా సినిమాను ఓ విజువల్ వండర్‌లా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు' అని తెలిపారు.



జరపైలం

అత్యున్నతస్థాయి నాణ్యత పరీక్షలో ఔషధ నమూనాలు విఫలం

- ఇందులో పారాసెటమాల్‌తో సహా 50 డ్రగ్స్
- ప్రామాణిక నాణ్యత లేనివిగా గుర్తించిన సీడీఎస్‌సీఓ



న్యూఢిల్లీ: భారత్‌లోని అగ్రశ్రేణి ఔషధ నియంత్రణ సంస్థ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ) బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ల చికిత్స కోసం విస్తృతంగా ఉపయోగించే పారాసెటమాల్, పాంటోప్రజోల్, కొన్ని యాంటీబయాటిక్స్‌తో సహా దాదాపు 50 ఔషధాల నమూనాలను 'ప్రామాణిక నాణ్యత లేనివి' అని కనుగొన్నది. వీటితో పాటు అనేక ఔషధ నమూనాలు అత్యున్నతస్థాయి నాణ్యత పరీక్షలో విఫలమయ్యాయి. రాష్ట్ర డ్రగ్ రెగ్యులేటర్లు ప్రమేయం ఉన్న ఫార్మాస్యూటికల్ కంపెనీలకు నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తున్నది. మే నెలలో అపెక్స్ డ్రగ్ రెగ్యులేటరీ బాడీ నుంచి వచ్చిన హెచ్చరిక ప్రకారం.. హిమాచల్ ప్రదేశ్‌లో ఇరవై రెండు సబ్-స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేయబడ్డాయి. జైపూర్, హైదరాబాద్, వాఘోడియా, గుజరాత్‌లోని వడోదర, ఏపీ, ఇండోర్‌ల నుంచి కూడా నమూనాలను సేకరించారు. జూన్ 20న జారీ చేసిన డ్రగ్ అలర్ట్ ప్రకారం మొత్తం 52 నమూనాలు సీడీఎస్‌సీఓ నిర్వహించిన నాణ్యత పరీక్షలో విఫలమయ్యాయి. కాగా, లోపభూయిష్ట నమూనాలను మార్కెట్ నుంచి వెనక్కి రప్పించటానికి రాష్ట్ర డ్రగ్ నియంత్రణ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో తయారైన దాదాపు 120 ఔషధాల నమూనాలు గతేడాది పరీక్షలలో విఫలమయ్యాయి.

ఆటలు



ఐసీసీ టీ20 ప్రపంచకప్ అంతిమ ఘట్టానికి చేరుకుంది. గ్రూప్ దశ, సూపర్8 దశ ముగించుకుని కీలక సెమీఫైనల్స్‌కు సిద్ధమైంది. పొట్టి ప్రపంచకప్ ఆది నుంచి సంచలనాలే నమోదవగా.. సూపర్ 8 సమరం సైతం సంచలనంతోనే ముగిసింది. ఏడు మ్యాచుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన నాలుగు జట్లు ఆఖరు సవాల్‌కు సిద్ధమయ్యాయి. నేడు తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా, అఫ్గనిస్థాన్ తలపడనుండగా.. రెండో సెమీఫైనల్లో భారత్, ఇంగ్లాండ్ ఢీకొట్టనున్నాయి. సఫారీ, అఫ్గాన్ ఐసీసీ తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తుండగా.. భారత్, ఇంగ్లాండ్ మరోసారి టీ20 వరల్డ్‌కప్ సొంతం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. ఐసీసీ ప్రపంచకప్‌ను ఇప్పటివరకు అజేయ రికార్డుతో ఏ జట్టూ సాధించలేదు. సరికొత్త రికార్డుతో ప్రపంచకప్ టైటిల్ కైవసం చేసుకునే సువర్ణావకాశం భారత్, దక్షిణాఫ్రికా ముంగిట నిలిచింది!. ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ సవాల్ నేడు. భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆరంభం కానుండగా.. అఫ్గాన్‌తో సఫారీ పోరు ఉదయం 6 గంటలకు షురూ కానుంది.

చరిత్ర వేటాడుతూ..!

- సెమీఫైనల్లో అఫ్గాన్, సఫారీ ఢీ
- తొలిసారి ఫైనల్లో చోటు కోసం తహతహ

ఉదయం 6 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-తరౌబా





2004.. అఫ్గనిస్థాన్ తొలి అధికారిక క్రికెట్ మ్యాచ్ ఆడిన ఏడాది. 20 ఏండ్లలో ఆ జట్టు ఏకంగా 20 జట్లు పోటీపడిన మెగా ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. కొన్ని జట్లు 50 ఏండ్లలో సాధించలేని ఘనత.. అఫ్గనిస్థాన్ 20 ఏండ్లలో సాధించింది. సహజ ప్రతిభకు నైపుణ్యత సైతం తోడవటంతో అఫ్గనిస్థాన్ అగ్రజట్లను నిలకడగా నిలువరించే స్థాయికి ఎదిగింది. 10 ఏండ్ల నిరీక్షణ అనంతరం ఐసీసీ టోర్నమెంట్‌లో సెమీఫైనల్స్‌కు చేరుకున్న దక్షిణాఫ్రికా.. గత చేదు రికార్డులను తుడిచిపెట్టాలనే సంకల్పంతో కనిపిస్తుంది. గతంతో పోల్చితే ఒత్తిడితో కూడిన ఉత్కంఠ మ్యాచుల్లో సఫారీలు చిరస్మరణీయ విజయాలు నమోదు చేశారు. ఇదే జోరు మరో రెండు మ్యాచుల్లోనూ కొనసాగించాలని మార్‌క్రామ్‌సేన భావిస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్ పోరులో అఫ్గనిస్తాన్, దక్షిణాఫ్రికా నేడు తలపడనున్నాయి.

ఉరిమే ఉత్సాహం : అఫ్గనిస్థాన్ క్రికెట్ చరిత్రలో నేడు అతిపెద్ద మ్యాచ్ ఆడనుంది. తొలిసారి సెమీస్‌కు చేరిన రికార్డుతో ఆగిపోకూడదనే పట్టుదల ఆ జట్టులో కనిపిస్తుంది. అఫ్గాన్ శిబిరంలో ప్రతిభకు ఎన్నడూ కొదవ లేదు. బంగ్లాదేశ్‌పై సూపర్8 విజయం సాధించిన అఫ్గాన్ జట్టులో ఏకంగా 8 మంది ఆటగాళ్లు ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అఫ్గాన్ ప్రధాన బలం బౌలింగ్. కెప్టెన్ రషీద్ ఖాన్ టీ20 ఫార్మాట్‌లో మకుటం లేని మాయగాడు. మహ్మద్ నబి, నూర్ అహ్మద్ స్పిన్ ద్వయం ప్రత్యర్థి పరుగుల వేట మరింత కష్టతరం చేయగలరు. అఫ్గాన్ పేస్ పదును సైతం ఎక్కువే. ఫజల్‌హాక్ ఫరూకీ, నవీన్ ఉల్ హాక్ కొత్త బంతితో నిప్పులు చెరుగుతున్నారు. పేస్, స్వింగ్‌కు తోడు తెలివిగా స్లో బాల్స్‌తో బ్యాటర్లను బోల్తా కొట్టిస్తున్నారు. అఫ్గాన్ ఆందోళన చెందాల్సిన విభాగం బ్యాటింగ్. ఓపెనర్లు గుర్బాజ్, ఇబ్రహీం మినహా ఎవరూ నిలకడగా రాణించటం లేదు. ఈ ఇద్దరు సైతం ఛేదనలో మెరుగ్గా రాణించలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన మ్యాచుల్లో గుర్బాజ్, ఇబ్రహీం నాలుగుసార్లు 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదు చేశారు. మిడిల్ ఆర్డర్ ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. మహ్మద్ నబి, కరీం జనత్, అజ్మతుల్లా రాణిస్తే.. అఫ్గనిస్థాన్ బ్యాటింగ్ కష్టాలు తీరినట్టే. ఛేదనలో అఫ్గాన్‌కు మంచి రికార్డు లేదు. తొలుత బ్యాటింగ్ చేస్తే అఫ్గాన్ అవకాశాలు మెరుగ్గా ఉంటాయి!.

సఫారీ సై : అగ్రజట్టు దక్షిణాఫ్రికాకు ఐసీసీ ఈవెంట్లలో అత్యంత చెత్త రికార్డు ఉంది. దిగ్గజాలు బరిలో నిలిచినా.. అనుకోని పరిస్థితులతో ఓటమి చెందటం ఆ జట్టు గత చరిత్ర. ఈ వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా కొత్తగా కనిపిస్తోంది. ఒత్తిడిని జయిస్తూ ప్రత్యర్థులను చిత్తు చేస్తోంది. గ్రూప్, సూపర్8 దశల్లో అజేయంగా నిలిచింది. అన్ని రంగాల్లోనూ జోరు మీదున్న దక్షిణాఫ్రికా టైటిల్ పోరుకు చేరుకోవాలని తపన పడుతోంది. స్పిన్ అస్త్రంతో సవాల్ విసురుతున్న అఫ్గాన్‌కు.. హెన్రిచ్ క్లాసెన్ బదులు ఇస్తాడని సఫారీలు భావిస్తున్నారు. స్పిన్‌పై కండ్లుచెదిరే హిట్టింగ్ చేయగల క్లాసెన్ నేటి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాకు ఎక్స్ ఫ్యాక్టర్. బ్యాటింగ్ లైనప్‌లో హెండ్రిక్స్ మినహా అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్ విభాగం సైతం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. కుడి చేతి బ్యాటర్లతో కూడిన అఫ్గాన్ బ్యాటింగ్ లైనప్‌కు కేశవ్ మహరాజ్ స్పిన్‌తో పరీక్షగా నిలువనున్నాడు.

పిచ్,వాతావరణం : గ్రూప్ దశలో ఇక్కడ జరిగిన మ్యాచుల్లో నిలకడలేని బౌన్స్ కనిపించింది. సెమీఫైనల్ మ్యాచ్ పిచ్‌కు క్యూరేటర్ కొన్ని సొబగులు అద్దాడు. నేటి మ్యాచ్‌లో బౌన్స్ ప్రభావం కచ్చితంగా ఉంటుందని చెప్పవచ్చు. కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) మ్యాచుల్లో ఇక్కడ మంచు ప్రభావం ఎక్కువగా కనిపించింది. రాత్రి వేళ మ్యాచ్ కావటంతో మంచు ప్రభావం తీసిపారేయలేం. అఫ్గాన్, సఫారీ సెమీస్‌కు ఎటువంటి వర్షం ముప్పు లేదని చెప్పవచ్చు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపనున్నాయి.

ఈసారి దాటేస్తారా?

- ప్రతీకార విజయంపై రోహిత్‌సేన గురి
- ఇంగ్లాండ్‌తో భారత్ సెమీస్ పోరు నేడు
- రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-గయానా



భారత్, ఇంగ్లాండ్ మరో మెగా మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ రిపీట్ పోరుకు ప్రొవిడెన్స్ వేదిక కానుంది. మాజీ చాంపియన్ టీమ్ ఇండియా నేడు డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌తో సెమీస్ ఫైట్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. భీకర ఫామ్‌లో ఉన్న భారత్.. రెండేండ్ల కిందట ఆడిలైడ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంది.

భారత్ దూకుడు :

అజేయ రికార్డుతో భారత్ సెమీస్‌కు చేరుకుంది. అన్ని రంగాల్లోనూ దీటుగా రాణిస్తుంది. కెప్టెన్ రోహిత్ శర్మ ఆసీస్‌పై విశ్వరూపం దాల్చి డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం మరింత తేలిక చేశాడు. విరాట్ కోహ్లి సైతం పరుగుల వేటలో మెరిస్తే నేడు ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు కనిపించటం ఖాయమే. జీవం లేని పిచ్‌లపై ఆడిన అనుభవం భారత మిడిల్ ఆర్డర్ సొంతం. రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య మంచి ఫామ్‌లో ఉన్నారు. స్పిన్ పిచ్‌పై ఇంగ్లాండ్ మాయగాళ్లపై శివం దూబె భారత్‌కు కీలకం కానున్నాడు. బ్యాటింగ్ లైనప్‌లో అందరూ ఫామ్‌లో ఉండటం భారత్‌కు అదనపు బలం. దూకుడు మంత్ర పఠిస్తున్న టీమ్ ఇండియా నేడు భారీ స్కోరుపై గురి పెట్టనుంది. బుమ్రా, అర్షదీప్‌లు మరోసారి పేస్ బాధ్యతలు తీసుకోనుండగా.. కుల్దీప్ యాదవ్ మాయజాలం నేడు మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ నైపుణ్యాలు నేడు అవసరం రానున్నాయి!.

ఇంగ్లాండ్ ఏం చేసేనో! :

ఇంగ్లాండ్ భీకర ఫామ్‌లో లేకపోయినా.. సెమీఫైనల్ స్ఫూర్తి ఆ జట్టును ముందుకు నడిపిస్తుంది. జోశ్ బట్లర్, ఫిల్ సాల్ట్ మినహా బ్యాటర్లలో ఎవరూ నిలకడగా రాణించటం లేదు. హ్యారీ బ్రూక్, జానీ బెయిర్‌స్టో ఒకట్రెండు ఇన్నింగ్స్‌ల మెరుపులకే పరిమితం అయ్యారు. భారత స్పిన్నర్లపై నేడు బ్యాటర్లు సమిష్టిగా మెరిస్తేనే ఇంగ్లాండ్ పోటీ ఇవ్వగలదు. స్పిన్నర్లు ఆదిల్ రషీద్, మొయిన్ అలీ నేడు ఇంగ్లీశ్ జట్టుకు కీలకం కానున్నారు.

స్పిన్ స్వర్గధామం! :

ప్రొవిడెన్స్ పిచ్ స్పిన్‌కు సహకరించనుంది. పేసర్లకు బౌన్స్ లేకపోగా..స్పిన్నర్లకు మంచి టర్న్ లభించనుంది. నాణ్యమైన స్పిన్నర్లు కలిగిన టీమ్ ఇండియాకు ఇది అనుకూలతే. ఉదయం మ్యాచ్ కావటంతో మంచు ప్రభావం పూర్తిగా ఉండదు. ఈ ప్రపంచకప్‌లో ఇక్కడ నమోదైన సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 146 పరుగులు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

వర్షం ముప్పు? :

భారత్, ఇంగ్లాండ్ సెమీస్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో మ్యాచ్ సాగటంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రెండో సెమీస్‌కు రిజర్వ్ డే సైతం లేదు. కానీ మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించేందుకు అదనంగా 250 నిమిషాల సమయాన్ని కేటాయించారు. సెమీస్ మ్యాచ్ ఫలితం తేల్చేందుకు కనీసం 10 ఓవర్ల మ్యాచ్ జరగాల్సి ఉంటుంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతికి సైతం ఇది వర్తిస్తుంది. వర్షంతో మ్యాచ్ సాగకుంటే.. సూపర్8 దశలో మెరుగైన ప్రదర్శనతో భారత్ నేరుగా ఫైనల్లోకి ప్రవేశించనుంది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి

• విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితేనా? • రాజ్యాంగం ఏం చెబుతుంది?

నవతెలంగాణ ప్రతినిధి జే.జగదీష్

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్ష పార్టీలకు ఇవ్వాలని, అప్పుడే లోక్‌సభ స్పీకర్ పదవి ఏకగ్రీవం అయ్యేందుకు తాము మద్దతిస్తామని ప్రతిపక్ష ఇండియా ఫోరం పార్టీలు షరతుపెట్టాయి. అధికార ఎన్డీఏ ఈ అంశంపై ఏకాభిప్రాయానికి ప్రయత్నించకపోవడం, ప్రతిపక్ష సభ్యుడు డిప్యూటీ స్పీకర్‌గా ఉంటారని ప్రకటించకపోవడంతో ఇండియా ఫోరం స్పీకర్ పదవికి పోటీ చేసింది. దీంతో 50 ఏండ్ల తరువాత లోక్‌సభ స్పీకర్ పదవికి బుధవారం ఎన్నిక జరిగింది.

అసలు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్ష పార్టీలకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందా? అసలు రాజ్యాంగం ఏం చెబుతోందో తెలుసుకుందాం... మోడీ సర్కార్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత డిప్యూటీ స్పీకర్ స్థానాన్ని ఐదేండ్ల పాటు ఖాళీగా ఉంచింది. లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సైతం 2019 నుంచి డిప్యూటీ స్పీకర్ స్థానం ఖాళీగా ఉన్నట్టు చూపిస్తుంది.



డిప్యూటీ స్పీకర్ లేకుండా 17వ లోక్‌సభ

స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారి 17వ లోక్‌సభ (మోడీ సర్కార్ రెండోసారి అధికారంలో ఉన్న సమయం) డిప్యూటీ స్పీకర్ లేకుండానే నడిచింది. ఆ పదవి అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం తప్పనిసరి. కానీ మోడీ సర్కార్ రాజ్యాంగ నిబంధనలను కూడా పక్కనబెట్టి, ఐదేండ్ల పాటు డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా మొండిగా వ్యవహరించింది. అయితే 17వ లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణలు కూడా జరిగాయి.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం లోక్‌సభ సభ్యులలో ఇద్దరిని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఆ ఎన్నిక తేదీని రాష్ట్రపతి ఖరారు చేస్తారు. స్పీకర్‌ను ఎన్నుకున్నప్పుడే, డిప్యూటీ స్పీకర్‌నూ ఎన్నుకుంటారు. ఇది సాధారణంగా కొత్త లోక్‌సభ రెండో సెషన్‌లో నిర్వహిస్తారు. 1952 నుంచి 1969 వరకు అధికార పార్టీ కాంగ్రెస్ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులను నిర్వహించింది. 1952లో కాంగ్రెస్‌కు చెందిన అహ్మదాబాద్ ఎంపీ జీవి మావలంకర్ (1952-56) మొదటి లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు. అప్పుడు మొదటి డిప్యూటీ స్పీకర్‌గా కాంగ్రెస్‌కు చెందిన చిత్తూరు ఎంపీ ఎంఎ అయ్యంగార్ వ్యవహరించారు. ఆ తరువాత 1956 నుంచి 1962 వరకు కూడా ఆయనే స్పీకర్‌గానూ, హుకమ్ సింగ్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. 1962 నుంచి 1967 వరకు హుకమ్ సింగ్ స్పీకర్‌గానూ, ఎస్వీ కృష్ణమూర్తి రావు డిప్యూటీ స్పీకర్‌గానూ వ్యవహరించారు. 1967 నుంచి 1969 వరకు నీలం సంజీవ్ రెడ్డి స్పీకర్‌గా, రఘునాథ్ కేశవ్ ఖదిల్కర్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. ఇక్కడి వరకు అధికార పార్టీ సభ్యులే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులను నిర్వహించారు. అయితే 1969లో మార్పు వచ్చింది. 1969 (నాలుగో లోక్‌సభ మధ్య)లో స్పీకర్‌గా గుర్దియాల్ సింగ్ ధిల్లాన్ వ్యవహరించగా, అల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్‌కు చెందిన గిల్బర్ట్ జి స్వేల్ (అప్పుడు ఆయన మణిపూర్‌లోని షిల్లాంగ్ ఎంపీ)కు డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టారు. ఈ డిప్యూటీ స్పీకర్ పదవి కూటమిలో భాగస్వామికి లేదా, ప్రతిపక్షానికి ఇచ్చే సంప్రదాయం అప్పటి నుంచే మొదలైంది.

1969లో రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడానికి లోక్‌సభ స్పీకర్ నీలం సంజీవ రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో చీలిక నేపథ్యంలో ఈ నిర్ణయం ముందుకు వచ్చింది. ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పంజాబ్ నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ గుర్దియాల్ సింగ్ ధిల్లాన్‌ను లోక్‌సభ స్పీకర్‌గా చేసింది. గిల్బర్ట్ జి స్వేల్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించారు. 1977లో జనతా పార్టీ తరపున నీలం సంజీవ రెడ్డి లోక్‌సభ స్పీకర్ కాగా, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చెందిన ఏపీకి చెందిన ఎంపీ గోడే మురహరికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చింది. 1980లో కాంగ్రెస్ మిత్ర పక్షమైన తమిళనాడుకు చెందిన డీఎంకేకు చెందిన ఎంపీ జి. లక్ష్మణ్ డిప్యూటీ స్పీకర్ అయ్యారు. తరువాత 1984లో రాజీవ్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమిళనాడులోని అన్నాడీఎంకే పార్టీకి డిప్యూటీ స్పీకర్ పదవినిచ్చింది. ఆ పార్టీకి చెందిన తంబిదురై డిప్యూటీ స్పీకర్ అయ్యారు.

1989లో కేంద్రంలో జనతాదళ్ నేతృత్వంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు కాంగ్రెస్‌కు చెందిన శివరాజ్ పాటిల్ డిప్యూటీ స్పీకర్ అయ్యారు. జనతాదళ్‌కు చెందిన రబీ రే స్పీకర్‌గా ఉన్నారు. తరువాత 1991లో పదో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అప్పుడు స్పీకర్‌గా శివరాజ్ పాటిల్ ఉన్నారు. కర్నాటక నుంచి బీజేపీ ఎంపీ ఎస్.మల్లికార్జునయ్యకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారు. 1996లో జరిగిన ఎన్నికల్లో యూనైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ ఎంపీ పీఏ సంగ్మా స్పీకర్‌గా, బీజేపీకి చెందిన సూరజ్ భాన్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు.

1998-99, 1999-2004 రెండు లోక్‌సభల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఉంది. 1998 నుంచి 2002 వరకు టీడీపీకి చెందిన అమలాపురం ఎంపీ జీఎంసీ బాలయోగి స్పీకర్‌గా ఉన్నారు. తరువాత 2002 నుంచి 2004 వరకు శివసేన ఎంపీ మనోహర్ జోషి స్పీకర్‌గా ఉన్నారు. అయితే రెండు సందర్భాల్లో డిప్యూటీ స్పీకర్‌గా కాంగ్రెస్ ఎంపీ పీఎం సయిద్ ఉన్నారు.

యూపీఏ-1 (2004-09) ప్రభుత్వంలో స్పీకర్‌గా సీపీఐ(ఎం)కు చెందిన సోమనాథ్ ఛటర్జీ ఉండగా, పంజాబ్‌కు చెందిన ఎన్డీఏ భాగస్వామి పార్టీ శిరోమణి అకాలీదళ్‌కి చెందిన చరణ్‌జిత్ సింగ్ అత్వాల్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. యూపీఏ-2 (2009-14) ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎంపీ మీరాకుమారి స్పీకర్‌గా ఉండగా, బీజేపీకి చెందిన కరియా ముండా డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు.

2014లో మోడీ సర్కార్ హయాంలో బీజేపీ ఎంపీ సుమిత్రా మహాజన్ స్పీకర్‌గా ఉండగా, డిప్యూటీ స్పీకర్‌గా అన్నాడీఎంకేకు చెందిన తంబిదురై ఉన్నారు. 2019లో రెండోసారి మోడీ సర్కార్ అధికారంలోకి రాగా స్పీకర్‌గా ఓం బిర్లా ఉన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా పెట్టారు. ఐదేండ్ల పాటు ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. ప్రతిపక్షాలకు తగినంత బలం లేకపోవడంతో తమకు ఇవ్వాలని డిమాండ్ చేయలేదు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బలం పెరగడంతో డిప్యూటీ స్పీకర్ పదవిని డిమాండ్ చేస్తున్నాయి.

ఆర్టికల్ 95 ప్రకారం, స్పీకర్ లేనప్పుడు సభను, విధులను డిప్యూటీ స్పీకర్ నిర్వహిస్తారు. డిప్యూటీ స్పీకర్ కూడా లేకపోతే రాష్ట్రపతి నియమించిన లోక్‌సభ ఎంపీ సభను, విధులను నిర్వహిస్తారు. ఆర్టికల్ 94 ప్రకారం స్పీకర్ రాజీనామా చేయాలనుకుంటే, తమ రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్‌కు అందజేస్తారు. అయితే ఈ అంశంపై సభలోనూ చర్చ జరిగింది. 1949లో హెచ్‌వి కామత్ స్పీకర్ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించాలని వాదించారు. స్పీకర్ ఆధీనంలో డిప్యూటీ స్పీకర్ ఉన్నందున, డిప్యూటీ స్పీకర్‌కు కాకుండా, తనను నియమించే వారికే రాజీనామా లేఖను అందజేయాలని వాదించారు. అందుకు బీఆర్ అంబేద్కర్ అంగీకరించలేదు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ సభ చేత నియమితులవ్వడం లేదా ఎన్నికవడం జరుగుతుంది. కనుక స్పీకర్, డిప్యూటీ స్పీకర్ తమ రాజీనామాల ను తమను నియమించే సభకు సమర్పించాల్సి ఉంటుందని అంబేద్కర్ అన్నారు. అలాగే సభకు ప్రాతినిధ్యం వహించే స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌కు రాజీనామాను అందజేయవచ్చని వాదించారు.

ఏవో పోస్టులకు 145 మంది ఎంపిక టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, సహకార శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టులకు 145 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 148 ఏవో పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 28న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. మల్టీజోన్-1, మల్టీజోన్-2 పరిధిలో 145 మంది అభ్యర్థులను ప్రొవిజినల్‌గా ఎంపిక చేశామని తెలిపారు. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను జోన్ల వారీగా ఉుుఉ.ంఞాం౧.ఠ్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. 148 ఏవో పోస్టుల భర్తీకి గతేడాది మే 16న ఆన్‌లైన్‌లో సీబీఆర్టీ విధానంలో రాతపరీక్షలను నిర్వహించామనీ, 8,961 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 8,074 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. పేపర్-1కు 6,546 మంది, పేపర్-2కు 6,519 మంది హాజరయ్యారని వివరించారు.

నీట్ సాధనకు కోటా డిజిటల్ మెటీరియల్ సిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్-2025కు సన్నద్ధమౌతున్న విద్యార్థుల కోసం కోటా నీట్ డిజిటల్ స్టడీ మెటీరియల్ సిద్ధంగా ఉన్నది. క్విక్ రివిజన్ ముఖ్యమైన ప్రశ్నలు, ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి ప్రశ్నలు, పాత ప్రశ్నాపత్రాల ప్రశ్నలు, టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్‌ను చాప్టర్ల వారీగా బుక్‌లెట్లు సిద్ధం చేసినట్టు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్లను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందొచ్చని సూచించింది. మరింత సమాచారం కోసం నీట్ 2025 అని టైప్ చేసి 9849016661 నెంబర్‌కు మెసేజ్ చేయాలని కోరింది.

జేఏసీ కార్యాచరణలో భాగస్వాములమవుతాం : టీటీజీడీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల మరియు గెజిటెడ్ అధికారుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి చేపట్టబోయే కార్యచరణలో తాము కూడా భాగస్వాములవుతామని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం (టీటీజీడీఏ)తెలిపింది. ఈ మేరకు బుధవారం సంఘం అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లెపాక, సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ ప్రకాష్, కోశాధికారి డాక్టర్ ఎల్.రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. జేఏసీ ప్రధాన డిమాండ్లలో బోధనా వైద్యులకి సంబంధించినవి కూడా ఉన్నాయని వారు తెలిపారు. ముఖ్యంగా గత 11 ఏండ్లుగా సాధారణ బదిలీలు చేయలేకపోవడంతో ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారని చెప్పారు. వాటిని వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

• నిరసనలకు మాజీమంత్రి హరీశ్‌రావు మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభ్యర్థుల నిరసనలకు ఆయన మద్దతు ప్రకటించారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా మొర ఆలకించకపోవడం శోచనీయమని విమర్శించారు. పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా విద్యాప్రమాణాలను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు నష్టం జరగకుండా, ఒక్క పోస్టు కూడా మిగిలిపోవద్దనే లక్ష్యంతో ఫలితాలను ప్రకటించి వాటిని భర్తీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. దీనివల్ల సుమారు 2,500పైగా ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయి నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను కోల్పోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పోస్టులు బ్యాక్‌లాగ్ లేకుండా హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం భర్తీ చేయాలని సూచించారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వన్యప్రాణులను వేటాడితే.. చంపితే కఠిన చర్యలు

పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ చీఫ్ పర్గెయిన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వన్యప్రాణులను వేటాడినా, చంపినా కఠిన చర్యలు తీసుకుంటామనీ, చట్టపరంగా శిక్షలుంటాయని పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ చీఫ్ ఎమ్‌సీ పర్గెయిన్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని మహవీర్ హరిణవనస్థలి జాతీయ పార్కులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేటగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న వేట సామాగ్రిని ప్రదర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణులను చంపడం, వేటాడే ప్రయత్నాలను నివారించడానికి 2023 డిసెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా క్యాచ్ ది ట్రాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరు నెలల కాలంలో 3,810 వలలు, ఉచ్చులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అడవుల్లో వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి ఏడాది కాలంలో ఆరుగురు చనిపోయారని



చెప్పారు. వేటగాళ్లు అమర్చిన వైర్లతో విద్యుద్ఘాతానికి గురై చనిపోయిన 57 వన్యప్రాణాలను గుర్తించామనీ, లెక్కలోకి రానివి ఇంకా ఎన్నో ఉంటాయని చెప్పారు. తమ డ్రైవ్ ప్రారంభించిన తర్వాత 6 నెలల కాలంలో మూడు విద్యుద్ఘాత కేసులే నమోదయ్యాయని వివరించారు. డ్రైవ్ గణనీయమైన ఫలితాలను సాధించిందనీ, అందులో అటవీ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరువలేనిదని కొనియాడారు. ఈ డ్రైవ్ కింద ఫారెస్ట్ సిబ్బంది సాధ్యమైన ప్రాంతాలను చుట్టుముట్టాలనీ, వేటకు సంబంధించి రికార్డుల్లో ఉన్న వ్యక్తులను, అనుమానితులను విచారించాలనీ, వేట కోసం వారు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ క్షేత్రాలు, అడవికి ఆనుకుని ఉన్న ప్రాంతాలను మరింత స్క్రీనింగ్ ద్వారా వలలు, ఉచ్చులు, పంజరాలు మొదలైన అన్ని రకాల పదార్థాలు, పరికరాలను స్వాధీనం చేసుకునేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టామన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ హబ్ కలను సాకారం చేస్తా...

- ఢిల్లీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి
- బాధ్యతలు స్వీకరణ
- రాష్ట్ర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తానని వెల్లడి
- ఐకాన్ టవర్‌గా తెలంగాణ భవన్ నిర్మిస్తాం : మంత్రి కోమటి రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి కలను సాకారం చేస్తానని ఢిల్లీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (ఎస్సార్) ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఈ దిశలో క్రీడా రంగంలో తన అనుభవాన్ని జోడించి రాష్ట్రానికే మేలు చేసేలా తనవంతు పాత్ర పోషిస్తానని వెల్లడించారు. 2036లో ఇండియాలో ఒలంపిక్స్ నిర్వహించే ఆస్కారం ఉందన్నారు. ఆ అవకాశం భారత్‌కు దక్కితే... హైదరాబాద్‌లో ఒలంపిక్స్ నిర్వహించేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. గడిచిన పదేండ్లలో స్పోర్ట్స్ రంగంలో తెలంగాణ వెనకబడిందన్నారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎస్సార్‌గా జితేందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి జానా రెడ్డి, వంశీచందర్ రెడ్డి, సంపత్, ఇతర నేతలు హాజరై జితేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణకు ముందు జితేందర్ రెడ్డి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గురజాడ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాజాగా ఖేలో ఇండియా స్కీంకు తెలంగాణ ప్రభుత్వం అప్లై చేసిందన్నారు. ఈ స్కీంలో వచ్చే నిధులతో రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల కల్పనను పెంపొందిస్తామన్నారు. అలాగే భవిష్యత్‌లో జరగబోయే ఇంటర్నేషల్ స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు హైదరాబాద్ వేదికయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. అలాగే గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహిస్తూ... జాతీయ స్థాయి వరకు వారు ఎదిగేందుకు బాటలు వేస్తామన్నారు. లోక్‌సభ పక్షనేతగా తనకున్న అనుభవం, కేంద్ర మంత్రులతో పరిచయాలతో అన్ని రంగాల్లో తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులు, అభివద్ధి ఫండ్స్ రాబట్టేలా కృషి చేస్తానని చెప్పారు.

ఐకానిక్ టవర్ గా తెలంగాణ భవన్...: మంత్రి కోమటి రెడ్డి

దేశ రాజధాని ఢిల్లీలో ఐకానిక్ టవర్‌గా తెలంగాణ భవన్‌ను నిర్మించ బోతున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అన్ని సౌకర్యాలు, హంగులతో ఈ భవన్ ఉంటుందని తెలిపారు. చిన్న రాష్ట్రాలైనా సిక్కిం కూడా దేశ రాజధానిలో అద్భుతమైన గెస్ట్ హౌజ్ నిర్మించుకుందని చెప్పారు. అలాంటప్పుడు రాష్ట్రం ఏర్పడి పదేండ్లయినా తెలంగాణకు భవన్ లేకపోవడం బాధగా ఉందన్నారు. ఉన్నా... ఆ భవన్‌ను ఇంకా ఏపీ భవన్‌గానే పిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తాను మంత్రిగా చార్జ్ తీసుకున్న మూడోరోజునే... తెలంగాణ భవన్ నిర్మాణంపై ఫోకస్ చేసినట్లు తెలిపారు. ఈ దిశలో ఏపీ ప్రభుత్వంతో చర్చించి తెలంగాణకు.. పటౌడి హౌజ్‌లో ఐదున్నర ఎకరాలు, శబరి బ్లాక్‌లో మూడున్నర ఎకరాలు కేటాయించేలా ఒప్పించామన్నారు. హైదరాబాద్ హౌజ్ పక్కన స్థలంలో గవర్నర్, సీఎం, మంత్రుల సూట్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. పటౌడి హౌజ్ జీ ప్లస్ వన్‌లో విశాలమైన తెలంగాణ భవన్ గెస్ట్ హౌజ్ కడతామన్నారు. మంగళవారం దాదాపు రెండు గంటల పాటు తెలంగాణ భవన్‌కు సంబంధించిన పలు డిజైన్లపై నిపుణులు ప్రజేంటేషన్ ఇచ్చారన్నారు. అందులో ఆడంబరాలు, రాజగోపురాలు పెట్టారని...వాటి తొలగింపు, పలు మార్పులు చేయాలని నిపుణులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ డిజైన్ ఫైనల్ కాగానే... హైదరాబాద్‌లో సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చి వారం రోజుల్లో డీపీఆర్ పూర్తి చేస్తామని చెప్పారు. కేవలం రెండు నెలల్లో టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. కేవలం మూడు నెలల్లో భవన్ నిర్మాణానికి ఢిల్లీ ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు పొందేలా చూడాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

లోక్‌సభలో మోడీకి దీటుగా రాహుల్‌గాంధీ

• టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభలో ప్రధాని మోడీకి దీటుగా ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్‌గాంధీ సమర్థవంతంగా వ్యవహరిస్తారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటులో మోడీ ఎమర్జెన్సీ గురించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎవరో చేసిన తప్పుకు ఇందిరా గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెద్ద నోట్లు రద్దు చేయడం తప్పు అనే విషయాన్ని ఇప్పటివరకు మోడీ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ ప్రతిసారి ఎమర్జెన్సీ గురించి మాట్లాడం సరైంది కాదని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. కేవలం ఇందిరా గాంధీపై కక్షతోనే ఆయన ఈ విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ప్రజాస్వామ్యమంటే అప్పుడు గుర్తుకు రాలేదా?

• కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాస్వామ్యం, అన్యాయం, అక్రమం అనే పదాలు...అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా? అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే తలసానిని బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్య విలువలు ఎటు పోయాయని నిలదీశారు. పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని వివరించారు. బీఆర్ఎస్‌లో మిగిలేది ఆ నలుగురు మాత్రమేనన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వివాదం తమ పార్టీ అంతర్గత విషయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు సముచిత గౌరవం ఇస్తారని చెప్పారు.

కేంద్ర మంత్రులకు జగ్గారెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంతో ఐటీఐఆర్‌ను వెంటనే మంజూరు చేయించాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్‌ను డిమాండ్ చేశారు. అప్పటివరకు తాను మాట్లాడుతూనే ఉంటానన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం ఐటీఐఆర్‌ను మంజూరు చేసినప్పుడు ఎంపీ రఘునందన్‌రావు టీఆర్ఎస్‌లో ఉన్నారని గుర్తు చేశారు. 1980లో రాజకీయంగా బీజేపీకి పెద్దగా గుర్తింపులేదనీ, ఆ పార్టీలో ఉన్నప్పటికీ తాను కష్టపడి రాజకీయంగా ఎదిగానన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే తామే ఐటీఐఆర్‌ను మంజూరు చేయించేవారమని వ్యాఖ్యానించారు. విద్యాపరంగా తాను చాలా బలహీనమనీ, రఘునందన్ రావు న్యాయవాది, చాలా పుస్తకాలు చదివాడనీ, కానీ తాను జీవితాన్ని చదివానని చెప్పారు. మరోసారి తన జోలికొస్తే మంచిగా ఉండదని హెచ్చరించారు.

దళిత బాలుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి : కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జామకాయలు తెంపుకున్నాడనే నెపంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామంలో ఏడో తరగతి చదువుతున్న దళిత బాలుడు బ్యాగరి యాదగిరి (12)పై దాడి చేసిన మధుసూదన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఇదే అంశంపై వారొక ప్రకటన విడుదల చేశారు. బాలుణ్ని తాళ్లతో కట్టేసి, కాళ్లతో తన్ని కులం పేరుతో దూషించిన ఆ గ్రామ పెత్తందారు రిటైర్డ్ ఉపాధ్యయుడు మధుసూదన్‌రెడ్డిని, ఆయన కుమారుడిని తక్షణమే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఆ దౌర్జన్యం వెనుక కులవివక్ష, అంటరానితనం దాగి ఉన్నాయని తెలిపారు. దళితుడు తమ చెట్టును ముట్టుకోవడమేంటనే అగ్రకుల దురహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించారు. ఈ ఘటనకు పాల్పడిన తండ్రీకొడుకులను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపకపోతే సామాజిక ప్రజా సంఘాలు ప్రతిఘటిస్తాయని వారు హెచ్చరించారు.

వారిపై చర్యలు తీసుకోండి

• మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ బి ఫామ్‌పైన గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్‌ను అపాయింట్‌మెంట్ కోరామని తెలిపారు. స్పీకర్ చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

జీవో 46 బాధితులకు అన్యాయం : రాకేశ్ రెడ్డి

జీవో 46 బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టులో కేసు 20 సార్లకుపైగా వాయిదా పడటం ప్రభుత్వ పుణ్యమేనని ఎద్దేవా చేశారు. అడ్వకేట్ జనరల్‌తో అబద్ధాలు ఆడిస్తూ, ప్రభుత్వమే దాటవేత ధోరణిని అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఒత్తిడికి తలొగ్గి క్యాబినెట్ సబ్ కమిటీ ప్రెస్‌మీట్ పెట్టిందే తప్ప ప్రభుత్వానికి కనీస చలనం లేదని తెలిపారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని వర్గాలకు బీఆర్ఎస్ అండ : జి.దేవి ప్రసాద్



రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఆ పార్టీ నేత జి.దేవి ప్రసాద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలను గాలికొదిలిన కాంగ్రెస్ సర్కార్‌పై అన్ని వర్గాలకు రోడ్ల మీదకు వస్తున్నారని తెలిపారు. వారితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీజేపీ బొగ్గు గనులను వేలం వేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వేలంలో కాంగ్రెస్ పాల్గొంటూ రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తున్నదని విమర్శించారు.